సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 126
గురువారం 27-7-2023
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'


'రిలయన్స్'లో 'ఖతార్' పెట్టుబడి
ఒక శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి.. డీల్ విలువ రూ.8,200 కోట్లు -13లో


వరల్డ్‌కప్ దిశగా సన్నాహకం...
వెస్టిండీస్‌తో నేడు భారత్ తొలి వన్డే. రాత్రి 7 గంటల నుంచి డీడీ స్పోర్ట్స్‌లో.. -12లో


ఘర్ మే ఘుస్ కే...
భారత్ తన గౌరవ ప్రతిష్టలను కాపాడుకోవడానికి నియంత్రణ రేఖను దాటడానికి సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారు.
వివరాలు 6లో ▸


నెదర్లాండ్స్ నౌకలో అగ్నిప్రమాదం
నెదర్లాండ్స్‌లోని ఉత్తర సముద్రంలో సరుకు రవాణా చేసే ఒక నౌకలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. 3 వేల కార్లు దగ్ధమయ్యాయి.
వివరాలు 6లో ▸


ఈడీ డైరెక్టర్‌ను కొనసాగిస్తాం
ఈడీ డైరెక్టర్ సంజయ్‌కుమార్ పదవీకాలాన్ని అక్టోబర్ 15 వరకూ పెంచేందుకు అనుమతి కోరుతూ కేంద్రం సుప్రీం తలుపు తట్టింది.
వివరాలు 6లో ▸


ఆగని హింసాకాండ
మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతోంది. మోరె జిల్లాలో అల్లరిమూక 30 ఇళ్లు, దుకాణాలు, బస్సులను తగులబెట్టింది.
వివరాలు 6లో ▸

అవిశ్వాసానికి అనుమతి

స్పీకర్ అనూహ్య నిర్ణయం

కాంగ్రెస్ తీర్మానానికి అనుమతి
త్వరలో లోక్‌సభలో చర్చ, ఓటింగ్
త్వరలో తేదీ నిర్ణయిస్తా: ఓం బిర్లా

లోక్‌సభ ఎన్నికలకు దాదాపు ఏడాది ఉండగానే అధికార బీజేపీ, కాంగ్రెస్ సారథ్యంలోని 'ఇండియా' కూటమి తదితర విపక్ష పార్టీల బాహాబాహీకి రంగం సిద్ధమైంది. అనూహ్యంగా లోక్‌సభ ఇందుకు వేదికగా మారనుంది! మణిపూర్ హింసాకాండ తదితరాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టే వ్యూహంతో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైన నాటినుంచీ విపక్షాలు ఉభయ సభలనూ స్తంభింపజేస్తుండటం తెలిసిందే. అందులో భాగంగా మరో అడుగు ముందుకేసి మోదీ సర్కారుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని అవి తాజాగా నిర్ణయించాయి. ఆ సవాలు స్వీకరించి విపక్షాల ఎత్తును చిత్తు చేసేలా మోదీ సర్కారు పై ఎత్తు వేయడం, అందులో భాగంగా కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పరిగణనలోకి తీసుకోవడం.. ఇలా బుధవారం హస్తినలో అనూహ్య రాజకీయ పరిణామాలు ఒకదాని వెంట ఒకటి చకచకా చోటుచేసుకున్నాయి...! అన్ని పార్టీలతో సంప్రదించాక నిబంధనల మేరకు అవిశ్వాస తీర్మానంపై చర్చ, ఓటింగ్ తేదీ, సమయం తదితరాలు వెల్లడిస్తానని స్పీకర్ ప్రకటించారు.

- వివరాలు 6లో


మణిపూర్ అంశంపై బుధవారం లోక్‌సభలో నిరసన వ్యక్తం చేస్తున్న విపక్ష పార్టీల ఎంపీలు

ఏమిటీ తీర్మానం...
ప్రభుత్వం మెజారిటీ కోల్పోయిందని భావించినప్పుడు బలం నిరూపించుకోవాలని విపక్షాలు లోక్‌సభలో ప్రవేశపెట్టేదే అవిశ్వాస తీర్మానం

ప్రభుత్వమే పరీక్షకు నిలిస్తే..
విశ్వాస తీర్మానం
6లో

మోదీ జోస్యమే నిజమైంది

27సార్లు.. ఒక్కటీ
నెగ్గలేదు
- విశ్వాస పరీక్షల్లో మాత్రం కేంద్రంలో మూడుసార్లు పడిపోయిన ప్రభుత్వాలు
- ఇందిరపై అత్యధికంగా పదిహేను 'అవిశ్వాసాలు'
- పీవీ ప్రభుత్వంపై మూడుసార్లు..
- రాజీవ్‌పై మన ఎంపీ మాధవరెడ్డి 'అవిశ్వాసం'

6లో


భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి-కొత్తగూడెం మధ్య కిన్నెరసాని బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతి

మరో రెండ్రోజులు కుండపోత
- అల్పపీడన ప్రభావంతో తెలంగాణ, ఏపీల్లో దంచి కొడుతున్న వానలు
- రాష్ట్రంలో అత్యధికంగా కొత్తగూడెం జిల్లా కరకగూడెంలో 34.3 సెం.మీ. వర్షపాతం
- 50 ప్రాంతాల్లో 10 సెం.మీ.కు పైన వాన

2లో

గురు, శుక్రవారాల్లో వర్షాల అంచనా ఇదీ..

మోస్తరు వర్షాలు:	అతి భారీ వర్షాలు:	భారీ వర్షాలు:
నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ఆదిలాబాద్, ములుగు జిల్లాలు.	సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్, ఖమ్మం, యాదాద్రి భువనగిరి జిల్లాలు.	ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, భద్రాద్రి, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాలు.

వానలు తగ్గేదాకా.. పరీక్షలన్నీ వాయిదా!
- యూనివర్సిటీల పరిధిలో ఇంటర్నల్స్ వాయిదా.. డిగ్రీ, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువు పొడిగింపు
- ఇంజనీరింగ్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ తేదీలు పెంపు: విద్యాశాఖ నిర్ణయం

- వివరాలు 2లో

జోరుగా వాన.. ఫుల్లుగా సాగు
- రాష్ట్రవ్యాప్తంగా 68.80 లక్షల ఎకరాల్లో పంటలు.. 40.73 లక్షల ఎకరాల్లో పత్తి.. 15.63 లక్షల ఎకరాల్లో వరి
- మొక్కజొన్న, కంది సాగు ముమ్మరం
- 6.83 లక్షల ఎకరాలతో తొలి స్థానంలో నల్లగొండ జిల్లా

- వివరాలు 2లో

న్యూస్‌రీల్

రేపు కేబినెట్ భేటీ

ప్రభుత్వ పథకాలు, ఇతర పాలనా అంశాలకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.
- వివరాలు 3లో▶

రేపు 'కేసీఆర్ విద్యాబంధు'

రూ.150 కోట్ల బడ్జెట్‌తో బీసీ గురుకులాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు మంత్రి గంగుల వెల్లడించారు. ఈ పథకానికి సంబంధించి కేసీఆర్ విద్యాకానుక/ కేసీఆర్ విద్యాబంధు/ స్వదేశీ విద్యానిధి.. తదితర పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.
- వివరాలు 5లో▶

1,520 ఏఎన్‌ఎం పోస్టులు

1,520 ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు సమర్పించాలి. రాతపరీక్ష ఇంగ్లిష్‌లో ఉంటుంది. పేస్కేల్ రూ. 31,040 – రూ. 92,050 మధ్య ఉంటుంది.
- వివరాలు 10లో▶

మనమెక్కడో తెలుసుకుందాం!

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమ బలాలు, బలహీనతలు అంచనా వేసుకునేందుకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు సొంత సర్వేల వైపు మొగ్గు చూపుతున్నారు.
- వివరాలు 5లో▶

ఇదండీ సంగతి

వచ్చే మూడు రోజుల్లో భారీ, అతి భారీ, విపరీత భారీ వర్షాలు కురుస్తాయి!



మూడోసారీ మేమే...
మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మనదే

న్యూఢిల్లీ: వరుసగా మూడో పర్యాయం ప్రధాని పదవిని చేపడతానని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఢిల్లీలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. తమ మూడో పర్యాయంలో మెరుగైన వృద్ధిరేటుతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అన్నారు. 13.5 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారనే నీతి ఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ భారత్ తప్పకుండా పేదరిక నిర్మూలన సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. 2014లో బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టినపుడు భారత్ ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండగా... ప్రస్తుతం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తుచేశారు.

భారత మండపం రెడీ
- వివరాలు 6లో▶

నన్ను ఎమ్మెల్యేగా గుర్తించండి: జలగం



- అసెంబ్లీ కార్యదర్శి, సీఈఓ వికాస్ రాజ్‌తో భేటీ
- బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ పార్టీ కోసం పనిచేస్తా

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం శాసనసభ్యుడిగా తనను గుర్తించాలని కోరుతూ జలగం వెంకట్రావు బుధవారం అసెంబ్లీ కార్యదర్శితో పాటు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిని కలిశారు. కొత్తగూడెం ఎమ్మెల్యేగా వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ తీర్పునిచ్చిన హైకోర్టు, ఆయనపై పోటీ చేసిన జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా గుర్తించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జలగం వెంకట్రావు అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులను కలిసి

మిగతా 3వ పేజీలో ▶

'కొత్తగూడెం' తీర్పుపై స్టే ఇవ్వండి




- హైకోర్టులో వనమా వెంకటేశ్వరరావు పిటిషన్
- వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: తన ఎన్నిక చెల్లదంటూ ఇచ్చిన తీర్పు అమలును నిలుపుదల చేస్తూ ఆదేశాలివ్వాలని కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నామని, దీని కోసం స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 'జలగం వెంకట్రావు ఎమ్మెల్యే బాధ్యతలు చేపట్టిన తర్వాత సుప్రీంకోర్టు నాకు అనుకూలంగా తీర్పునిస్తే.. అప్పుడు నాకు అన్యాయం జరిగినట్లు అవుతుంది. ఎన్నికైన నాటి నుంచి

మిగతా 3వ పేజీలో ▶

వారిది ముక్కోణపు ప్రేమ కథ!



బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలపై కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- మూడు పార్టీలు ఒక్కటే.. మూడూ కుటుంబ, అవినీతి పార్టీలే
- ఇవి గతంలో, ఇప్పుడూ కలిశాయి.. భవిష్యత్తులోనూ కలుస్తాయ్
- నేటి నుంచి ప్రధానమంత్రి కిసాన్ సేవ కేంద్రాలుగా ఎరువుల దుకాణాలు.. రైతులకు అన్ని రకాల సేవలు ఒకేచోట

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలది ముక్కోణపు ప్రేమ కథ (ట్రయాంగిల్ లవ్‌స్టోరీ) అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ మూడు పార్టీలు ఒక్కటేనని, మూడూ కుటుంబ, అవినీతి పార్టీలేనని ఆరోపించారు. మోదీ ప్రభుత్వంపై అవిశ్వాసం పేరిట ఢిల్లీలో ఈ మూడు పార్టీలు ఆడుతున్న డ్రామాను ప్రజలు గమనిస్తున్నారన్నారు. 'ఈ పార్టీలు గతంలో కలిశాయి.. ఇప్పుడూ కలిశాయి.. భవిష్యత్తులో కూడా కలిసే ఉంటాయి..' అని అన్నారు. తెలంగాణలో అవినీతి రహిత పాలన కావాలంటే బీజేపీ

మిగతా 3వ పేజీలో ▶

తమాషాలొద్దు.. అసమ్మతి నేతలకు కిషన్‌రెడ్డి వార్నింగ్ - 3లో



120 ఏళ్ల మర్రిచెట్టు కూలిపోయింది..

➤ వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలోని ఆకేరు వాగు పోటెత్తుతోంది. దీనితో పాతబ్రిడ్జి సమీపంలో నేల కోతకు గురై.. ఒడ్డున ఉన్న సుమారు 120 ఏళ్ల మర్రిచెట్టు (దయ్యాలమర్రి అని పిలుస్తారు) నేలకు ఒరిగింది.ఇన్నేళ్లుగా బాటసారులు,రైతులు, వివిధ పనులపై వచ్చేవారికి నీడనిచ్చిన ఈ చెట్టు పడిపోవడంతో.. చాలా మంది గ్రామస్తులు చెట్టును చూసేందుకు తరలివచ్చారు.



కళ్లముందే కొట్టుకుపోయారు

కూతురు క్షేమం.. లభించని తల్లి ఆచూకీ
పాములేరు వాగు దాటుతుండగా ఘటన

ములకలపల్లి: వరినాట్లు వేసేందుకు వెళ్లి తిరిగి వస్తూ తల్లీకూతుళ్లు వాగులో కొట్టుకుపోయారు. కుమార్తె క్షేమంగా బయటపడగా, తల్లి మాత్రం గల్లంతయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కుమ్మరిపాడు గ్రామానికి చెందిన సుమారు 20 మంది మహిళల బృందం బుధవారం చాపరాలపల్లిలో వరినాట్లు వేశారు. తిరిగి వెళ్లే సమయంలో గ్రామ శివారులోని పాములేరు వాగు లోలెవల్ చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇంటికి చేరాలనే ఆత్రుతతో అందరూ గుంపులుగా చేతులు పట్టుకుని వాగు దాటే ప్రయత్నం చేశారు. అయితే మధ్యలో వరద ధాటికి తల్లీకూతుళ్లైన కుంజా సీత, కుర్సం జ్యోతి కొట్టుకుపోయారు. వరద ఉధృతితో సహచర కూలీలు వారిని రక్షించలేకపోయారు. కాసేపటికి జ్యోతి ఓ చెట్టు కొమ్మను పట్టుకుని ఉండగా స్థానికులు కాపాడారు. సీత జాడ మాత్రం రాత్రి వరకు లభించలేదు.



ప్రమాదం నుండి బయటపడిన జ్యోతిని తీసుకొస్తున్న స్థానికులు



ముత్యంధార జలపాతం వద్ద చిక్కుకున్న 200 మంది పర్యాటకులు

➤ ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలం వీరభద్రవరం సమీపంలోని ముత్యంధార జలపాతాన్ని చూసేందుకు వచ్చిన సుమారు 200 మంది పర్యాటకులు అటవీ ప్రాంతంలోనే చిక్కుకుపోయారు. బుధవారం ఉదయం కార్లు, ద్విచక్రవాహనాలపై వీరభద్రవరం గ్రామానికి వచ్చి, అక్కడి నుంచి అడవిలో నడుచుకుంటూ జలపాతం వద్దకు వెళ్లారు. కానీ భారీ వర్షం వల్ల జలపాతానికి వెళ్లే దారిలోని రెండు వాగులు ఉప్పొంగడంతో తిరిగి రాలేక అడవిలోనే ఉండిపోవాల్సి వచ్చింది. అక్కడ సెల్‌ఫోన్ సిగ్నల్స్ సరిగా లేక ఇబ్బంది ఎదురైంది. ఈ విషయం తెలిసిన మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోతు కవిత వారిని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



జిన్నెల ఒర్రెలో ఇరుక్కున్న బస్సు

➤ బుధవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని నామాలపాడు సమీపంలో ఉన్న జిన్నెల ఒర్రె ఉప్పొంగడంతో ఆర్టీసీ మినీ బస్సు చిక్కుకుపోయింది. ఇల్లెందు నుంచి మహబూబాబాద్ వైపు వస్తున్న ఈ బస్సులోనే ఇల్లెందు ఏఎస్పై షహీ కూడా ఉన్నారు. ఆయన, డ్రైవర్ కలసి ఇతర ప్రయాణికులతో ఒర్రెను దాటారు.



హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలంలోని కటాక్షపూర్ చెరువు పొంగడంతో మునిగిన జాతీయ రహదారి

మరో రెండ్రోజులు కుండపోత!

గురు, శుక్రవారాల్లో తెలంగాణకు రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ

చాలా చోట్ల భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతి భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో విస్తారంగా వానలు పడతాయని వాతావరణశాఖ ప్రకటించింది. పలుచోట్ల భారీ వర్షాలు, కొన్నిచోట్ల అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు రాష్ట్రానికి రెండు రోజులపాటు రెడ్ అలర్ట్ ప్రకటించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారిందని.. దానికి అనుబంధంగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయని తెలిపింది. వర్షాలకు తోడు పలుచోట్ల గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని ప్రకటించింది.

కరకగూడెంలో 22.7 సెంటీమీటర్ల భారీ వాన

బుధవారం రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 2.26 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి 10 గంటల సమయానికి అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెంలో 29.2 సెంటీమీటర్ల భారీ వాన పడింది. రాష్ట్రవ్యాప్తంగా 15 ప్రాంతాల్లో 15 సెంటీమీటర్లకుపైగా, మరో 35 చోట్ల 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ లెక్కలు చెప్తున్నాయి. నైరుతి సీజన్‌కు సంబంధించి జూలై 26 నాటికి రాష్ట్రంలో 32.2 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా.. ఈసారి 43.25 సెంటీమీటర్లు కురిసింది. అంటే సాధారణంతో పోలిస్తే.. 34శాతం అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో 5 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 24 జిల్లాల్లో అధిక వర్షపాతం, 4 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.



గోదావరిఖనిలో వరద నీటి ప్రవాహం

హైదరాబాద్‌లో భారీ వర్షం..

రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బుధవారం పొద్దున్నుంచి ముసురు వాన కురవగా రాత్రి భారీ వర్షం పడింది. నగరంలోని టోలిచౌకిలో 8.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో రెండు నుంచి మూడు సెంటీమీటర్ల మేర వాన పడింది. దీంతో డ్రైనేజీలు, మ్యాన్‌హోల్స్ పొంగాయి. ప్రధాన రోడ్లపై నీరు చేరి వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. ఎగువ నుంచి వరద పెరగడంతో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జంట జలాశయాల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ తీర ప్రాంతాలను అధికారులు అప్రమత్తం చేశారు.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు..

ప్రాంతం	వర్షపాతం(సెం.మీ.)	ప్రాంతం	వర్షపాతం(సెం.మీ.)
కరకగుడెం (కొత్తగూడెం)	34.3	కారేపల్లి (ఖమ్మం)	19.6
కల్లెడ (వరంగల్)	24.8	అలుబాక (ములుగు)	18.2
కొత్తగూడెం	23.4	బయ్యారం (కొత్తగూడెం)	17.9
సిరికొండ (ఆదిలాబాద్)	22.5	జఫర్‌గఢ్ (జనగాం)	17.7
నెక్కొండ (వరంగల్)	19.9	నెల్లికుదురు (మహబూబాబాద్)	17.5
		లింగాల (ఖమ్మం)	16.3



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని వార్డులోకి వచ్చిన నీరు



భద్రాద్రి జిల్లా రాఘబోయినగూడెంలో లోలెవల్ వంతెన మీదుగా ప్రవహిస్తున్న వరద

జిల్లాల్లో దంచికొట్టిన వాన

➤ కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో మంగళవారం రాత్రి నుంచీ వానలు దంచి కొడుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు పరవళ్లు తొక్కుతుంది. సిరిసిల్ల జిల్లా కేంద్రం శివారు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కోనరావుపేట మండలం మామిడిపల్లి, వట్టిమల్ల గ్రామాల వద్ద రెండు చోట్ల కాజ్‌వేలు కొట్టుకుపోయాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్‌లోని చాలా కాలనీలు జలమయం అయ్యాయి.

➤ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగ, ప్రాణహిత, గోదావరి, కడెం ప్రాజెక్టుల్లో భారీగా వరద చేరుతోంది. పెన్‌గంగ, ప్రాణహిత తీరాల్లోని పొలాలు నీటిలో మునిగాయి. పలుచోట్ల చెరువులు, సాగు నీటి కాలువలకు గండ్లు పడ్డాయి. మంచిర్యాలలో రోడ్లపై మోకాళ్ల లోతుకు చేరింది. జిల్లా ఆస్పత్రిలోని వార్డుల్లోకీ వరద ప్రవేశించింది.

➤ నిజామాబాద్ జిల్లాలోని మోర్తాడ్ మండలంలో పంటలు నీట మునిగాయి. దీనితోపాటు కామారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న చిన్న ప్రాజెక్టులు, చెరువులన్నీ నిండి అలుగు పోస్తున్నాయి.

➤ ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా బుధవారం భారీ వర్షం కురిసింది. ఆత్మకూర్ మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి దూకుతుండటంతో.. దిగువన ఉన్న 163 నంబర్ జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పరకాల చలివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ములుగు జిల్లాలోని రామప్ప జలాశయం, లక్నవరం చెరువు నిండిపోయాయి. కొంగాల వాగు, మల్లిమాగు వాగు, బొమ్మనపల్లి, గుండ్ల వాగు, ఇసుక వాగు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి. వరంగల్ నగరంలోని ఎన్టీఆర్ నగర్, సంతోషిమాతకాలనీ, భద్రకాళి నగర్, గాయత్రినగర్, సాయినగర్ కాలనీలు నీట మునిగాయి. నర్సంపేటలో ఎన్టీఆర్ నగర్, సర్వాపురం కాలనీలు నీట మునిగాయి.

➤ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం అతి భారీ వర్షాలు కురిశాయి. పాలేరు రిజర్వాయర్ అలుగు పోస్తోంది. వైరా రిజర్వాయర్, లంకాసాగర్ ప్రాజెక్టు, బేతుపల్లి చెరువు, జాలిముడి ప్రాజెక్టులు పూర్తిగా నిండాయి. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టు నిండిపోయింది. పలుచోట్ల వాగులు, చెరువులు ఉప్పొంగి రోడ్లపైకి రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

➤ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పరిధిలోని చాలా ప్రాంతాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. యాదాద్రి జిల్లా తుర్కపల్లిలో మండలంలో సముద్రం చెరువు, వీరుల చెరువు, మోటకొండూర్ చెరువులు అలుగు పోస్తున్నాయి. ఆత్మకూరు మండలంలోని బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు–రుద్రవెల్లి మధ్య ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ నది ప్రవహిస్తోంది. గంధమల్లలో వర్షానికి రెండు ఇళ్లు కూలిపోయాయి. సూర్యాపేట జిల్లాలోని చిలుకూరు, పాత చిలుకూరు మధ్య బ్రిడ్జిపై వరద ప్రవహిస్తోంది. బేతవోలు రోడ్డులోని పొలాల్లో ఇసుక మేటలు వేసింది. జాజిరెడ్డిగూడెం మండలంలో తిమ్మాపురం- సంగెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

గోదావరి ఉగ్రరూపం

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణలోని బేసిన్‌లో వర్షాలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణలోని పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలతో గోదావరి నది పోటెత్తుతోంది. ప్రాణహిత, ఇంద్రావతి, శబరి ఉప నదులతోపాటు తాలి పేరు, కిన్నెరసాని, కడెం, ఇతర వాగులు, వంకలు ఉప్పొంగడంతో గోదావరిలోకి భారీగా వరద వస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 5,11,080, సమ్మక్క బ్యారేజీ నుంచి 7,54,470, సీతమ్మసాగర్ నుంచి 10,49,351 క్యూసెక్కులను వదులుతు న్నారు. దీనికి స్థానిక వాగుల ప్రవాహం తోడై.. భద్రాచలం వద్ద ప్రవాహం బుధవారం రాత్రి 9.30 గంటలకు పదకొండున్నర లక్షల క్యూసెక్కులు దాటింది. నీటి మట్టం 48 అడుగులకు చేరడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. రాత్రి 11 గంటల సమయంలో వరద 48.4 అడుగులు దాటింది. 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

పోలవరం వద్ద అలర్ట్: భద్రాచలం నుంచి వస్తున్న నీళ్లు, స్థానిక ప్రవాహాలు కలసి పోలవరం ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతోంది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్న అధికారులు.. పోలవరం ప్రాజెక్టు 48 గేట్లను పూర్తిగా ఎత్తేసి, వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగు వకు వదిలేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలిస్తున్నారు. ఇక ధవళేశ్వరం బ్యారేజీ వద్ద బుధవారం రాత్రి 8 గంటలకు 8,37,850 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ఇది గురువారం ఉదయం 10 గంటలకల్లా 12 లక్షల క్యూసెక్కులను దాటే అవకాశం ఉందని అంచనా వేశారు.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో: కృష్ణా బేసిన్ పరిధిలో తెలంగాణలో ఉన్న తొలి జలాశయం జూరాల ప్రాజెక్టుకు వరద పెరుగుతోంది. బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ప్రాజె క్టుకు 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుదుత్పత్తితో 29,641 క్యూసెక్కులు వదులుతు న్నారు. ఈ నీరంతా శ్రీశైలం వైపు పరుగులు తీస్తోంది.

ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వ, ప్రవాహాల వివరాలివీ.. (గోదావరి బేసిన్ పరిధిలో)

ప్రాజెక్టు	నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
సింగూరు	29.91	22.01	4,551	150
నిజాంసాగర్	17.80	13.99	9,200	0
శ్రీరాంసాగర్	90.31	72.95	59,257	726
కడెం	7.60	5.88	3,965	13,023
ఎల్లంపల్లి	20.18	15.88	60,763	88,819
సుందిళ్ల బ్యారేజీ	8.83	3.66	76,500	76,500
అన్నారం బ్యారేజీ	10.87	5.83	1,43,691	99,411
మేడిగడ్డ బ్యారేజీ	16.17	4.09	5,03,450	5,03,450
సమ్మక్క బ్యారేజీ	6.94	6.9	7,57,530	7,57,530
సీతమ్మసాగర్	36.57	0.2	11,17,116	11,17,116
మిడ్ మానేరు	27.50	16.84	5,100	1,530
లోయర్ మానేరు	24.07	14.02	6,047	143

వానలు తగ్గేదాకా.. పరీక్షలన్నీ వాయిదా!

- రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో విద్యాశాఖ నిర్ణయం
- యూనివర్సిటీల పరిధిలో ఇంటర్నల్స్ వాయిదా
- డిగ్రీ, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువు పొడిగింపు
- ఇంజనీరింగ్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ తేదీలు పెంపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలు, విద్యా సంస్థలకు వరుసగా సెలవులు ప్రకటించడం పరీక్షల నిర్వహణపై ప్రభావం చూపుతోంది. వర్షాలు తగ్గి, సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అన్నిరకాల పరీక్షలను వాయిదా వేయాలని ఉన్నతాధికారులు యూని వర్సిటీలు, విద్యా సంస్థలకు సూచించారు. దీంతో ఇప్పటికే డిగ్రీ, ఇంజనీరింగ్‌లో ఇంటర్నల్ పరీక్షలు వాయిదా పడ్డాయి. డిగ్రీ ప్రవేశాల తేదీల్లోనూ మార్పులు చేశారు. ఇంజనీరింగ్ సీట్లలో తొలివిడత చేరికలకు సాంకేతిక సమస్యలు తలెత్తడంతో.. సెల్ఫ్ రిపోర్టింగ్ తేదీలను పొడిగించారు. మలి విడత ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఈ నెల 27తో ఆప్షన్లు ఇచ్చే గడువు ముగుస్తుండటంతో.. ఈ గడువునూ మరికొంత పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు.

బడుల్లో అంతర్గత పరీక్షలకు తిప్పలు

పాఠశాలల్లోని విద్యార్థులకు జూలైలో జరగాల్సి ఉన్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ–1) పరీక్షలను వాయిదా వేయాలని అధికారులు భావిస్తున్నారు. వర్షాల మూలంగా వారం రోజులుగా సెలవులు ఇచ్చారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇటీవలి వరకు పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు అందలేదు. ఇప్పుడీ వర్షాలతో మళ్లీ అంతరాయం రావడంతో నిర్ణీత సిలబస్ పూర్తవలేదని.. ఎఫ్‌ఏ-1 పరీక్షలను వాయిదా వేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఇంటర్ ప్రవేశాల తేదీ పొడిగింపు

భారీ వర్షాలతో వరుస సెలవులు, ఇంటర్నెట్, ఇతర ఇబ్బందుల నేపథ్యంలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల గడువును ఈ నెల 25 నుంచి నెలాఖరు వరకు పొడిగిస్తూ ఇంటర్ బోర్డ్ నిర్ణయం తీసుకుంది. ఇంకా లక్ష మందికిపైగా ఇంటర్‌లో చేరాల్సి ఉందని.. వానలు ఇలాగే కొనసాగితే గడువు పొడి గించాలని బోర్డ్ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది.

వర్సిటీల్లో పరీక్షలు వాయిదా.. దోస్త్ గడువు పెంపు

ఉస్మానియా, జేఎన్టీయూహెచ్ సహా పలు యూనివర్సిటీల పరిధిలోని కాలేజీల్లో అంతర్గత పరీక్షలు వాయిదా పడ్డాయి. వాటిని ఈ నెలాఖరులో నిర్వహించాలని భావించినా.. వానలు తగ్గే అవకాశం లేకపోవడంతో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీంతో డిగ్రీ, ఇంజనీరింగ్ పరీక్షలు ఆలస్యం కానున్నాయి. డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించే దోస్త్ కౌన్సెలింగ్ సెల్ఫ్ రిపోర్టింగ్ తేదీని ఈ నెల 28 వరకూ పొడిగించారు. ఇక ఎంసెట్ రెండో దశ కౌన్సెలింగ్‌కు ఆప్షన్ల గడువు 27తో ముగియనుంది. ఈ నెల 31న సీట్ల కేటాయింపు ఉంటుందని సాంకేతిక విద్య కమిషనరేట్ తెలిపింది. వర్షాలు తగ్గకపోతే రెండో విడత చేరికల తేదీని పొడిగించే వీలుందని అధికారులు అంటున్నారు.

జోరుగా వాన.. ఫుల్లుగా సాగు

- రాష్ట్రవ్యాప్తంగా 68.80 లక్షల ఎకరాల్లో పంటలు
- 40.73 లక్షల ఎకరాల్లో పత్తి .. 15.63 లక్షల ఎకరాల్లో వరి
- మొక్కజొన్న, కంది, సోయాబీన్ సాగు కూడా ముమ్మరం
- 6.83 లక్షల ఎకరాలతో తొలి స్థానంలో నల్లగొండ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంటల సాగు ఊపందుకుంది. జోరుగా కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. బుధవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా 68.80 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఇప్పటివరకు పత్తి 40.73 లక్షల ఎకరాల్లో సాగు కాగా, 15.63 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి. ఇక సోయాబీన్ 4.14 లక్షల ఎకరాల్లో, కంది 3.82 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 3.62 లక్షల ఎకరాల్లో సాగైంది. జిల్లాల వారీగా పంటల సాగును పరిశీలిస్తే 6.83 లక్షల ఎకరాలతో నల్లగొండ జిల్లా తొలి స్థానంలో నిలువగా 5.65 లక్షల ఎకరాలతో ఆదిలాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. సంగారెడ్డి జిల్లాలో 4.69 లక్షల ఎకరాల్లో, వికారాబాద్ జిల్లాలో 4.24 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

ఆలస్యమైనా గత ఏడాది సాగుతో సమానంగా

గతేడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో రికార్డు స్థాయిలో 1.36 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఆలస్యమైనప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా విస్తారమైన వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ వానా కాలం సాగు కూడా గతేడాది వానాకాలం సాగుతో పోటీ పడుతోంది. గతేడాది ఈ సమయం వరకు రాష్ట్ర వ్యాప్తంగా 68.90 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు కాగా, ఈ సీజన్‌లో దాదాపు సమానంగా 68.80 లక్షల ఎకరాల్లో పంటలు సాగవడం గమనార్హం. గతేడాది ఇదే సమయానికి వరి 11.11 లక్షల ఎకరాల్లో సాగైతే, ఈ సీజన్‌లో ఇప్పటికే 4.52 లక్షల ఎకరాలు అధికంగా 15.63 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి గతేడాది ఈ సమయానికి 44.53 లక్షల ఎకరాల్లో సాగైతే ప్రస్తుతం ఈ పంట 40.73 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లోనూ సాగుకు ఢోకా లేదని, రికార్డు స్థాయిలో సాగవడం ఖాయమని అధికారులు అంటున్నారు. వచ్చే నెల మొదటి వారం వరకు కూడా పత్తి సాగు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. వానలు తగ్గి భూమి కాస్తంత పొడిగా మారిన తర్వాత పత్తి సాగు చేయవచ్చని చెబుతున్నారు. వానలు తగ్గాక వరి నాట్లు కూడా పుంజుకోనున్నాయి.

జలపాతంలో పడి యువకుడి దుర్మరణం

గౌరీగుండాల వద్ద ఘటన..

పెద్దపల్లి రూరల్: పెద్దపల్లి జిల్లా సబ్బితం శివారులో గల గౌరీగుండాల జలపాతం అందాలను చూసేందుకు వెళ్లిన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కిసాన్‌నగర్‌కు చెందిన మానుపాటి వెంకటేశ్ (24) మృత్యువాత పడ్డాడు. జలపాతంలో ఈత కొట్టాలనే సరదా అతని ప్రాణాలు బలిగొంది. పోలీసుల కథనం ప్రకారం..వెంకటేశ్ ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. బుధవారం తన స్నేహితులు భరత్, అఖిల్, రాకేశ్, అభిలాష్‌తో కలిసి సబ్బితం జలపాతం వద్దకు వెళ్లాడు. అందరూ కలిసి కొంతసేపు ఫొటోలు దిగారు. తర్వాత ఈత కొట్టేందుకు నీటిలోకి దిగారు. అయితే నీటి ఉధృతికి వెంకటేశ్ కొట్టుకుపోయాడు. స్నేహితులు కేకలు పెడుతూ పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. పోలీసులు, అగ్నిమాపక బృందం రెండు గంటలు శ్రమించి వెంకటేశ్ మృతదేహాన్ని వెలికి తీశారు. బసంత్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



గుండ్ల మడుగు వాగు వద్దకు అధికారులు..

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మట్టెవాడ జీపీ పరిధిలోని దొరవారి తిమ్మాపురం గ్రామ దుస్థితిపై బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'వానాకాలం వస్తే వణుకే..' అన్న కథనంపై అధికారులు స్పందించారు. గూడూరు సీఐ ఫణిధర్, ఎస్సై రాణాప్రతాప్ సిబ్బందితో జోరువానలో, దట్టమైన అడవిలో కాలినడకన ఎనిమిది కిలోమీటర్లు వెళ్లి గుండ్లమడుగు వాగు వద్దకు వెళ్లారు. వాగు దాటలేని పరిస్థితిలో తిమ్మాపురం వెళ్లలేకపోయారు. వరద కాస్త తగ్గాక గ్రామానికి వెళ్లి ఆహార పదార్థాలు, ఇతర సాయాన్ని అందిస్తామని ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు.



ఏలూరు జిల్లా ఏపులపాడు సమీపంలో రహదారి మీదుగా ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

తడిసి ముద్దయిన ఏపీ

సాక్షి, నెట్‌వర్క్ : కుండపోత వర్షాలతో ఏపీ తడిసి ముద్దయింది. ప్రధానంగా కోస్తా జిల్లాల్లో ఆకాశానికి చిల్లు పడినట్లు ఎడతెగని వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లోనూ విస్తారంగా వానలు పడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్ప డిన అల్పపీడనం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారడంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తరాంధ్ర, గోదావరి, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ప్రజలు బయటకు వెళ్లే అవకాశం లేకుండా వర్షాలు పడుతున్నాయి. ఏలూరు జిల్లా వ్యాప్తంగా బుధవారం అత్యధికంగా 7.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత విశాఖ జిల్లాలో 6.9, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 6.8, అనకాపల్లి జిల్లాల్లో 6.4 సెంటీమీటర్ల సగటు వర్షం కురిసింది. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల్లోనూ సగటున 3 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో 10 జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాలు ఈ జాబితాలో ఉన్నందున, అక్కడి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉండడంతో ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయి.

క్లుప్తంగా...

పుట్టినరోజు మోజులో ప్రజలను మరిచిపోయారు

వర్షాలతో అల్లాడుతుంటే సమీక్షలు చేయరా?: టీపీసీసీ చీఫ్ రేవంత్



సాక్షి, హైదరాబాద్: వారం రోజులుగా వర్షాలు, వరదలతో హైదరాబాద్ ప్రజలు అతలాకుతలం అవుతుంటే పుట్టినరోజు మోజులో ఉన్న పురపాలక మంత్రి కె. తారకరామారావు ప్రజలను మరిచిపోయారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కానీ, మంత్రి కేటీఆర్ కానీ కనీసం సమీక్షలు చేయడం లేదని బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. విశ్వనగరంగా అభివృద్ధించి డల్లాస్, ఇస్తాంబుల్‌లను చేస్తామని ప్రగల్భాలు పలికిన కేసీఆర్, కేటీఆర్‌లు హైదరాబాద్‌ను నరకకూపంగా మార్చారని ఎద్దేవా చేశారు. వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నాలాలు, వరద ఉన్న ప్రాంతాలకు వెళ్లవద్దని, పిల్లలను బయటకు పంపవద్దని రేవంత్ కోరారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించి ప్రజలను ఆదుకునేలా చర్యలు తీసుకోకపోతే శుక్రవారం జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

హరీశ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లోకి చేరికలు



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఆరెకటిక సమాజం ప్రతినిధులు, కాంగ్రెస్ సహా ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, గుండప్ప, ఉమాకాంత్ పాటిల్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేను పార్టీ మారను..

ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు: పొన్నం



సాక్షి, హైదరాబాద్: తాను కాంగ్రెస్ పార్టీని వీడి వెళుతున్నానన్న ప్రచారంలో వాస్తవం లేదని, పార్టీ మారడం లేదని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తనకు పార్టీ కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించకుండా చేయడమే కాకుండా తాను పార్టీ మారుతున్నానంటూ కాంగ్రెస్‌లోని ప్రత్యర్థులే దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గత 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న తాను ఎప్పటికప్పుడు ప్రజల గొంతుకనై పనిచేస్తున్నానన్నారు. సోనియా, రాహుల్‌గాంధీ, ఖర్గేల నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్తగా కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

వారిది గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలది గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. బుధవారం జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఇది మరోసారి బహిర్గతమైందని ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకటేనని, గతంలోనూ కలిసి పనిచేశాయని ఇప్పుడూ కలిసే పని చేస్తున్నాయన్నారు. వీరు చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై బురద జల్లుతున్నారని అరుణ ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో ఈ రెండు పార్టీల కలయిక ఎప్పుడో నిశ్చయమైపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లలో ఏ పార్టీకి ఓటేసినా ఒకటేనన్న విషయంపై తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బీజేపీ నేత జిట్టా బాలకృష్ణారెడ్డిపై సస్పెన్షన్ వేటు..



సాక్షి, హైదరాబాద్: బీజేపీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ నియమ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి, క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన యాదాద్రి భువనగిరి జిల్లా నేత బాలకృష్ణారెడ్డిపై విధించిన సస్పెన్షన్ వెంటనే అమల్లోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ప్రవర్తనపై వారం రోజుల్లోగా పార్టీకి వివరణ ఇవ్వాలన్నారు. అయితే.. కాంగ్రెస్ పార్టీ నుంచి కుంభం అనిల్‌కుమార్ రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరిన నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరేందుకు జిట్టా సిద్ధమైతున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో సస్పెన్షన్ వేటు వేసినట్టు పార్టీ వర్గాల సమాచారం.

తమాషాలొద్దు..

అసమ్మతి నేతలకు కిషన్‌రెడ్డి క్లాస్

- ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా నిజామాబాద్ జిల్లా నేతల నిరసనలు, నినాదాలు...
- పార్టీ కార్యాలయంలో నేతల తీరుపై కిషన్‌రెడ్డి ఆగ్రహం
- సమస్య ఉంటే అంతర్గతంగా మాట్లాడుకోవాలే గానీ వీధిన పడతారా
- అమిత్ షా పర్యటన తర్వాత మాట్లాడదాం
- అక్కడి నుంచి పంపించి వేసిన పార్టీ అధ్యక్షుడు
- నాకేం సంబంధం లేదు: ఎంపీ అర్వింద్



ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా బైఠాయించిన కార్యకర్తలతో మాట్లాడుతున్న పార్టీ నేత ప్రకాశ్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ కార్యాలయంలో ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన నిజామాబాద్ జిల్లా పార్టీ నేతలకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తనదైన శైలిలో క్లాస్ పీకారు. ఏదైనా సమస్య ఉంటే అంతర్గతంగా చర్చించుకుని పరిష్కరించుకోవాలే తప్ప మీడియా ఎదుట నిరసనలు నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు, తమాషాలొద్దు... అని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లాలో బీజేపీ రెండు వర్గాలుగా విడిపోయింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య ఇటీవల 13 మండలాల అధ్యక్షులను తొలగించి.. కొత్త వారిని నియమిస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక నేతలతో చర్చించకుండా.. కొత్తవారిని ప్రకటించడంపై మరో వర్గం రగిలిపోయింది. ఎంపీ అర్వింద్ పట్టుబట్టి పార్టీ మండల అధ్యక్షులను మార్పివేశారని ఈ వర్గం ఆరోపిస్తోంది. ఈక్రమంలో బుధవారం నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాలకు చెందిన అసమ్మతి నేతలు వచ్చి ఒక్కసారిగా బైఠాయించి.. ఆందోళనకు దిగారు. ఎంపీ అర్వింద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఉమాశంకర్, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి.. వారిని సముదాయించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాంతో కిషన్‌రెడ్డి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అసమ్మతి నేతలను పిలిపించుకుని మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే ఆందోళన చేయడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ఉంటే అంతర్గతంగా కూర్చొని సెట్ చేసుకోవాలని.. ఇలా వీధిన పడటం భావ్యం కాదని క్లాస్ తీసుకున్నారు. ఈ నెల 29న అమిత్ షా పర్యటన తర్వాత... సర్దుబాటు చేసుకుందామని చెప్పి ఆందోళనకు దిగిన వారిని అక్కడి నుంచి పంపించి వేశారు.

ఆ జిల్లాలో అన్ని సెగ్మెంట్లలోనూ పోటాపోటీ

నిజామాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇప్పటి నుంచే టికెట్ల కోసం బీజేపీ నేతల మధ్య పోటాపోటీ నెలకొంది. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య పోటీ చేయాలని పట్టుదలతో ఉన్నారు. ఎంపీ అర్వింద్ ప్రోత్సాహంతో ధన్‌పాల్ సూర్యనారా యణ గుప్త కూడా అక్కడ పనిచేసుకుంటున్నారు. ఇక ఆర్మూర్ లోనూ ఇద్దరు నేతలు పోటీ పడుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన వినయ్ రెడ్డితో పాటు పార్టీలో చేరిన వ్యాపారవేత్త రాకేశ్‌రెడ్డి అక్కడ బీజేపీ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఇక బోధన్ నియోజకవర్గం నుంచి ప్రకాశ్‌రెడ్డితో పాటు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీకి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇలా జిల్లాలో నేతల మధ్య వర్గపోరు తార స్థాయికి చేరింది. అయితే మండలాల అధ్యక్షులను మార్చడం.. వచ్చే ఎన్నికల్లో పోటీచేయాలనుకున్న కొంతమంది అసమ్మతి వర్గా నికి ఆజ్యం పోయడంతో ఆ రచ్చ కాస్తా బీజేపీ రాష్ట్ర కార్యాల యానికి చేరింది. కాగా, ఎంపీ అర్వింద్ మాత్రం.. మండలాల అధ్యక్షుల మార్పులో తన ప్రమేయం లేదని ఢిల్లీలో స్పష్టం చేశారు.

దళితబంధు అందరికీ వచ్చే వరకు పోరాటం: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అర్హులందరికీ దళితబంధు పథకం వచ్చేవరకు పోరాటం ఉధృతం చేయాలని రాష్ట్ర ఎస్సీ మోర్చా నాయకులు, కార్యకర్తలకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. దళిత సీఎం హామీ మొదలుకుని దళితబంధు వరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దళితులకు చేసిన మోసాలపై పోరాటాలు చేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారులు, జిల్లా ఇన్‌చార్జీల సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొని దిశానిర్దేశం చేశారు. కేసీఆర్ పాలనలో దళితులు అన్ని రంగాల్లో వంచనకు గురైన తీరుపై వారి పక్షాన నిలిచి బీజేపీ తరపున ఉద్యమం చేద్దామన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణకు ప్రజాహితపాలన అందిస్తామన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రభారీ గంగిడి మనోహర్‌రెడ్డి, జాతీయ ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు వేముల అశోక్, మాజీ ఎస్సీ కమిషన్ సభ్యులు రాములు రాష్ట్ర పదాధికారులు కుమ్మరి శంకర్, క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వారిది ముక్కోణపు ప్రేమకథ!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు.

ఒకే తాను ముక్కలే..

'కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం ఒకే తాను ముక్కలే. ఇందులో ఏ పార్టీకి ఓటు వేసినా మూడు పార్టీలకు వేసినట్లే. బీజేపీ ఈ మూడు పార్టీలతో గతంలో కలవలేదు. భవిష్యత్తులోనూ కలవదు. ఈ మూడు పార్టీలపై పోరాటం కొనసాగిస్తుంది. రాష్ట్రంలో మార్పు రావాలంటే, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరాలంటే మోదీ నాయకత్వంలోని బీజేపీతో మాత్రమే సాధ్యం..' అని కిషన్‌రెడ్డి అన్నారు.

తెలంగాణలో 4 వేల కిసాన్‌సేవా కేంద్రాలు

దేశవ్యాప్తంగా ఉన్న ఎరువుల రిటైల్ షాపులను గురువారం నుంచి 'ప్రధానమంత్రి కిసాన్ సేవా కేంద్రాలు'గా మార్చుతున్నట్టు కిషన్‌రెడ్డి చెప్పారు. ఒకే దేశం.. ఒకే ఎరువు అనే నినాదంతో, భారత్‌బ్రాండ్ పేరుతో గురువారం నుంచి ఎరువుల సరఫరా అమల్లోకి రానున్నట్టు తెలిపారు. దేశంలో 2.8 లక్షల దుకాణాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేస్తామని అన్నారు. తొలిదశలో 1.25 లక్షల షాప్‌లను ప్రధాని మోదీ ప్రారంభిస్తారని తెలిపారు. తెలంగాణలో సుమారు 4 వేల ఎరువుల రిటైల్ షాపులు కిసాన్‌సేవా కేంద్రాలుగా మారతాయని చెప్పారు. ఈ మేరకు శామీర్‌పేటలో జరిగే కార్యక్రమంలో తాను పాల్గొంటానని తెలిపారు.

నేడు రైతుల ఖాతాల్లోకి 'కిసాన్ సమ్మాన్' నిధులు

14వ విడత పీఎం కిసాన్‌సమ్మాన్ నిధులను గురువారం ఉదయం ప్రధాని 8.5 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి విడుదల చేయనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలోని సుమారు 39 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయని చెప్పారు.

ప్రతి నెలా రెండో ఆదివారం 'కిసాన్ కీ బాత్'

రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలను ఒకే చోట అందించేందుకు వీలుగా ఎరువుల రిటైల్ షాపులను ప్రధానమంత్రి కిసాన్‌సేవా కేంద్రాలుగా కేంద్రం మార్చుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎరువులు, భూసార, విత్తన పరీక్షల కోసం వేర్వేరు చోట్లకు రైతులు వెళ్లకుండా అన్ని రకాల సేవలు..ఇక్కడ అందుబాటులో ఉంటాయని చెప్పారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు నిర్దేశిత ధరల్లో లభిస్తాయని వివరించారు. తక్కువ ధరలకే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు, కిసాన్‌సమ్మాన్‌యోజన వంటి కార్యక్రమాలు కేంద్రం అమలు చేస్తుందన్నారు. ఏ పంట వేయాలి? ఏ ఎరువు వాడాలనే దానిపై రైతులకు ఈ కేంద్రాలు అవగాహన కల్పిస్తాయని చెప్పారు. రైతు సమస్యలపై 'కిసాన్‌కీ బాత్' సమావేశాలు నిర్వహిస్తామని, ప్రతి నెలా రెండో ఆదివారం ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

'అమిత్ షాతో భేటీ'కి పేరు ఖరారు చేసిన రాష్ట్ర బీజేపీ!

సాక్షి, హైదరాబాద్: ఈనెల 29న కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో వివిధ రంగాలకు చెందిన మేధావులు భేటీ అయ్యేలా రాష్ట్ర బీజేపీ రూపొందించిన కార్యక్రమానికి 'ప్రజాస్వామ్య తెలంగాణ కోసం వివిధ సామాజికవర్గాల ప్రముఖులతో సమావేశం'అని పేరు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే ఆయా రంగాలకు చెందిన వారికి దాదాపు నాలుగువేల మందికి ఆహ్వానాలు పంపినట్లు సమాచారం. అన్ని సామాజిక వర్గాలు, కులసంఘాలు, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఇతర రాష్ట్రాలకు చెందిన ఆయా వర్గాలు, తెగల వారీగా కూడా ఆహ్వానాలు పంపుతున్నట్లు తెలిసింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో ప్రజాస్వామ్య వాతావరణం ఏర్పడేందుకు బీజేపీ మద్దతునివ్వాలని మేధావులు, ప్రముఖులను అమిత్ షా కోరనున్నారు. ఈ పర్యటనలో భాగంగా బేగంపేట విమానాశ్రయంలో అమిత్ షాకు కార్యకర్తలు ఆహ్వానం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రాష్ట్ర యువ, మహిళా, కిసాన్, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ మోర్చాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ ఆందోళనలకు ముగింపుగా 'చలో హైదరాబాద్'పేరిట భారీ ముట్టడి కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇక బుధవారం పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, ఎస్సీ నేతలతో పాటు కలుసుకున్నారు.

రేపు కేబినెట్ భేటీ!

- పలు కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం
- సీఎం కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌ల సుదీర్ఘ సమావేశం
- అసెంబ్లీ ఎన్నికలు, పాలన అంశాలపై మంతనాలు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పథకాలు, ఇతర పాలనా అంశాలకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జరుగుతున్న ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు, రాజకీయాలు, ప్రభుత్వ పథకాలు, పరిపాలన తదితర అంశాలపై సీఎం కేసీఆర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రగతిభవన్‌లో సుమారు ఐదు గంటల పాటు జరిగిన ఈ సుదీర్ఘ భేటీలో మంత్రులు కేటీ రామారావు, హరీశ్‌రావు పాల్గొన్నారు. రాష్ట్రంలో వర్ష ప్రభావంతో పాటు హైదరాబాద్, వరంగల్ పట్టణాల్లో వరదలపై చర్చించారు. గతంలో వరదల సందర్భంగా వరంగల్‌కు ఇచ్చిన హామీలు, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని కేటీఆర్‌ను సీఎం ఆదేశించినట్లు సమాచారం.

రాజకీయ పరిస్థితులపై చర్చ

రాష్ట్రంలో రాజకీయ వాతావరణం, జిల్లాల వారీగా పార్టీ పరిస్థితి వంటి అంశాలపైనా స్థూలంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ఇప్పటికే వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ, దివ్యాంగులకు పెన్షన్ పెంపు, మైనారిటీలకు ఆర్థిక సాయం, బీసీ బంధు వంటి కీలక ప్రకటనలు చేసిన కేసీఆర్.. శుక్రవారం జరిగే కేబినెట్ భేటీ అనంతరం మరిన్ని ప్రకటనలు చేసే సూచనలు కనిపిస్తున్నాయి. రెండో వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి, అసెంబ్లీ వర్షాకాల సమావేశాల షెడ్యూల్, గవర్నర్ కోటా శాసనమండలి సభ్యుల ఎంపిక తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. ఇక ఎన్నికల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపైనా కేటీఆర్, హరీశ్‌కు కేసీఆర్ పలు సూచనలు చేసినట్లు సమాచారం.

నన్ను ఎమ్మెల్యేగా గుర్తించండి: జలగం

▶ మొదటి పేజీ తరువాయి

కోర్టు తీర్పు కాపీని అందజేశారు. సాయంత్రం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌తో కూడా సమావేశమై కోర్టు తీర్పు కాపీతో పాటు తన విజ్ఞాపన అందజేశారు. కాగా, కోర్టు తీర్పును పరిశీలించి, నిపుణుల అభిప్రాయం తీసుకున్న తర్వాత సమాచారం ఇస్తామని అసెంబ్లీ కార్యదర్శి, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ చెప్పినట్టు జలగం వెంకట్రావు 'సాక్షి'కి వెల్లడించారు. ఈ అంశంపై తాను అసెంబ్లీ స్పీకర్‌తో ఫోన్‌లో మాట్లాడానని చెప్పారు.

బీఆర్‌ఎస్ పార్టీ కోసమే పనిచేస్తా..

అసెంబ్లీ కార్యదర్శిని కలిసేందుకు వచ్చిన జలగం వెంకట్రావు ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 2018 డిసెంబర్ 12వ తేదీ నుంచి తనను ఎమ్మెల్యేగా పరిగణించాలంటూ హైకోర్టు తీర్పునిచ్చిన విషయాన్ని ఆయన వివరించారు. తాను బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి పనిచేస్తానన్నారు. గతంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ఏం చేశానో ప్రజలకు తెలుసని, ఎన్నికల షెడ్యూల్‌కు మరో మూడు నెలల సమయం ఉన్నందున ప్రజలకు మరింత మేలు చేస్తానని వెంకట్రావు పేర్కొన్నారు.

జస్టిస్ కన్నెగంటి లలితకు ఘనంగా వీడ్కోలు



జస్టిస్ లలిత దంపతులను సన్మానిస్తున్న సీజే జస్టిస్ అలోక్ అరాధే దంపతులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ కన్నెగంటి లలితకు ఫుల్‌కోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. దాదాపు 7 వేల కేసుల్లో ఆమె తీర్పులు వెలువరించారని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే కొనియాడారు. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మొదటి కోర్టు హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. జస్టిస్ లలిత ఇచ్చిన పలు తీర్పులను అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ చదివి వినిపించారు. మోటార్ వెహికిల్ కేసులలో సత్వర న్యాయంతోనే బాధితులకు న్యాయం జరుగుతుందని, ఏళ్ల తర్వాత వారికి అనుకూలంగా తీర్పు ఇచ్చినా అది ప్రయోజనం చేకూర్చదని జస్టిస్ లలిత ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి కేసులలో న్యాయం త్వరగా అందించేలా కృషి చేయాలన్నారు. తనకు సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇతర సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ లలిత కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..: అనంతరం హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ లలితకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సీజే జస్టిస్ అలోక్ అరాధే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ పల్లె నాగేశ్వర్‌రావు, ఏజీ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, అసోసియేషన్ వైస్ చైర్మన్ కల్యాణ్‌రావు, కార్యదర్శులు పులి దేవేందర్, ప్రదీప్‌రెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్, పూర్ణశ్రీ, శారద తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు రెండో వారంలో చలో హైదరాబాద్: మందకృష్ణ మాదిగ

మోతీనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత సాధించుకునే లక్ష్యంగా మాదిగ జాతి చివరి మెట్టు మీద ఉందని, కేంద్రంతో తాడోపేడో తేల్చుకునేందుకు ఆగస్టు రెండో వారంలో చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. బుధవారం పర్వత్‌నగర్ కమ్యూనిటీ హాలులో ముత్యపాగ శ్రీనివాస్‌మాదిగ అధ్యక్షతన కూకట్‌పల్లి నియోజకవర్గ సన్నాహక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశం మీద చర్చించడానికి జూలై 8న ప్రధాని మోదీని వరంగల్‌లో కలిసినట్లు తెలిపారు. ఇప్పటికి ప్రధాని 3 సార్లు హామీ ఇచ్చారన్నారు. వర్గీకరణ పట్ల కాంగ్రెస్ పార్టీ తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు.

'ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయండి'



సాక్షి, హైదరాబాద్: తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న ఎమ్మెల్యేలంతా మరో వనమాలేనని ఆమె ధ్వజమెత్తారు. అంతా ఎన్నికల కమిషన్‌ను తప్పుదోవ పట్టించిన వాళ్లేనని ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్‌లో చూపింది గోరంతైతే దాచింది కొండంత.. లెక్కకు రాని ఆస్తులు, అంతస్తులు అనంతమని తెలిపారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల అఫిడవిట్లను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.

'కొత్తగూడెం' తీర్పుపై స్టే ఇవ్వండి: వనమా

▶ మొదటి పేజీ తరువాయి

శాసనసభ్యుడిగా సేవలందిస్తున్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. తీర్పును సవాల్ చేసే వరకు అమలుపై స్టే ఇవ్వాలి. ఈ ఏడాది డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ కోర్టు ఇచ్చిన తీర్పు సర్టిఫైడ్ ఆర్డర్ కాపీ ఇంకా అందలేదు.. దీంతో అప్పీల్‌కు సమయం పట్టే అవకాశం ఉంది. అప్పీల్ చేసే వరకు చట్టప్రకారం 30 రోజుల పాటు తీర్పును నిలిపివేయాలి. సర్టిఫైడ్ కాపీ ఇచ్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి'అని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి బుధవారం విచారణ చేపట్టారు. సుప్రీంకోర్టులో తీర్పును సవాల్ చేయనున్నామని, అప్పటివరకు స్టే ఇవ్వాలని పిటిషన్ తరపు న్యాయవాది వాదించారు. ఈ ప్రభుత్వానికి మరో 4 నెలల కాలం మాత్రమే ఉందని, ఇప్పుడు బాధ్యతలు చేపట్టకపోతే ఆ కొద్ది నెలల కాలం పూర్తయ్యే అవకాశం ఉందని న్యాయవాది బదులిచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పును రిజర్వు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని.. 2018, డిసెంబర్ 12 నుంచి జలగం వెంకట్రావునే ఎమ్మెల్యేగా ప్రకటించాలని అధికారులను ఆదేశిస్తూ హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే.



తొలి ప్రేమ అనేది ఒక రకమైన టీకా లాంటిది.
మరోసారి అలాంటిది జరగకుండా అది కాపాడుతుంది.
– హానొరే డె బాల్జాక్

సాక్షి

గురువారం, 27 జూలై 2023

మార్పులన్నీ మంచికేనా?

జీవితంలో శాశ్వతమైన ఒకే ఒక్కటి ఏమిటీ అంటే మార్పు అంటాడు ఓ గ్రీకు తత్త్వవేత్త. వ్యాపార దిగ్గజం ఎలాన్ మస్క్, ఏడాది క్రితం అతని చేజిక్కిన ట్విట్టర్ విషయంలో శాశ్వతమైనది ఏమిటంటే, 'అతి మార్పులు, తరచూ మార్పులు'. సోషల్ మీడియా మెసేజింగ్ వేదిక ట్విట్టర్ పేరును ఎక్స్ డాట్ కామ్‌గా, పిట్ట లోగోను ఎక్స్‌గా జూలై 24న మస్క్ మార్చాక విశ్లేషకుల వ్యాఖ్య ఇది. ప్రపంచ పటంలోని అనేక చిన్నదేశాల స్థూల జాతీయోత్పత్తి కన్నా ఎక్కువగా, దాదాపు 4400 కోట్ల డాలర్లు పెట్టి ట్విట్టర్‌ను కొన్నప్పటి నుంచి వేల ఉద్యోగుల తొలగింపు, బ్లూ టిక్ నిబంధనల్లో మార్పు, ట్వీట్‌లో అక్షరాల పరిమితి పెంపు, ఆ పైన రోజులో ఒక యూజర్ చూసే ట్వీట్ల సంఖ్యపై పరిమితి విధింపు... ఇలా మస్క్ శైలి మార్పులు అనేకం. గత 16 ఏళ్ళలో జరిగిన మార్పుల కన్నా 6 నెలల్లో మస్క్ చేసిన మార్పులే ఎక్కువ. దానికి కొనసాగింపే ప్రకటించిన 24 గంటల్లోనే ఆచరణలో పెట్టిన తాజా పేరు, రూపు మార్పులు. సోషల్ నెట్‌వర్కింగ్ యాప్‌కు మించి ట్విట్టర్‌ను విస్తరించాలనే వ్యూహం దీని వెనకుందట! కొత్త పేరు, రూపుతో బ్యాంకింగ్, షిప్పింగ్ సహా సమస్తం చేసే విస్తృత వ్యాపారంలో ట్వీట్లు ఇక ఓ చిన్న భాగం మాత్రమేనట! ఇప్పటి దాకా అనేక పరిమితుల మధ్య కూడా ఎంతో కొంత స్వేచ్ఛాస్వరానికి వేదికైన ట్విట్టర్ ఇక మరో పక్కా మస్క్ వ్యాపార శాఖగా మారిపోనుంది.

అమెరికా టెక్ వ్యాపారవేత్తలు నలుగురు కలసి చిన్న బృందాల మధ్య సమాచార వినిమయానికి ఎస్ఎంఎస్ సేవ అనే ఆలోచనగా మొదలై, ట్విట్టర్ ఇంతటి విశ్వరూపం దాల్చడం అనూహ్యం. పేరులోని అక్షరాల్లో, లోగోలో అనేక మార్పుల తర్వాత 2006లో పిట్ట బొమ్మ ఆలోచనొచ్చింది. 2010లో ట్రేడ్‌మార్క్ పొంది, 2012లో ఇప్పటి లోగో ఖరారైంది. పదేళ్ళ పైగా లేత నీలం, తెలుపు రంగుల్లో ఈ పాపులర్ వేదిక ప్రపంచ కమ్యూనికేషన్‌లో విడదీయలేని భాగమైంది. పేర్లను మర్చిపోవచ్చు కానీ, లోగోల్ని మాత్రం మనిషి మెదడు మర్చిపోదన్నది శాస్త్రీయ సత్యం. దాన్ని కూడా మస్క్ పక్కన పెట్టారు. యాపిల్, నైక్ సంస్థల లానే లోగోతోనే టక్కున తెలిసిపోతున్న ట్విట్టర్ పేరు, బొమ్మ అన్నీ మార్చడం పైకి అర్థరహితమే! అయితే, అందులోని వ్యాపారతర్కం సదరు పక్కా వ్యాపారికే ఎరుక.

పేరులో ఏముందనేవారికి మస్క్ భిన్నం. వ్యాపారంలో, వ్యక్తిగత జీవితంలో తనకు కలిసొస్తుందని నమ్మే 'ఎక్స్' అక్షరం ఈ సంస్థ భవితవ్యాన్నీ మలుపు తిప్పుతుందని ఆయన భావన. ఎక్స్ అక్షరంపై ఆయన వ్యామోహం ఇవాళ్టిది కాదు. 1999లోనే ఆయన ఎక్స్ డాట్‌కామ్ పేరిట ఓ ఆన్‌లైన్ బ్యాంక్‌కు సహ వ్యవస్థాపకుడు. అనంతరం ఆ సంస్థే 'పే పాల్'గా మారింది. మస్క్ తాలూకు రాకెట్ కంపెనీ పేరు 'స్పేస్ ఎక్స్'. ఆయన సారథ్యంలోని టెస్లా సంస్థ విడుదల చేసిన తొలి స్పోర్ట్ యుటిలిటీ వెహికల్ మోడల్ పేరూ ఎక్సే! చివరకు మూడేళ్ళ క్రితం పుట్టిన తన కుమారుడి పేరు కూడా ఎక్స్ అని వచ్చేలా పెట్టారు. అయితే, ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా 45 కోట్ల మంది నెలవారీ ఖాతాదార్లున్న ట్విట్టర్ పేరు, లోగో మార్పులకు ప్రాథమిక ప్రతిస్పందన అంత ఆశాజనకంగా లేదు.

ట్విట్టర్ పాపులర్ సంస్కృతిలోనే కాదు భాషలోనూ భాగమైంది. ట్వీట్ చేయడమనేది క్రియా పదమైంది. సమాచారం పంచుకొనేవారు ట్వీపుల్ పేర సర్వనామమయ్యారు. ట్విట్టర్ వచ్చాక జనం వార్తలు చదివే తీరు, స్పందించే తీరు అన్నీ మారిపోయాయి. తీరా మస్క్ వచ్చాక ట్విట్టర్ స్వరూపమే కాదు... స్వభావమూ మారిపోయింది. ట్విట్టర్‌ను కొన్నప్పుడు తనంతట తానుగా సందేశాలు పంపే కంప్యూటర్ ప్రోగ్రామైన బోట్ సమస్యను పరిష్కరిస్తాననీ, తిరుగులేని వాక్ స్వాతంత్య్రానికి దీన్ని వేదికగా మారుస్తాననీ మస్క్ మాటిచ్చారు. అవన్నీ నీటి మూటలయ్యాయి. పైపెచ్చు, మస్క్ హయాంలోనే ట్విట్టర్‌లో బోట్స్ సంఖ్య, వాటిలో రకాలు, విషం కక్కే సందేశాలు... అన్నీ పెరిగాయి. అదీ చాలదన్నట్టు మనోడు వచ్చాక ట్విట్టర్‌లో పారదర్శకత తగ్గింది. మీడియాపై ధ్వజమెత్తే మస్క్ అందుకు తగ్గట్టే ట్విట్టర్‌కు జర్నలిస్టులు మెయిల్ చేస్తే జవాబిచ్చే సంప్రదాయానికీ తిలోదకాలిచ్చారు.

ఒకప్పుడు సంపూర్ణ వాక్ స్వాతంత్య్ర వీరుడిననీ, ప్రజాస్వామ్యానికి వాక్ స్వాతంత్య్రమే పునాది అనీ, ట్విట్టరనేది మానవాళి భవితవ్యానికి సంబంధించిన అంశాలను చర్చించే రచ్చబండ అనీ బీరాలు పలికిన మస్క్ తీరా ఏడాది తిరిగేసరికల్లా బోర్డు తిప్పేశారు. ఆ యా దేశాల్లోని చట్టాలను గౌరవించేవాడినని ప్రకటించుకుంటూ, జర్నలిస్టులతో సహా పలువురి ట్విట్టర్ ఖాతాల్ని సస్పెండ్ చేసే స్థితికి వచ్చారు. ఇప్పుడాయన ధ్యేయమల్లా అర్జెంటుగా చేతిలోని పిట్టను ప్రపంచంలో అతి పెద్ద డిజిటల్ ఉత్పత్తుల్లో ఒకటైన చైనా 'ఉయ్‌ఛాట్' పద్ధతిలో సమస్త సర్వీసుల యాప్‌గా మార్చేయడం!

మెసేజింగ్, ట్యాక్సీ సేవల ఆర్డరింగ్, డిజిటల్ చెల్లింపులు అన్నీ చేయడానికి వీలుండే ఉయ్ ఛాట్ ఘన విజయానికి చైనాలో మరో పోటీ లేకపోవడమూ ఒక కారణం. అది మర్చిపోయి, వాక్ స్వాతంత్య్రంతో మొదలైన ఓ వేదిక ఇలా వాక్ స్వాతంత్య్రమే లేని నిరంకుశ దేశంలోని అంశాలతో ప్రేరణ పొందే స్థితికి రావడమే విషాదం. మార్పు మంచికేనని అతిగా నమ్మినట్టున్న మస్క్ ట్విట్టర్‌లో ఏడాదిలో మరీ ఇన్ని మార్పులు చేయడమే విడ్డూరం. ఏమైనా, ఉత్సాహం ఉరకలేస్తూ, స్నేహంగా, స్వేచ్ఛగా తలెత్తి చూస్తున్న నీలిరంగు బుర్రుపిట్ట తుర్రుమంది. నిగూఢతకూ, అపరిమితత్వానికీ ప్రతీకైన నల్లరంగు ఎక్స్ ముందుకొచ్చింది. మిగిలిన వ్యాపారాల మాటేమో కానీ సామాజిక మాధ్యమ వేదికగా ఇది నిలుస్తుందా? సరైన మరో స్వేచ్ఛా వేదిక అవసరమనే సందు తానే సృష్టించినందున భవిష్యత్తులో ఆ రంగంలో వచ్చే పోటీలో గెలుస్తుందా? ఇప్పటికే థ్రెడ్స్ లాంటివి తల ఎగరేస్తున్నాయి. మార్పు మంచికే అయినా, అన్ని మార్పులూ మంచివేనా అంటే ఏమో చెప్పలేం!

టమోటా ధరల్లో ఓ సానుకూల కోణం

విశ్లేషణ



దేవీందర్ శర్మ

ఒకప్పుడు రెండు రూపాయలకు కిలో టమోటాలు అమ్మిన రైతులు, ఉన్నట్లుండి లక్షాధికారులుగా మారారు. ఈ సీజన్‌లో టమోటా ధరలు పెరగడం వారి అదృష్టాన్ని మలుపు తిప్పింది. మండీలను తరచుగా నిలదీస్తున్నారు కానీ, సంస్కరణలు తప్పవని భావిస్తున్న ఈ వ్యవస్థలోనే రైతులకు అనూహ్యంగా అధిక ధర లభించింది. ఏ ప్రైవేట్ కంపెనీ, లేదా వ్యవస్థీకృత రిటైల్ అవుట్‌లెట్ కూడా టమోటా రైతులకు అధిక ధర చెల్లించలేదు. భరోసానిచ్చే, లాభదాయకమైన ధరలు వ్యవసాయాన్ని కొత్త శిఖరాలకు చేర్చగలవని ప్రస్తుత ధరల పెరుగుదల మనకు చెబుతోంది. అయితే తుది వినియోగదారు చెల్లించే ధరలో కనీసం 50 శాతం రైతు పొందేలా అధికారులు తప్పక చూడాలి.

టమోటా ధరల విపరీత పెరుగుదల వినియోగదారుల్లో ఆగ్రహ ప్రతిస్పందనలను కలిగిస్తోంది. అయితే దీనికి ఒక ప్రకాశవంతమైన కోణం ఉంది. ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లకు చెందిన వందలాది టమోటా రైతులు లక్షాధికారులుగా మారారు. ఈ సీజన్‌లో టమోటా ధరలు బాగా పెరగడం వారి అదృష్టాన్ని మలుపు తిప్పింది.

మహారాష్ట్రలోని పుణె జిల్లాలో జున్నర్‌లో 12 ఎకరాల్లో టమోటా సాగు చేసిన తుకారాం భాగోజీ గాయ్‌కర్ అనూహ్యంగా ఆదాయం పెరిగిన వారిలో ఒకరు. ఒక నెలలో 13,000 టమోటా బుట్టలను (ఒక్కోదాన్లో 20–22 కిలోలుంటాయి) విక్రయించి, రూ.1.5 కోట్లకు పైగా సంపాదించారు. కొద్ది రోజులుగా తుకారాం మీడియాలో సంచలనంగా మారారు. అన్నింటి కంటే మించి, కనీస జీవితావసరాలు తీర్చడానికి కష్టపడుతున్న ఒక వ్యవసాయ కుటుంబానికి ఇంత సౌభాగ్యం కలగడం అత్యంత ఆహ్వానించదగినది.

కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన ఒక టమోటా రైతు 2,000 బుట్టల టమోటాలను విక్రయించి, ఒక రోజులో రూ. 38 లక్షలు సంపాదించాడని వార్తలు వచ్చాయి. అతని కుటుంబం కొన్ని దశాబ్దాలుగా సుమారు 40 ఎకరాల్లో టమోటాలు సాగు చేస్తోంది. అయితే ఈసారి అతను సాధించిన ధరలు మునుపటి రికార్డులను అధిగమించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన ఓ టమోటా రైతు రూ.30 లక్షలు సంపాదించాడు.

హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్, సిర్‌మోర్, కులు జిల్లాల్లో టమోటా ధరలు విపరీతంగా పెరగడం వేలాదిమంది టమోటా సాగుదారులకు ఆశీర్వాదంగా మారిందని నివేదికలు చెబుతున్నాయి. సోలన్ మార్కెట్‌లో, నాణ్యమైన ఆపిళ్లకు ఈ సీజన్‌లో రైతులకు లభించే సగటు ధరను టమోటా ధరలు దాటేశాయి. కిలో ఆపిల్ రూ.100 ఉండగా, టమోటా రైతులకు కిలో రూ.102 వరకు పలికింది. గతేడాది కొన్ని రోజుల్లో వీటి ధర బుట్టకు రూ.5 నుంచి రూ.8 ఉండగా, ఇప్పుడు ఒక్కో బుట్ట రూ.1,875 నుంచి రూ.2,400 (కిలో రూ. 90–120) పలికింది.

ఇప్పుడు, రైతులు కోటీశ్వరులు కావడం సులభమని మీరు తప్పుడు అభిప్రాయానికి వచ్చే ముందు, అధిక రిటైల్ ధరను రైతులకు బదిలీ చేసిన అరుదైన సందర్భాలలో ఇదొకటి అని నేను స్పష్టం చేస్తున్నాను. కొన్ని నెలల క్రితమే ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో సహా దేశంలోని ఇతర ప్రాంతాలలో టమోటాలను పశువులకు తినిపించినట్లు, లేదంటే వాగులలో పారబోసినట్లు వార్తలు వచ్చాయి. టమోటా ధరలు పెరగక ముందు, జూన్ ప్రారంభంలో కూడా మహారాష్ట్ర రైతులు కిలోకు 2 రూపాయల ధరను కూడా చూడలేకపోయారు. వ్యవసాయ రంగ దుఃస్థితి ఒక మినహాయింపుగా



కాకుండా సాధారణంగా ఉంటూ వస్తోంది.

హరియాణాలోని భివానీ జిల్లాలో 42 ఎకరాల్లో టమోటా సాగు చేస్తున్న ఓ ప్రగతిశీల రైతు ఈ అవకాశాన్ని కోల్పోయానని విచారం వ్యక్తం చేస్తున్నాడు. 'నాలుగు నెలల తక్కువ ధరల తర్వాత, నేను దాదాపు రూ. 8–10 లక్షల నష్టంతో సుమారు రెండు నెలల క్రితం నా మొత్తం పంటను పీకేశాను. జూన్ మధ్య తర్వాత ధరలు విపరీతంగా పెరుగుతాయని నాకు తెలిసి ఉంటే, నేను కచ్చితంగా చాలా డబ్బు సంపాదించి ఉండేవాడిని' అని రమేష్ పంఘాల్ నాతో అన్నారు. 'నా అదృష్టం బాలేదు' అని వాపోయారు. అదృష్టదేవత వరించిన కొద్ది మంది కంటే ఎక్కువ సంఖ్యలో రైతులు ఈ అపూర్వమైన టమోటా ధరలను అపనమ్మకంతో చూస్తున్నారని ఇది తెలియజేస్తోంది.

ఈ అనిశ్చిత విజయాలను అలా పక్కనుంచి, విపరీతమైన ధరల పెరుగుదల నుండి కొన్ని ముఖ్యమైన పాఠాలను తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. బహుశా, ఇది ప్రధానంగా వ్యవసాయ కష్టాల తీవ్రతకు దారితీసిన ఆధిపత్య ఆర్థిక ఆలోచనను సంస్కరించడానికి సహాయపడుతుంది. వినియోగదారులకు టమోటా ధరలు స్థిరంగా పెరిగాయని మనం అంగీకరిస్తున్నప్పటికీ, తక్కువ ధరలు దశాబ్దాలుగా కోట్లాదిమంది వ్యవసాయదారుల జీవనోపాధి మీద బలమైన దెబ్బ కొట్టాయని గ్రహించాలి. వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా దారిద్ర్యంలో ఉంచారని నేను ఎప్పుడూ అనుకుంటాను. సాధారణంగా ముద్ర వేసిన విధంగా రైతులు అసమర్థులు కాదు కానీ వారు తప్పుడు స్థూల ఆర్థిక విధానాల బాధితులుగా ఉండిపోయారు. రైతులకు ఆర్థికంగా లాభదాయకమైన జీవనోపాధిని నిరాకరిస్తూ వచ్చారు.

టమోటా సాగు విషయానికి వస్తే – రైతులు అధిక దిగుబడినిచ్చే అన్ని పద్ధతులనూ చేపట్టారు. ఇందులో భాగంగా అత్యంత ఖరీదైన హైబ్రిడ్ విత్తనాలను కొనుగోలు చేశారు. ఇవన్నీ ప్రమోట్ చేసిన సాగు ఆచరణల ప్యాకేజీలో భాగం. రైతులకు విక్రయిస్తున్న ప్రతి సాంకేతికత కూడా ఉత్పాదకతను పెంచుతుందనీ, తద్వారా అధిక ఆదాయాన్ని ఇస్తుందనీ వాగ్దానం చేస్తుంది. కానీ అది జరగలేదు. దీనికి విరుద్ధంగా రైతు సాంకేతిక ఇన్‌పుట్‌లను ఉపయోగిస్తాడు, కష్టపడి కుటుంబ శ్రమను వెచ్చించి రికార్డు స్థాయిలో పంటను పండిస్తాడు, తీరా మార్కెట్ ధరలు పడిపోయాయని తెలుసుకుంటాడు. రైతు పొందిన ధర తరచుగా పెట్టుబడి ఖర్చును కూడా తీసుకురాదు.

బిజినెస్ మేనేజ్‌మెంట్ పాఠశాలలు తరచుగా సమర్థమైన వ్యవసాయ సరఫరా గొలుసులలో భాగం కానందుకు రైతులను నిందిస్తున్నాయి. టమోటా రైతు, ఆ మాటకొస్తే ఇతర రైతులూ విలువ జోడింపు చేస్తే తప్ప సహేతుకమైన లాభాలు పొందలేరు. అందుకే వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీలను (ఏపీఎంసీ) విస్మరించి, కార్పొరేట్ నిచ్చెన మెట్ల పైకి వెళ్లాలని అంతర్లీనంగా ఉద్ఘాటిస్తున్నారు. వ్యవసాయాన్ని సంపద్వంతం చేయడానికి వ్యవసాయాన్ని మరింత సరళీకరించడం, ప్రైవేటీకరించవలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని నీతి ఆయోగ్ ఇటీవల ఒక కార్యాచరణ పత్రాన్ని విడుదల చేసింది. అయితే వ్యవసాయ విధానాలను మనం అరువుగా తెచ్చుకున్న అమెరికాలో కూడా, వ్యవసాయ కార్పొరేటీకరణ వ్యవసాయ ఆదాయాలను పెంచడంలో సహాయపడలేదని నీతి ఆయోగ్ గ్రహించడం లేదు.

వ్యవసాయ సంక్షోభానికి సమాధానం ఎక్కడో ఉందని వెల్లువెత్తుతున్న టమోటా ధర చెబుతోంది. ఏపీఎంసీ – మండీ వ్యవస్థను తరచుగా నిలదీస్తున్నారు కానీ సంస్కరణలు తప్పవని భావిస్తున్న ఈ వ్యవస్థలోనే రైతులకు అనూహ్యంగా అధిక ధర లభించింది. ఏ ప్రైవేట్ కంపెనీ, లేదా వ్యవస్థీకృత రిటైల్ అవుట్‌లెట్ కూడా టమోటా రైతుకు అధిక ధర ఇవ్వలేదు. అదేవిధంగా, ఈ సీజన్‌లో లాభపడిన కొంతమంది టమోటా సాగుదారుల సంపద సమర్థమైన సరఫరా గొలుసుల ద్వారా పెరగలేదు.

ఇదంతా పూర్తిగా ధరలపై ఆధారపడి ఉంది. భరోసానిచ్చే, లాభదాయకమైన ధరలు వ్యవసాయాన్ని కొత్త శిఖరాలకు చేర్చగలవని ప్రస్తుతం టమోటా ధరల ఆకస్మిక పెరుగుదల మనకు చెబుతోంది. రెండు సీజన్లలో అటువంటి అధిక ధరలు లభించినట్లయితే, మీరు సంపన్నమైన టమోటా సాగుదారులకు చెందిన కొత్త తరగతి ఆవిర్భావాన్ని చూస్తారు.

ధరలు నిర్దిష్టం కంటే తగ్గకుండా ఉండేలా కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేస్తున్నప్పుడు, తుది వినియోగదారు చెల్లించే ధరలో కనీసం 50 శాతం రైతులు పొందేలా అధికారులు తప్పక చూడాలి. రైతులను బతికించాలంటే అధిక ధర చెల్లించడం అత్యవశ్యం అని వినియోగదారులు గ్రహించాల్సిన సమయం ఇది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిజమైన సంతోషం



చాలా ఉదారమైన అనులేఖనానికి నేను అర్హురాలిని కాక పోయినప్పటికీ, గాల్‌బ్రెయిత్ అవార్డ్–2023 తీసుకోవడం నాకు నిజంగా సంతోషం కలిగించింది. ('ఆర్థిక శాస్త్రంలో విలువైన ఆవిష్కరణలు: నాయకత్వం, పరిశోధన, సేవ ద్వారా మానవాళికి విశిష్ట తోడ్పాటుకు గుర్తింపుగా' ఇచ్చారు.)

– జయతీ ఘోష్, ఆర్థికవేత్త

సెల్యూట్!



కార్గిల్ పోరాటంలో తమ జీవితాలను త్యాగం చేసిన సాహస సైనికుల గౌరవార్థం సెల్యూట్ చేయడానికి ఒక క్షణం తీసుకుందాం. మన దేశాన్ని రక్షించడంలో వారి చెదరని ధైర్యం, పట్టుదల అనేవి మన అపార గౌరవం, కృతజ్ఞతలకు అర్హమైనవి. (జూలై 26న కార్గిల్ విజయ్ దివస్.)

– తాహిర్ అన్వర్, రేషనల్ ముస్లిం

జాగ్రత్తలు



కళ్లకలక కేసులు పెరుగుతున్నాయి. కళ్లను తాకడం, రుద్దుకోవడం చేయవద్దు. కళ్లను తాకేట్టయితే చేతుల్ని శుభ్రంగా కడుక్కోవాలి. ఇది వైరల్ ఇన్‌ఫెక్షన్ కాబట్టి యాంటీ బయాటిక్స్ అక్కర్లేదు. ప్యారసిటమాల్ మాత్ర, చన్నీటి కాపడం ఉపశమనం కలిగిస్తాయి.

– జోయీతా, ఫిజీషియన్

తప్పు మాట



మాంసాహారం తక్కువ కులానికి సంబంధించినదనే మాట తప్పు. ఇరు పక్షాలూ ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసిన అతి పెద్ద భ్రమ ఇది. – అమిత్ పాండీలియా, కాలమిస్ట్

ఏమైనట్టు?



కొన్నేళ్ల క్రితం 'క్లింటన్'ల వ్యక్తిగత షెఫ్ మునిగి పోయినట్టుగానే హుస్సేన్ ఒబామా (అమెరికా మాజీ అధ్యక్షుడు) వ్యక్తిగత షెఫ్ వాళ్ల ఇంటి దగ్గరి కొలనులో మునిగి పోయాడు. వీళ్ళూ స్వేచ్ఛా ప్రపంచపు నాయకులు!

– అజిత్ దత్తా, రచయిత

ప్రత్యామ్నాయ యోధుడు

సందర్భం



డా॥ కోయి కోటేశ్వర రావు

'రాత్రి తోడేళ్ళ దాడిలో అమాయకపు గొర్రె పిల్లలు బలవుతాయి. ఆ గొర్రె పిల్లలు చిందించిన నెత్తుటి ధారలు లోయల్లోని రాతి గుట్టల మీద పడి ఉంటాయి. ఉదయించిన సూర్యుడు ఈ ఘోరాన్ని సమాజానికి చాటి చెబుతాడు.' – ఖలీల్ జీబ్రాన్

కారంచేడు పొలాలను ముంచెత్తిన దళితుల నెత్తుటి గాయాల్లోనుండి కనీ వినీ ఎరుగని ఆత్మగౌరవ పోరాటాన్ని నిర్మించిన అసమాన సామాజిక, సాహిత్య వైతాళికుడు డా॥ కత్తి పద్మారావు. పీడిత ప్రజలపై జరుగుతున్న మారణ కాండనూ, అందుకు కారణమైన కుల వ్యవస్థ కుటిల నీతినీ, దీనిని అంతం చేయడానికి అవసరమైన బృహత్తర చైతన్యాన్నీ తెలుగు నేల మీద రగిలించిన ఉద్యమ భాస్కరుడాయన.

అసాధారణమైన వక్తృత్వంతో, ప్రగాఢమైన, కర్తృత్వంతో, నిబద్ధత కలిగిన నేతృత్వంతో డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన కుల నిర్మూలనా పోరాట రథాన్ని పద్మారావు ముందుకు తీసుకుపోతున్నారు. డెబ్బై ఏళ్ళ ప్రాయంలో కూడా వేయి చేతులతో స్ఫూర్తిదాయకమైన సృజన చేస్తున్నారు. కవిత్వం, విమర్శ, చరిత్ర, సంస్కృతి, తత్వశాస్త్రం, కులం, మతం, పితృస్వామ్య రాజకీయం, తులనాత్మక వివేచన, సాహిత్య చరిత్ర, వ్యక్తిత్వవికాసం లాంటి అనేక అంశాల్లో ఎనభైకి పైగా బృహత్ గ్రంథాలను వెలువరించారు.

పొట్ట పొడిస్తే ఆకలి పేగులు తప్ప, అక్షరం ముక్కరాని నిరుపేద దళిత కుటుంబంలో పద్మారావు జన్మించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉద్యోగాన్ని విడనాడి, దళిత ఉద్యమంలోకి దూకారు.

ప్రత్యామ్నాయ సాహిత్య, సాంస్కృతిక విజ్ఞాన సర్వస్వంలా పద్మారావు ప్రతి నిత్యం ప్రజ్వలిస్తుంటారు. తన పదమూడు కవితా సంకలనాలలో సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ప్రతిభావంతంగా అక్షరబద్ధం చేశారు. 'మనిషే ఓ మహా కావ్యం', 'ఈ యుగం మాది' వంటి దళిత మహా కావ్యాలతో పద్మారావు బుద్ధుని నైతిక ప్రబోధాన్నీ, అంబేడ్కర్ సైద్ధాంతిక దృష్టినీ కవిత్వీకరించారు.

అస్తిత్వ ఉద్యమాల వెలుగుల్లో పద్మారావు తెలుగు సాహిత్య చరిత్రను పునర్నిర్మించారు. దళిత బహుజనుల చరిత్ర మూలాలను తవ్వి పోశారు. దళిత కోణం నుండి భారత దేశ చరిత్రను వ్యాఖ్యానించారు. 'భారతీయ సంస్కృతిలో స్త్రీ', 'పితృస్వామ్య సంస్కృతిలో స్త్రీ' అనే పరిశోధన గ్రంథాల ద్వారా అనాదిగా స్త్రీలపై జరుగుతున్న అణచివేతను సాధికారికంగా నిరూపించి, మహిళా విముక్తికి మార్గం చూపారు. అత్యంత సంక్లిష్టమైన చార్వాక, బౌద్ధ దర్శనాలను రచించి, భారతదేశ తత్వశాస్త్రంపై పద్మారావు కొత్త వెలుగులు ప్రసరింపజేశారు.

భారత దేశంలో సాంఘిక ఉగ్రవాదం, ఆర్థిక తీవ్రవాదం విజృంభిస్తున్న ప్రమాదకరమైన సందర్భంలో అంబేడ్కర్ బహుముఖీన భావ జాల ఔన్నత్యాన్నీ, ఆ విశ్వ విజ్ఞాన మూర్తి ప్రాసంగికతనూ తన రచనల్లో అద్భుతంగా చాటి చెప్పారు.

'నా జీవిత చరిత్ర అంటే, నేను జీవించిన కాలంలో తెలుగు వారి జీవిత చరిత్ర' అనే ఎరుకతో పద్మారావు తన ఏడు దశాబ్దాల జీవన ప్రస్థానాన్ని కళ్ళకు కట్టినట్లుగా విశదీకరిస్తూ రాసిన 'ఒక అస్పృశ్యుని యుద్ధ గాథ' పెను సంచలనం. ఈ యుద్ధగాథను చదివితే, అంటరానితనాన్నీ, పేదరికాన్నీ ఎదుర్కొని వర్గ, కుల, మత వివక్షనూ, రాజ్య హింసనూ తట్టుకొని విజేతగా ఎదగటానికి అవసరమైన మెథడాలజీ అర్థమవుతుంది. 'నాది తరతరాల పాట, విశ్వంలో చీకటి నిడివెంతో నా పాట జీవితమంత' అని కలమెత్తి, గళమెత్తి గర్జిస్తున్న పద్మారావు ఈనాటి తరానికి విలువైన జ్ఞానాన్ని నేర్పుతున్నారు.

వ్యాసకర్త మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు। 94404 80274

దళితోద్యమ దీపశిఖ



నేడు డా॥ కత్తి పద్మారావు 70వ జన్మదినం

సందర్భం



డా॥ జి.వి.రత్నాకర్

'చరిత్ర ప్రతి మలుపులో ఓ ఉద్యమం. ఉద్యమం ఆగిన ప్రతి మజిలీలో ఒక నాయకుడు పుడతాడు' అని ఓ చైనా సామెత. కులం, ఆ కులానికి ఆధారమైన మతం, మత విశ్వాసాలు వాటికి పునాదులైన పురాణాలు, స్మృతులు వంటివాటిపై ఈ దేశ జనానికి సరైన అవగాహన లేకపోవడం వల్ల కీలవేన్మణి, కారంచేడు, చుండూరు, నేటి మణిపూర్ మతోన్మాద హింసాకాండ వంటివి దేశాన్ని కాల్చుకు తింటున్నాయి. అంతర్జాతీయ యవనిక మీద తలదించుకొనేలా చేస్తున్నాయి. అలాంటి అత్యంత దుర్మార్గమైన చరిత్ర మలుపుల్లో బుద్ధుడు, పూలే, అంబేడ్కర్, అయ్యంకాళీల వరుసలో ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమమే తయారు చేసుకొన్న నాయకుడు డా॥ కత్తి పద్మారావు. మాల, మాదిగ అంటరాని పల్లెల వెతల్నీ, ఆక్రందనల్నీ, ఆవేదనల్నీ నిలువెల్లా నింపుకొన్న మహోన్నతమైన సాహితీ ఉద్యమ స్ఫూర్తి పద్మారావు. ఆయన స్థాపించిన 'దళిత మహాసభ' తెలుగు నేలపై దళితోద్యమానికి దీపశిఖ అయ్యింది.

కారంచేడు దుర్మార్గపు హత్యాకాండతో చలించిపోయి ఉద్యోగాన్ని వదిలి ఉద్యమంలోకి దూకారు కత్తి. చుండూరులో అమరులైన దళితుల శవాల్ని ఊరి నడిబొడ్డున రక్త క్షేత్రంలో ఖననం చేయించి ఢిల్లీ బోట్‌క్లబ్ దాకా ఉద్యమాన్ని నడిపిన ధీశాలి ఆయన. ఆయన కవిత్వం, ఉపన్యాసం, చరిత్ర రచన, ఉద్యమ నిర్మాణం ... దేనికదే తమదైన ప్రత్యేకతతో కనిపిస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లో స్వామి అచుతానంద్ శిష్యులుగా భాగ్యరెడ్డివర్మ, కుసుమ ధర్మన్నలు నిర్మించిన 'ఆది హిందూ' ఉద్యమం కొంతమేరకు దళిత మహాసభకు మార్గదర్శకంగా ఉంది. నేడు దళిత చైతన్యం... సామాజిక అవలక్షణాల నుంచీ, సాంస్కృతిక బానిసత్వం నుంచీ విముక్తిని పొందే దిశలో ముందుకు కదులుతోంది. ఆ చైతన్య స్థాయిని మనం పద్మారావు కవిత్వంలో చూడవచ్చు. తెలుగు దళిత కవిత్వంలో ఆయన కవిత్వానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. 'జైలు గంటలు' మోగించుకొంటూ మాల, మాదిగ పల్లెల్లో నీలి కేకలు సృష్టిస్తూ, అంటరాని అణగారిన కులాల అవమానాగ్నుల్ని 'ముళ్ళ కిరీటంగా' ధరించి; అంటరాని వారి, 'భూమి భాష'నే మాట్లాడుతూ 'కట్టెల మోపుని' నెత్తికెత్తుకొని, 'ఆత్మ గౌరవస్వరం'తో, 'ఈ దేశం మాది' అంటూ దూసుకు వచ్చారు.

ఆయన 'ఆమె పాదాల నెర్రెలు ఒక పునఃస్పష్ట సంకేతాలు' కవితలో: 'మీరు మానవ సంస్కృతి నుండి శిల్ప సంస్కృతికి/ పరిణమిస్తున్నారు/ అందుకే మీలో మానవతా స్పర్శ లేదు/ అందుకే మళ్ళీ ఆ దళిత తల్లి/ మానవతా పాఠశాల/ అందులో/ విద్యార్థులం అవుదాం! రండి/ అప్పుడే భారత దేశానికి/ పునరుజ్జీవం' అంటారు.

నేడు సమాజంలో వ్యాపిస్తున్న విష సంస్కృతిని, కుల హత్యలు, పరువు హత్యల్ని నిరసిస్తూ:

'వివాహానికి కులం అడ్డుందని/ ఏ దేవుడు చెప్పాడు?/ ప్రేమ ఒక సంపద/ సంపద కోసం/ ప్రేమను చంపడమెందుకు?/ఇక రాబోయేది/ సంకెళ్ళు తెంచే కాలం/ గోడలు కూల్చే కాలం/ ప్రేమదే విజయం/ ప్రేమదే విశ్వజనీన సూత్రం... అంటారు.

మరోచోట... 'జీవితం ఒక మహాయానం/ ఆ ప్రయాణంలో కడలి అలల్లోని/ స్వరం మనకు వినిపిస్తోంది./ ఏవో ఉక్కు సొధాలు/

కూలుతున్న శబ్దాలు/ మనకు వినిపిస్తాయి/ బౌద్ధ రాజ్య ఆవిర్భావం కోసం/ ఆత్మ గౌరవంతో ప్రజ్వలించాలి/ అంబేడ్కర్ పునరుజ్జీవన/ ఆయుధకర్త' అంటారు.

భారతీయ దళిత కవిత్వంలో డా॥ కత్తి పద్మారావు కవిత్వం ప్రత్యేక శైలిలో కనిపిస్తుంది. అది దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను కళ్లకు గట్టింది. నా చిన్నప్పటి నుండి ఆయన ఉపన్యాసాలు వింటూ, కవిత్వం చదువుతూ పెరిగాను. కత్తి నాయకత్వం ఎప్పటికీ నాకు ఓ మహోన్నత శిఖరాం లానే కనిపిస్తుంది.

వ్యాసకర్త హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందీ, ఎమ్ఎఎన్‌యూ యూనివర్సిటీ । 70135 07228

ప్రతి క్షణం మెలకువగా...

1. స్వర్గం తలుపులు

నొబుషిగె అనే పేరు గల సైన్యాధికారి, జెన్ గురువు హకుఇన్‌ను అడిగాడు: "నిజంగా స్వర్గం, నరకం ఉన్నాయా?"

"ఎవరు నువ్వు?" అని అడిగాడు హకు ఇన్.

"నేను సైన్యాధికారిని." చెప్పాడు నొబుషిగె.

"నువ్వో సైన్యాధికారివా! రక్షణ కొరకు నిన్నే ప్రభువు తన కొలువులో పెట్టుకుంటాడు? అడుక్కు తినేవాడి మొహంలా ఉంది నీ మొహం" అన్నాడు హకు ఇన్.

నొబుషిగె అరికాలిమంట నెత్తికెక్కింది. ఒర నుండి కత్తి దూయబోయాడు. హకు ఇన్ తన ధోరణి ఆపకుండా కొనసాగించాడు: "నా కంఠం ఉత్తరించేటంత పదును నీ కత్తికి లేదను కొంటాను."



జ్యోతిర్మయం

నొబుషిగె కత్తిని ఒర నుండి బైటకు లాగినాక, హకు ఇన్ అన్నాడు: "ఇప్పుడు నరకం తలుపులు తెరుచుకున్నాయి."

ఈ మాటలు వినగానే సైన్యాధికారికి అర్థం అయ్యింది, గురువుగారు శిష్యులకు నేర్పే శిక్షా పద్ధతి ఇది అని! వెంటనే కత్తి ఒరలో దూర్చి, నమస్కారం చేశాడు. హకు ఇన్ అన్నాడు: "ఇప్పుడు స్వర్గం తలుపులు తెరుచుకొన్నాయి."

2. ప్రతిక్షణం జెన్

ఇతరులకు జెన్ బోధించే అర్హత సంపాదించటానికి ముందు ఎవరైనా కనీసం పది సంవత్సరాలు తమ గురువుల వద్ద శిష్యరికం నెరపవలసి ఉంటుంది. అలా నిర్ణీత కాలంలో జెన్ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకొన్న టెన్నో అనే జెన్ గురువు, ఓ రోజు నాన్ ఇన్ అనే ఓ ప్రసిద్ధ జెన్ గురువును కలుసుకొనేటందుకు వచ్చాడు. ఆ రోజు వర్షం పడుతుండటం వల్ల టెన్నో కాళ్ళకు కొయ్యమడమలు గల పాదరక్షలు ధరించి, చేత్తో గొడుగు పుచ్చుకొని వచ్చాడు. అతణ్ణి మర్యాదపూర్వకంగా పలకరించటం అయ్యాక, నాన్ ఇన్ అతడితో అన్నాడు: "నీవు నీ పాదరక్షల్ని వరండాలో విడిచిపెట్టి ఉంటావు. నీ గొడుగును పాదరక్షలకు కుడివైపున విడిచి పెట్టినావా? ఎడమవైపున విడిచిపెట్టినావా?"

టెన్నో గందరగోళంలో పడిపోయాడు. వెంటనే ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. అతడికి అర్థమయింది, తాను జెన్ తత్వాన్ని ప్రతి క్షణం అనుభవంలోకి తెచ్చుకోలేకపోయాను అని! అతడు నాన్ ఇన్‌కు శిష్యుడయి, మరో ఆరేళ్ళు అతడి దగ్గర జెన్ అభ్యసించి ప్రతి క్షణం జెన్‌ను జీవించటం ఎలాగో నేర్చుకొన్నాడు.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.నవమి ఉ.10.17 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** విశాఖ రా.9.17 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** రా.1.15 నుండి 2.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.47 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** ప.12.21 నుండి 1.56 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.

రేపు 'కేసీఆర్ విద్యాబంధు'

- పథకానికి విద్యాబంధు, కేసీఆర్ విద్యాకానుకతో సహా 20 పేర్లు పరిశీలన
- పేరు, పూర్తి విధివిధానాలు ఎంహెచ్ఆర్‌డీలో 28న ప్రకటన
- రూ.150 కోట్ల బడ్జెట్‌తో పథకానికి రూపకల్పన
- ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలు
- మంత్రి గంగుల కమలాకర్ వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో వెనకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం తీపి కబురు మోసుకొచ్చింది. దాదాపు రూ.150 కోట్ల బడ్జెట్‌తో బీసీ గురుకులాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువస్తున్నట్లు మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ పథకానికి సంబంధించిన వివరాలు తెలిపారు. కేసీఆర్ విద్యాకానుక/కేసీఆర్ విద్యాబంధు/స్వదేశీ విద్యానిధి.. ఇలా దాదాపు 20 పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ఈనెల 28న హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగం(ఎంహెచ్ఆర్‌డీ)లో పథకం పేరు, జీవో విడుదల, లోగోతోపాటు విధివిధానాలను ఆవిష్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ సంఘం నేత జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ హాజరవుతున్నారని చెప్పారు.

గురుకులాలన్నీ ఒకే గొడుగు కిందకు..: కేవలం స్కూల్ వరకు విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలు చెల్లిస్తే.. సరిపోదని భావించిన కేసీఆర్.. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కూడా అవే సౌకర్యాలు కల్పించాలని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి గంగుల తెలిపారు. ఈ నిర్ణయంతో 302 హాస్టళ్లలో చదువుకుంటున్న 33,687 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. వీరికి డైట్, కాస్మెటిక్ చార్జీలతోపాటు నోట్‌బుక్స్, రికార్డ్స్, బెడ్‌షీట్లు తదితరాలు అందిస్తామన్నారు. అదే విధంగా ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్‌సీ, ఐఐటీ, ఎయిమ్స్‌తో పాటు అన్ని ప్రముఖ వర్సిటీలు, జాతీయ ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో చదువుకునే విద్యార్థులకు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.2 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు కూడా చెల్లిస్తామని మంత్రి స్పష్టంచేశారు. అందుకే, గురుకులాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడమే నూతన పథకం ముఖ్యఉద్దేశమని శుక్రవారం విధివిధానాలు వివరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవి శంకర్ పాల్గొన్నారు.

మనమెక్కడో తెలుసుకుందాం..!

- తమ పనితీరు, నియోజకవర్గాల్లో పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతల సొంత సర్వేలు
- ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణకు మొగ్గు
- ప్రత్యర్థుల బలం, బలహీనతలు అంచనా వేసేందుకు ప్రాధాన్యత
- పైపైన సర్వేలు కాకుండా లోతైన విశ్లేషణ కోరుతున్న నేతలు
- క్షేత్రస్థాయిలో రంగంలోకి కన్సల్టెన్సీలు..
- రైతులు, యువత, మహిళలు తదితర ప్రభావశీలుర నుంచి శాంపిళ్ల సేకరణ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తమ బలాలు, బలహీనతలు అంచనా వేసుకునేందుకు భారత్ రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు, నేతలు సొంత సర్వేల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎన్నికలకు మరో మూడు నాలుగు నెలల వ్యవధి మాత్రమే ఉండటంతో తమ తమ నియోజకవర్గాల్లో పరిస్థితిని, ప్రజాభిప్రాయాన్ని అంచనా వేసే పనిలో పడ్డారు. పనితీరు మెరుగ్గా ఉండి గెలుపు అవకాశాలు ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ టికెట్ దక్కుతుందని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో ఎమ్మెల్యేలు 'థర్డ్ పార్టీ' సర్వేలు చేయించుకుంటున్నారు. తమ పనితీరు, అదే సమయంలో ప్రత్యర్థుల బలాబలాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఈసారి గట్టిగా టికెట్ ఆశిస్తున్న బీఆర్ఎస్ నేతలు కూడా సర్వేలపై ఆసక్తి చూపిస్తున్నారు.

పథకాలు, పనితీరు ప్రభావంపై అంచనా

ప్రభుత్వ పథకాలతో పాటు తాము చేపట్టిన సేవా కార్యక్రమాలు, ఇతర పనులు ఎంతవరకు ప్రభావం చూపించే అవకాశం ఉందో ఓ అంచనాకు వచ్చేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు ప్రయత్నిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం, కింది స్థాయిలో కేడర్ పనితీరు తమ గెలుపోటములను ప్రభావితం చేస్తాయనే భయం ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. పార్టీ గ్రామ, మండల స్థాయి నాయకుల పనితీరు పైనా, తమతో ఉన్న సాన్నిహిత్యాన్ని వారేమైనా దుర్వినియోగం చేశారా అనే కోణంలోనూ సర్వేలు చేయిస్తున్నారు. సర్వేలతో పాటు వివిధ మార్గాల్లో ఆయా అంశాలపై ఎమ్మెల్యేలు ఆరా తీస్తున్నారు. కేవలం పైపైన సమాచారంతో సరిపుచ్చుకోకుండా లోతుగా విశ్లేషించాలని కన్సల్టెన్సీలను కోరుతున్నారు. ఒక్కో మండలాన్ని మూడు నాలుగు క్లస్టర్లుగా విభజించి ఇన్‌ఫ్లూయెన్సర్స్ (ప్రభావశీలురు) నుంచి వివరాలు సేకరించేలా చేస్తున్నారు. ఇన్‌ఫ్లూయెన్సర్స్ కేటగిరీలో రైతులు, యువత, మహిళలు, మైనారిటీలు, కార్మికులు, ఉద్యోగులు, ఆర్ఎంపీలు, ఎల్ఐసీ ఏజెంట్లు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తదితరులను చేర్చి కన్సల్టెన్సీలు శాంపిళ్లు సేకరిస్తున్నాయి.

ఎన్నికల మేనేజ్‌మెంట్ సంస్థలకు ఫుల్ గిరాకీ

ఎన్నికలు సమీపిస్తున్న వేళ సర్వే సంస్థలకున్న గిరాకీని దృష్టిలో పెట్టుకుని పలు కన్సల్టెన్సీలు పుట్టుకొస్తున్నాయి. సర్వేలతో పాటు ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ప్రచారం, ఇతర కార్యకలాపాల కోసం ఎమ్మెల్యేలు సొంతంగా కన్సల్టెన్సీలను నియమించుకుంటున్నారు. సోషల్ మీడియా ఖాతాల నిర్వహణ, ఎన్నికల మేనేజ్‌మెంట్, ఎలక్షన్ ఇంజనీరింగ్, ప్రచార వ్యూహాల రూపకల్పన, పర్సెప్షన్ మేనేజ్‌మెంట్ (ఓటర్ల ఆలోచన విధానంలో మార్పు) తదితర సరికొత్త అంశాలతో ఈ కన్సల్టెన్సీలు రాజకీయ నేతలను ఆకర్షిస్తున్నాయి. ఈ కన్సల్టెన్సీల ద్వారా నియోజకవర్గాల్లో జరిగే కార్యకలాపాలను నేతల కుటుంబ సభ్యులు, సన్నిహితులు పర్యవేక్షిస్తున్నారు. పార్టీ వర్గాల నుంచి అందే సమాచారం కంటే ఈ థర్డ్ పార్టీ సంస్థల నుంచి అందే నివేదికలు శాస్త్రీయంగా ఉంటాయనే ఉద్దేశంతో ఎమ్మెల్యేలు వీటివైపు మొగ్గు చూపుతున్నారు.



పార్టీ సర్వే నివేదికలపై ఎమ్మెల్యేల ఆసక్తి

గతంలో బీఆర్ఎస్‌కు రాజకీయ వ్యూహాలు, సర్వే సేవలు అందించిన ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐ ప్యాక్ దూరమైన తర్వాత ఇతర సంస్థలు తెరమీదకు వచ్చాయి. డిజిటల్ మీడియా వింగ్‌కు చెందిన ఓ నిపుణుడి ఆధ్వర్యంలో నడుస్తున్న ఓ సర్వే సంస్థ ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఎన్నికల కోణంలో విస్తృత సేవలు అందిస్తోంది. 'కె2 కన్సల్టెన్సీ'గా రాజకీయ వర్గాల్లో ప్రచారంలో ఉన్న ఈ సంస్థ విపక్ష పార్టీల కన్సల్టెన్సీల కంటే చాలా ముందంజలో ఉన్నట్లు సమాచారం. దీనితో పాటు పొరుగు రాష్ట్రానికి చెందిన ఓ ఎమ్మెల్యే నేతృత్వంలోని సంస్థ కూడా సర్వేలు చేసి నివేదికలు అందిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ కన్సల్టెన్సీల నివేదికలతో పాటు ప్రభుత్వ నిఘా వర్గాల నుంచి తమపై వెళ్తున్న నివేదికల వివరాలు తెలుసుకునేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆసక్తి చూపిస్తున్నారు.

పారదర్శక ఎన్నికలకు ఓటరు జాబితానే కీలకం

ఈఆర్‌వో, డీఎల్ఎంటీల శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: ప్రజాస్వామ్య వ్యవస్థలో అతి ముఖ్యమైన ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో ఓటరు జాబితాలే కీలకమని, వీటి రూపకల్పనలో సంబంధిత అధికారులు జాగరూకతతో వ్యవహరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ సూచించారు. అధికారుల వద్దకు వచ్చే ఓటరు జాబితా సవరణలు, చేర్పులు, తొలగింపుల దరఖాస్తులను న్యాయ నిబంధనలకు లోబడి జాగ్రత్తగా పరిష్కరించాలన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం)లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌వో), జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ల (డీఎల్ఎంటీ)కు తొలి దశ శిక్షణ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ)లో బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఓటరు జాబితా తయారీపై సమగ్ర శిక్షణను అన్ని స్థాయిల్లోని అధికారులకు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ శిక్షణకు రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన 59 మంది ఈఆర్‌వోలు, 15 మంది డీఎల్ఎంటీలు హాజరయ్యారు. శిక్షణలో ప్రముఖ జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనర్లయిన చంద్రకిశోర్ శర్మ (జమ్మూ కశ్మీర్), శశిపాల్ శర్మ (హిమాచల్ ప్రదేశ్), పి.కె.బినోయ్, జయమాధవ్ (కర్ణాటక)లు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధానాధికారి లోకేశ్‌కుమార్, సంయుక్త ప్రధానాధికారి సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆ గ్రామాలను ప్రకృతి వ్యవసాయ జోన్‌గా ప్రకటించాలి

- జంట జలాశయాల ఎఫ్‌టీఎల్ లోపల ఉన్న నిర్మాణాలను తొలగించాలి
- 111 జీవోపై టీపీసీసీ అధ్యయన కమిటీ నివేదిక
- రియల్టర్ల కోసమే జీవో ఎత్తేశారు: కాంగ్రెస్ నేత కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: జీవో 111 పరిధిలోకి వచ్చే గ్రామాలను ప్రకృతి వ్యవసాయ (ఆర్గానిక్ ఫామింగ్) జోన్‌గా ప్రకటించాలని, రెండు జలాశయాల్లో పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌టీఎల్) లోపల ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని టీపీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీవో 111 అధ్యయన కమిటీ అభిప్రాయపడింది. ఈ మేరకు కమిటీ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, కన్వీనర్ సంగిశెట్టి జగదీశ్వరరావు నేతృత్వంలోని బృందం తాము రూపొందించిన నివేదికను బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డికి అందజేసింది. జీవో 111 ప్రాంతంలో ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్న రైతులను గుర్తించాలని, ప్రత్యేక ప్యాకేజీ కింద వారికి ఎకరానికి లక్ష రూపాయల చొప్పున రెండు విడతల ఆర్థిక సాయం అందజేయాలని కోరింది. అక్కడ ప్రకృతి ఆధారిత పంటలు పండించేలా ప్రోత్సాహమివ్వాలని, వ్యవసాయ, ఉద్యాన శాఖ పరిశోధనశాలలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరింది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రత్యేక మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రైతుల ఇష్టంతో భూములు అమ్ముకున్నప్పటికీ, కొనుగోలు చేసిన వారు కూడా వ్యవసాయం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరింది. జీవో111కు బదులు సమగ్రమైన చట్టాన్ని తేవాలని పేర్కొన్నారు.

పర్యావరణంపై సీఎంకు అవగాహన లేదు: కోదండరెడ్డి

తమ నివేదికను రేవంత్‌కు ఇచ్చిన అనంతరం గాంధీభవన్‌లో సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, అధ్యయన కమిటీ సభ్యులతో కలసి కోదండరెడ్డి మీడియాతో మాట్లాడుతూ 111 జీవో పరిధిలోని 80 శాతం భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో ఉన్నాయన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో మంత్రులు ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారని, వారి ఫాంహౌస్‌లు మునిగిపోకుండా ఉండేందుకే హిమాయత్‌సాగర్ పూర్తిగా నిండకముందే గేట్లు తెరిచారని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు పర్యావరణంపై అవగాహన లేదని, కేటీఆర్ అవగాహనరాహిత్యం వల్ల జంట జలాశయాలకు ముప్పు వాటిల్లుతోందని చెప్పారు. రియల్టర్ల కోసమే జీవో 111ను ఎత్తివేశారని, ఈ జీవో పరిధిలో అన్ని నిబంధనలూ పేదలకే వర్తింపజేస్తున్నారని, పెద్దలు మాత్రం ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని తమ అధ్యయనంలో తేలిందని కోదండరెడ్డి చెప్పారు.

నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి: కృష్ణయ్య

- అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాస్తాం: ఎంపీ మస్తాన్ రావు
- జేరిపోతుల పరశురామ్ నేతృత్వంలో జంతర్‌మంతర్‌లో మహాధర్నా



సాక్షి, న్యూఢిల్లీ: కరెన్సీ నోట్లపై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాల్సిందేనని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన ధర్నాలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆర్. కృష్ణయ్య, బీదమస్తాన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ...అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోట్లపై ముద్రించకపోవడం అంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చరిత్రను వక్రీకరించడమేనని పేర్కొన్నారు. బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ..ఈ అంశాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాస్తామని హామీ ఇచ్చారు. జేరిపోతుల పరశురామ్ మాట్లాడుతూ... రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పరిపాలన చేస్తున్న ప్రజా ప్రతినిధులు అందరూ ఈ అంశంపై అసెంబ్లీల్లో, పార్లమెంట్‌లో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో డాక్టర్ కంఠవేణు, ఉదయభాస్కర్, పిడుగు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తెలంగాణలో 'యూరియా గోల్డ్'

- సల్ఫర్–పూతతో కూడిన యూరియా విక్రయం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో గురువారం నుంచి యూరియా గోల్డ్ అందుబాటులోకి రానుంది. ఇకనుంచి వ్యవసాయంలో ఉపయోగించే యూరియా మొత్తం సల్ఫర్ పూతతో కూడిన యూరియానే అని ఆగ్రోస్ వర్గాలు వెల్లడించాయి. మట్టిలో సల్ఫర్ లోపాలను పరిష్కరించడానికి యూరియా గోల్డ్‌ను ప్రవేశపెట్టినట్లు ఆగ్రోస్ ఎండీ రాములు తెలిపారు. దేశంలో యూరియా గోల్డ్ వినియోగం ఇదే తొలిసారి అని, దీనిని ఇతర రకాల కంటే మరింత పొదుపుగా వాడుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సంప్రదాయ యూరియాలో నత్రజని శోషణ సామర్థ్యం 30% ఉండగా యూరియా గోల్డ్‌లో 78% ఉంటుందని చెప్పారు. యూరియా గోల్డ్ వినియోగం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం, రైతులకు ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం, ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. ఇకనుంచి పూర్తిగా ఇదే యూరియా రైతులకు అందుబాటులోకి రానుందని తెలిపారు.

త్వరలోనే తెలంగాణకు వస్తా

- వ్యవసాయ ప్రగతి పరిశీలిస్తా : ప్రొఫెసర్ స్వామినాథన్



చెన్నైలో ప్రొఫెసర్ స్వామినాథన్‌తో సమావేశమైన మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు వచ్చి వ్యవసాయ ప్రగతి చూస్తానని హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ స్వామినాథన్ అన్నారు. తన ఆరోగ్యం కుదుటపడగానే రాష్ట్రానికి వస్తానని చెప్పారు. చెన్నైలో ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్‌తో బుధవారం ఆయన నివాసంలో వ్యవసాయశాఖమంత్రి నిరంజన్‌రెడ్డి, కార్యదర్శి రఘునందన్‌రావు భేటీ అయ్యారు. అనంతరం స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామినాథన్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో తెలంగాణలో సాధించిన వ్యవసాయ విజయాలను వివరించామని నిరంజన్‌రెడ్డి తెలిపారు. స్వామినాథన్ స్ఫూర్తి తోనే రైతు అనుకూల విధానాలను అమలు చేస్తున్నట్టు చెప్పామన్నారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్, సాగునీరు, పంటల కొను గోళ్ల తీరు, ప్రత్యామ్నాయ పంటల సాగు ఆవశ్యకత, రైతువేదికలు వంటి వాటిని ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. 98 ఏళ్ల వయసులోనూ స్వామినాథన్ జ్ఞాపకశక్తి అమోఘమన్నారు. ఈ భేటీలో విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు, డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం ఉన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమం

- రైతులకు బీకేఎస్ పిలుపు
- రాష్ట్రంలోని వ్యవసాయ భూములను రీ సర్వే చేయాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ భూ సమస్యలు (ధరణి) పరిష్కరించాలని కోరుతూ దశలవారీగా ఉద్యమించాలని రైతులకు భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) పిలుపునిచ్చింది. బుధవారం బీకేఎస్ తెలంగాణ రెవెన్యూ ఆయామ్ (ధరణి) ప్రముఖ్ బండి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలోని వ్యవసాయ భూములను రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జోగినపల్లి శ్రీరంగారావు ముఖ్యవక్తగా పాల్గొన్న ఈ భేటీలో.. వివిధ జిల్లాల నుంచి వచ్చిన రెవెన్యూ ఆయామ్ ప్రముఖులకు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను వివరించారు. టైటిల్ గ్యారెంటీ చట్టాన్ని (టైటిల్ డీడ్ గ్యారెంటీ ఆక్ట్) అమలుచేసి వ్యవసాయ భూములకు యాజమాన్యం హక్కులు, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని తీర్మానించారు. భూమి రికార్డులను యథావిధిగా ఆన్‌లైన్‌లో ధరణి, రికార్డుల రూపంలో తహసీల్ కార్యాలయాల్లో ఉంచాలని రిటైర్డ్ తహసీల్దార్ చంద్రసేనారెడ్డి సూచించారు. సమావేశంలో తీసుకున్న తీర్మానాలు సెప్టెంబర్, అక్టోబర్‌లో భూ సమస్యలను ప్రస్తావిస్తూ సీఎం కేసీఆర్‌కు, సీసీఎల్ఏ కమిషనర్‌కు, జిల్లా కలెక్టర్లకు, మండల స్థాయిలో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. నిజాం కాలంలో తప్ప ఇంతవరకు భూ సర్వే జరగలేదని, ఆ తర్వాత చట్టాలన్నీ కలిపి ధరణి చట్టం చేసిన 2018లో భూ రికార్డుల ప్రక్షాళనలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని సమావేశం అభిప్రాయపడినట్లు బీకేఎస్ ప్రాంత ప్రచార ప్రముఖ్ ల్యాగల శ్రీనివాస్ వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి రాజిరెడ్డి, వివిధ జిల్లాల ప్రతినిధులు సుబ్బారెడ్డి, ఏపీ రావు, కల్లెపు రాజేశ్వరరావు, జి.వినోద్‌కుమార్, లింగారెడ్డి, శరత్, గజేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఈడీ డైరెక్టర్‌ను కొనసాగిస్తాం

సుప్రీంకోర్టును కోరిన కేంద్రం

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) డైరెక్టర్ సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని అక్టోబర్ 15 వరకూ పెంచేందుకు అనుమతి కోరుతూ కేంద్రం బుధవారం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. 63 ఏళ్ల మిశ్రా పదవీకాలాన్ని పదేపదే పెంచడం చట్టవిరుద్ధమంటూ సుప్రీంకోర్టు ఇటీవలే తప్పుబట్టడం తెలిసిందే. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) సమీక్షకు సంజయ్ కుమార్ గైర్హాజరైతే భారత ప్రయోజనాలకు భంగకరమని కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది. అందువల్ల తమ పిటిషన్‌పై జూలై 28లోగా విచారణ జరపాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనాన్ని కోరారు.

సీఐసీ వద్ద 19 వేల దరఖాస్తులు పెండింగ్

న్యూఢిల్లీ: కేంద్ర సమాచార హక్కు కమిషన్ (సీఐసీ) వద్ద గత ఏప్రిల్ నాటికి 19,233 దరఖాస్తులు, అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రం బుధవారం లోక్‌సభకు తెలిపింది. పది మంది సభ్యులుండే సీఐసీలో నాలుగు ఖాళీలు ఉన్నాయని కేంద్ర సిబ్బంది వ్యవహారాల సహాయమంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. 2021-22లో 29,213 దరఖాస్తులు, 2020-21లో 35,178 , 2018-19లో 29,655 పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

27సార్లు.. ఒక్కటీ నెగ్గలేదు...!

విశ్వాస పరీక్షల్లో మాత్రం కేంద్రంలో మూడుసార్లు పడిపోయిన ప్రభుత్వాలు



స్వతంత్ర భారత చరిత్రలో లోక్‌సభలో ఇప్పటిదాకా ఏకంగా 27 సార్లు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టగా వాటిలో ఒక్కటంటే ఒక్కటి కూడా నెగ్గలేదు. వాటి కారణంగా ఒక్కసారి కూడా కేంద్రంలో ప్రభుత్వం పడిపోలేదు. అయితే ప్రభుత్వమే కోరి తెచ్చుకునే విశ్వాస పరీక్షల్లో మాత్రం కనీసం మూడుసార్లు ప్రభుత్వాలు పడిపోయినట్టు పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అనే అధ్యయన సంస్థ పేర్కొంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇందిరపై అత్యధికంగా 15 'అవిశ్వాసాలు'

దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఏకంగా 15 సార్లు అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. స్వతంత్ర భారత చరిత్రలో ఒక ప్రధాని హయాంలో ఇదే అత్యధికం!

- ఇందిరపై తొలి అవిశ్వాసాన్ని 1966లో ఆమె అధికారంలోకి రాగానే కమ్యూనిస్టు దిగ్గజం హీరేంద్రనాథ్ ముఖర్జీ ప్రవేశపెట్టారు. కేవలం 61 మంది ఎంపీలే మద్దతివ్వగా 270 మంది వ్యతిరేకించారు.1966లోనే ఆమెపై రెండో అవిశ్వాసమూ వచ్చింది. తర్వాత 1967, 1968 (రెండుసార్లు), 1969, 1970, 1973, 1974 (రెండుసార్లు), 1975 (రెండుసార్లు-రెండోసారి ఎమర్జెన్సీ విధింపుకు కేవలం నెల రోజుల ముందు), 1976, 1978, 1981 (రెండుసార్లు), 1982ల్లో ఇందిరపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు.
- 1976లో ఇందిర ప్రభుత్వంపై బీజేపీ (నాటి జనసంఘ్) మేరునగం అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రవేశపెట్టడం విశేషం! దానికి ఏకంగా 162 మంది ఎంపీలు మద్దతిచ్చారు! ఒక అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా వచ్చిన అత్యధిక ఓట్లు ఇవే. 257 మంది వ్యతిరేకంచడంతో తీర్మానం వీగిపోయింది.

ఇదీ చరిత్ర...

- స్వతంత్ర భారత చరిత్రలో తొట్టతొలి అవిశ్వాస తీర్మానం 1963లో లోక్‌సభ తలుపు తట్టింది. నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు వ్యతిరేకంగా ఆయన సొంత పార్టీ కాంగ్రెస్‌కే చెందిన ఆచార్య కృపాలనీ దీన్ని ప్రవేశపెట్టడం విశేషం. 1962లో చైనాతో యుద్ధంలో ఓటడిన వెంటనే కృపాలనీ ఈ చర్యకు దిగారు. దీనిపై ఏకంగా 4 రోజుల పాటు 20 గంటలకు పైగా చర్చ జరిగింది. కేవలం 62 మంది ఎంపీలు మాత్రమే దీన్ని సమర్థించారు. 347 మంది వ్యతిరేకించడంతో చివరికి తీర్మానం వీగిపోయింది.
- లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వంపై 1964లో ఎన్‌సీ ఛటర్జీ 1965లో ఎస్.ఎస్.ద్వివేది, స్వతంత్ర పార్టీ ఎంపీ ఎం.ఆర్.మసానీ ప్రవేశపెట్టారు.
- 1979లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్ రాజీనామాకు దారితీసింది. తీర్మానంపై ఓటింగ్ జరగక చర్చ అసంపూర్తిగా మిగిలిపోయినా ఆయన స్వచ్ఛందంగా ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం!

పీవీపై మూడుసార్లు

తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ప్రభుత్వం మూడుసార్లు అవిశ్వాస తీర్మానాలు ఎదుర్కొంది! తొలిసారి 1992లో బీజేపీ ఎంపీ జశ్వంత్‌సింగ్ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై అధికార, విపక్షాలపై లోక్‌సభ వేదికగా నువ్వా నేనా అన్నట్టుగా పోరాటం జరిగింది. ఏకంగా 225 మంది ఎంపీలు తీర్మానానికి మద్దతిచ్చారు. 271 మంది వ్యతిరేకించడంతో తీర్మానం వీగిపోయి పీవీ సర్కారు ఊపిరి పీల్చుకుంది! 1992లోనే పీవీ ప్రభుత్వంపై వాజ్‌పేయీ, 1993లో అజయ్ ముఖోపాధ్యాయ్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు.

రాజీవ్ సర్కారుపై మన ఎంపీ మాధవరెడ్డి...

- 1987లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టింది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ టీడీపీ ఎంపీ సి.మాధవరెడ్డి కావడం విశేషం! అయితే అది మూజువాణి ఓటుతో వీగిపోయింది.

- 2003లో వాజ్‌పేయీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వంపై విపక్ష నేత హోదాలో నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ అవిశ్వాస తీర్మానం పెట్టారు. కేవలం 189 మంది ఎంపీలు మద్దతివ్వగా, 314 మంది వ్యతిరేకించారు. దాంతో 21 గంటల చర్చ అనంతరం తీర్మానం వీగిపోయింది.
- 2018 మోదీ సర్కారుపై టీడీపీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దానికి 135 మంది ఎంపీలు మద్దతివ్వగా 330 మంది వ్యతిరేకించారు.

అవిశ్వాసానికి అనుమతి



సాక్షి, న్యూఢిల్లీ: మణిపూర్ హింసాకాండ తదితరాలపై లోక్‌సభలో బుధవారం కూడా రగడ జరిగింది. దాంతో సభ వాయిదా పడింది. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి ప్రారంభం కాగానే, కేంద్ర మంత్రివర్గం పై విశ్వాసం లేదని పేర్కొంటూ గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్) ఇచ్చిన నోటీసును స్పీకర్ అనుమతించారు. దానికి ఎందరు మద్దతిస్తున్నారని ప్రశ్నించగా కాంగ్రెస్ ఎంపీ సోనియాగాంధీ, ఫరూక్ అబ్దుల్లా (ఎన్‌సీ), టీఆర్ బాలు (డీఎంకే), సుప్రియా సులే (ఎన్సీపీ) తదితర విపక్ష 'ఇండియా' కూటమి సభ్యులతో పాటు ప్రతిపక్ష సభ్యులంతా లేచి నిలబడ్డారు. దాంతో తీర్మానాన్ని అనుమతిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. అంతకు ముందు బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు నేతృత్వంలో ఎంపీలు శ్రీనివాసరెడ్డి, రాములు, దయాకర్ లోక్ సభ సెక్రటరీ జనరల్‌కు అవిశ్వాస నోటీసులిచ్చారు. బీఆర్ఎస్ ఎంపీలు బీబీ పాటిల్, రంజిత్‌రెడ్డితో పాటు మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా దానిపై సంతకాలు చేశారు. 'ఇండియా' కూటమిలో బీఆర్ఎస్ భాగస్వామి కాని విషయం తెలిసిందే.

ఇప్పుడేమవుతుంది?

అవిశ్వాస తీర్మానంపై ఏ రోజు, ఎప్పుడు చర్చ మొదలు పెట్టాలో స్పీకర్ సారథ్యంలో జరిగే సభా వ్యవహారాల కమిటీ (బీఏసీ) సమావేశంలో నిర్ణయమవుతుంది.

- చర్చలో పాల్గొనేందుకు ఏయే పార్టీకి ఎంత సమయం ఇవ్వాలో స్పీకర్ నిర్ణయిస్తారు.
- అధికార, విపక్షాల చర్చ ముగిసిన తర్వాత చర్చకు, అవిశ్వాస తీర్మానానికి ప్రధాని సమాధానమిస్తారు. తర్వాత ఓటింగ్ జరుగుతుంది.

మోదీ జోస్యమే నిజమైంది!

విపక్షాలు అవిశ్వాస తీర్మానం ఇవ్వడంతో ప్రధాని మోదీ నాడు చెప్పిన జోస్యమే నిజమైందంటూ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 2019 జూలై 20న మోదీ ప్రభుత్వంపై విపక్షాలు తొలిసారి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం తెలిసిందే. దానికి అనుకూలంగా 126 మంది ఓటేయగా 325 మంది ఎన్డీఏ సభ్యులు వ్యతిరేకించారు. దాంతో భారీ మెజారిటీతో మోదీ సర్కారు గట్టెక్కింది. ఆ సందర్భంగా అవిశ్వాస తీర్మానంపై చర్చకు మోదీ బదులిస్తూ విపక్షాలను ఎద్దేవా చేశారు. '2023లోనూ నా ప్రభుత్వంపై అవిశ్వాస పరీక్ష పెట్టేంతగా వాళ్లు సన్నద్ధం కావాలని ఆకాంక్షిస్తున్నా' అంటూ చెణుకులు విసిరారు. అచ్చం ఆయన అన్నట్టుగానే ఇప్పుడు జరుగుతోందంటూ బుధవారం రోజంతా సోషల్ మీడియాలో వార్తలు చెక్కర్లు కొట్టాయి.

లోక్‌సభలో బలాబలాలివీ...

లోక్‌సభ మొత్తం బలం 543. ప్రస్తుతం 5 ఖాళీలున్నాయి. బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్డీఏ పక్షానికి 330 మందికి పైగా, విపక్ష 'ఇండియా' కూటమికి 140కి పైగా ఎంపీల బలముంది. ఈ రెండు కూటముల్లోనూ లేని ఎంపీలు 60 మందికి పైగా ఉన్నారు.

ఏమిటీ తీర్మానం...?

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వమైనా అది ప్రత్యక్షంగా ఎన్నికయ్యే చట్టసభలో (భారత్‌లో అయితే లోక్‌సభ) మెజారిటీ ఉన్నంత కాలమే మనుగడ సాగించగలదు. కేంద్ర మంత్రిమండలి లోక్‌సభకు ఉమ్మడిగా బాధ్యత వహిస్తుందని రాజ్యాంగంలో 75(3) ఆర్టికల్ నిర్దేశిస్తోంది.

ఏమిటీ అవిశ్వాస తీర్మానం?

- ప్రభుత్వం, అంటే మంత్రిమండలి లోక్‌సభ విశ్వాసం కోల్పోయిందని, మరోలా చెప్పాలంటే మెజారిటీ కోల్పోయిందని భావించినప్పుడు బలం నిరూపించుకోవాలని ఎవరైనా డిమాండ్ చేసేందుకు అవకాశముంది.
- సాధారణంగా విపక్షాలే ఈ పని చేస్తుంటాయి. ఇందుకోసం అవి లోక్‌సభలో ప్రవేశపెట్టే తీర్మానమే అవిశ్వాస తీర్మానం.
- అవిశ్వాస తీర్మానాన్ని లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టే వీలుంది.
- లోక్‌సభ రూల్స్ ఆఫ్ ప్రొసీజర్, కండక్ట్ ఆఫ్ బిజినెస్‌లోని 198వ నిబంధన మేరకు దీన్ని ప్రవేశపెడతారు.
- కనీసం 50 మంది సహచర ఎంపీల మద్దతు కూడగట్టగలిగిన ఏ లోక్‌సభ సభ్యుడైనా ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టవచ్చు.
- అనంతరం తీర్మానంపై చర్చ, అధికార-విపక్షాల మధ్య సంవాదం జరుగుతాయి. ప్రభుత్వ లోపాలు, తప్పిదాలు తదితరాలను విపక్షాలు ఎత్తిచూపుతాయి. వాటిని ఖండిస్తూ అధికార పక్షం తమ వాదన విన్పిస్తుంది.
- చర్చ అనంతరం అంతిమంగా తీర్మానంపై ఓటింగ్ జరుగుతుంది.
- లోక్‌సభకు హాజరైన ఎంపీల్లో మెజారిటీ, అంటే సగం మంది కంటే ఎక్కువ తీర్మానానికి మద్దతుగా ఓటేస్తే అది నెగ్గినట్టు. అంటే ప్రభుత్వం సభ విశ్వాసం కోల్పోయినట్టు. అప్పుడు మంత్రిమండలి రాజీనామా చేయాల్సి ఉంటుంది. అంటే ప్రభుత్వం పడిపోతుంది.

ప్రభుత్వమే పరీక్షకు నిలిస్తే... విశ్వాస తీర్మానం

ఒక్కోసారి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ప్రభుత్వమే లోక్‌సభలో తన బలాన్ని నిరూపించుకునేందుకు ప్రవేశపెట్టేదే విశ్వాస తీర్మానం. ఇలా విశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి మూడు ప్రభుత్వా లు బలం నిరూపించుకోలేక పడిపోయాయి...

- సాక్షి, నేషనల్ డెస్క్


- అలాగే 1997లో హెచ్‌డీ దేవెగౌడ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన 10 నెలలకే బలపరీక్షకు వెళ్లింది. కేవలం 158 మంది ఎంపీలే దానికి మద్దతిచ్చారు. 292 మంది వ్యతిరేకంగా ఓటేయడంతో ప్రభుత్వం కుప్పకూలింది.
- ఇక 1999లో అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానం చివరి క్షణంలో అన్నాడీఎంకే ప్లేటు ఫిరాయించి వ్యతిరేకంగా ఓటేయడంతో అనూహ్యంగా ఓడి ప్రభుత్వం పడిపోయింది.
- 1990లో రామమందిర అంశంపై బీజేపీ మద్దతు ఉపసంహరించుకోవడంతో లోక్‌సభలో బలం నిరూపించుకునేందుకు వీపీ సింగ్ ప్రభుత్వం విశ్వాస తీర్మానం పెట్టింది. తీర్మానానికి అనుకూలంగా కేవలం 142 ఓట్లు రాగా వ్యతిరేకంగా ఏకంగా 346 ఓట్లు రావడంతో ప్రభుత్వం పడిపోయింది.

'భారత మండపం' రెడీ



పూజలు చేస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జీ-20 సదస్సుకి వేదిక సిద్ధమైంది. సెప్టెంబర్‌లో జరగనున్న ఈ సదస్సుకి అమెరికా, బ్రిటన్, చైనా సహా 20 దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సదస్సుని నిర్వహించడానికి ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ కమ్ కన్వెన్షన్ సెంటర్ (ఐఈసీసీ)కు కొత్తగా హంగులు చేకూర్చారు. మరమ్మతులు నిర్వహించి ఆధునీకరించారు. ఈ సెంటర్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించి దానికి కొత్తగా భారత మండపం అని పేరు పెట్టారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్, ఇతర మంత్రుల సమక్షంలో డ్రోన్ ద్వారా ఈ సెంటర్‌ని ప్రారంభించారు. ఐఈసీసీ కాంప్లెక్స్‌ని జాతీయ ప్రాజెక్టు కింద రూ.2,700 కోట్లతో అభివృద్ధి చేశారు. ప్రగతి మైదాన్‌లో ఇండియా ట్రేడ్ ప్రామోషన్ ఆర్గనైజేషన్ (ఐటీపీఓ) కాంప్లెక్స్‌లో ఇది భాగంగా ఉంది. అంతకు ముందు ప్రధాని మోదీ ఐటీపీఓలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కాంప్లెక్స్ మరమ్మతు పనుల్లో పాల్గొన్న కార్మికుల్ని ప్రధాని సత్కరించారు. ప్రగతి మైదాన్ దాదాపుగా 123 ఎకరాల్లో ఇది విస్తరించి ఉంది. భారత్‌లో అంతర్జాతీయ సదస్సులు , పారిశ్రామిక సమావేశాలు నిర్వహించే కాంప్లెక్స్‌లో అతి పెద్దది. ఎన్నో అత్యాధునిక సదుపాయాలు కలిగిన ఐఈసీసీ ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన టాప్ -10 వేదికల్లో ఒకటి. మూడో అంతస్తులు ఏడువేల మంది పట్టే ఒక కాన్ఫరెన్స్ హాలు ఉంది. జీ-20 శిఖరాగ్ర సదస్సు నిర్వహించడానికి భారతీయత ఉట్టిపడేలా దీనిని నిర్మించడంతో భారత మండపం అని పేరు పెట్టారు.



ఢిల్లీలోని నూతన ఐటీపీఓ కాంప్లెక్స్

గవర్నర్‌కు డీఎంకే ఫైల్స్-2

- ట్రంక్ పెట్టెలో ఆధారాలు
- ఆర్‌ఎన్ రవికి సమర్పించిన అన్నామలై
- ట్రైలర్ అంటూ ఓ వీడియో విడుదల

సాక్షి, చెన్నై: డీఎంకే అవినీతి అక్రమాలు ఫైల్స్ -2 పేరుతో ఏకంగా ఓ ట్రంక్ పెట్టెలో ఆధారాలను పెట్టి మరీ రాజ్‌భవన్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై బుధవారం గవర్నర్‌కు సమర్పించడం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇందులో తొమ్మిది మంది రాష్ట్ర మంత్రుల అవినీతికి సంబంధించిన వివరాలు, మూడు ప్రాజెక్టుల్లో చోటుసుకున్న అక్రమాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలు.. అవినీతి అక్రమాలు.. పేరుతో సీఎం స్టాలిన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆస్తులు, డీఎంకే పార్టీకి సంబంధించిన ఆస్తులు, పలువురు ఎంపీల అక్రమార్జన వివరాలను డీఎంకే ఫైల్స్ -1 పేరుతో ఈ ఏడాది ఏప్రిల్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై విడుదల చేశారు. ఈ సమయంలో త్వరలో డీఎంకే ఫైల్స్- 2 కూడా బయటకు వస్తుందని వ్యాఖ్యానించారు. డీఎంకే ఫైల్స్ వ్యవహారంలో అన్నామలైపై డీఎంకే పార్టీ వర్గాలు పరువునష్టం దావా కూడా వేశాయి. ఈ పరిస్థితుల్లో ఇది వరకు మీడియా ముందు ఫైల్స్- 1ను విడుదల చేసిన అన్నామలై ఈసారి రూటు మార్చారు. డీఎంకే ఫైల్స్- 2 పేరుతో ఒక ట్రంక్ పెట్టెలో కొన్ని పత్రాలను పెట్టి పెట్టి మరీ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు అందజేశారు. అలాగే ఇటీవల కాలంలో మూడు ప్రాజెక్టుల్లో రూ. 5,600 కోట్ల అవినీతి జరిగిందని పేర్కొంటూ, ఆ వివరాలను ఫిర్యాదులో పేర్కొన్నారు.

నెదర్లాండ్స్ నౌకలో భారీ అగ్నిప్రమాదం

3 వేల కార్లు దగ్ధం !

ది హేగ్: నెదర్లాండ్స్‌లోని ఉత్తర సముద్రంలో సరుకు రవాణా చేసే ఒక నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ మంటల్లో నౌకలో ఉన్న 3 వేల కార్లు దగ్ధమైనట్టు అంచనా. నౌక సిబ్బందిలో ఒకరు మంటల్లో చిక్కుకొని మరణించగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంకొందరు ప్రాణరక్షణ కోసం సముద్రంలో దూకారు. ఆ నౌకలో దట్టంగా పొగ అలుముకోవడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తి 22 మంది నౌకా సిబ్బందిని ఆస్పత్రికి తరలించినట్టుగా డచ్ కోస్ట్‌గార్డ్ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు. నౌకలో ఉన్న 25 ఎలక్ట్రిక్ కారుల్లో ఒక దానిలో మంటలు చెలరేగడం వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్టుగా తెలుస్తోంది. జర్మనీలోని బ్రెమర్‌హెవన్ పోర్టు నుంచి ఈజిప్టులో మరో పోర్టుకి ఈ నౌక వెళుతుండగా మంగళవారం రాత్రి అమెలాండ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ నౌకలో మంటలు కొద్ది రోజుల పాటు కొనసాగుతాయని డచ్ కోస్ట్ గార్డ్ అంచనా వేస్తోంది. నౌకకి ఇరువైపులా నీళ్లు పోస్తూ మంటల్ని అదుపులోనికి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కానీ లోపల నీళ్లు వేస్తే నౌక మునిగిపోయే ప్రమాదం ఉందన్న ఆందోళనలున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు తరలించడం కూడా ఒక ముప్పుగా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.



మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండ

ఇళ్లు, బస్సులు, దుకాణాలు దగ్ధం

ఇంఫాల్: మణిపూర్‌లో హింసాకాండ ఇంకా కొనసాగుతోంది. మోరె జిల్లాలో బుధవారం నాడు అల్లరిమూక దాదాపుగా 30 ఇళ్లు, దుకాణాలు తగులబెట్టింది. మయన్మార్ సరిహద్దుల్లోని మోరే బజార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. అల్లరి మూకను అదుపు చేయడానికి భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఎంతమందికి గాయాలయ్యాయో వివరాలు ఇప్పటివరకు తెలియలేదు. కంగ్‌పోక్పి జిల్లాలో భద్రతా దళాలను తరలించడానికి ఉంచిన బస్సులకి కూడా దుండగులు నిప్పు పెట్టినట్టుగా అధికారులు తెలిపారు. సపోర్మినాలో మణిపూర్ రిజిస్ట్రేషన్ కలిగిన బస్సుల్ని స్థానికులు ఆపేసి ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు ఎవరైనా ఉన్నారని తనిఖీ చేశారు. ఆ తర్వాత కొందరు ఆ బస్సుల్ని తగులబెట్టారు. మరోవైపు హింసాకాండలో ఇళ్లు కోల్పోయి సహాయ శిబిరాల్లో ఉంటున్న వారి కోసం తాత్కాలిక ఇళ్ల నిర్మాణం పూర్తి కావస్తోందని ముఖ్యమంత్రి ఎన్. బైరెన్ సింగ్ చెప్పారు. ఇంఫాల్‌లోని సజీవా, తౌబల్ జిల్లాలోని యతిబి లౌకోల్‌లో ఇళ్లను నిర్మిస్తున్నారు. త్వరలోనే సహాయ శిబిరంలో ఉన్న వారందరినీ ఈ ఇళ్లకు తరలిస్తామని బైరెన్ సింగ్ ట్వీట్ చేశారు.



ఘర్ మే ఘుస్ కే...

అవసరమైతే నియంత్రణ రేఖ దాటుతాం: రాజ్‌నాథ్

- ఆ పరిస్థితి వస్తే మన సైనికులకు సహకరించాలని ప్రజలకు పిలుపు
- ద్రాస్‌లో కార్గిల్ స్మారక స్థూపం వద్ద 'విజయ్ దివస్'లో రక్షణ మంత్రి

ద్రాస్ (లద్దాఖ్): భారత్ తన గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకోవడానికి నియంత్రణ రేఖను దాటడానికి సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అలాంటి పరిస్థితి వస్తే సైనికులకు సహకారం అందించడానికి పౌరులందరూ సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 24 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం దేశమంతా విజయ్ దివస్ జరుపుకుంది. ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ రష్యా, ఉక్రెయిన్ మధ్య ఏడాది దాటినా ఇంకా యుద్ధం కొనసాగుతోందని అంటే పౌరులు భాగస్వాములు కావడం వల్లేనని అభిప్రాయపడ్డారు. పొరుగుదేశమైన పాకిస్తాన్ కవ్వింపు చర్యల్ని పరోక్షంగా ప్రస్తావించిన ఆయన మన దేశ గౌరవాన్ని, మర్యాదని కాపాడుకోవడానికి ఎంత తీవ్రమైన చర్యలకైనా దిగుతామని హెచ్చరించారు. పొరుగుదేశం రెచ్చగొట్టే చర్యలకి దిగితే నియంత్రణ రేఖ దాటుతామన్నారు. ''మన దేశంలో యుద్ధం పరిస్థితులు వస్తే సైనిక బలగాలకు ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారు. పరోక్షంగా తమ సహకారాన్ని అందిస్తారు. ఈ సారి అవసరమైతే ప్రత్యక్షంగా యుద్ధభూమిలో పాల్గొనాలని, దానికి తగ్గట్టు మానసికంగా సంసిద్ధులు కావాలని కోరుతున్నాను'' అని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాలను కాపాడుకునే అంశంలో మన సైన్యం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కార్గిల్ యుద్ధం సమయంలో భారత ఆర్మీ పాకిస్తాన్‌కేకాక యావత్ ప్రపంచానికి సందేశం పంపించిందన్నారు. పాకిస్తాన్ మనకి వెన్నుపోటు పొడవడంతో కార్గిల్ యుద్ధం వచ్చిందన్నారు. అంతకు ముందు కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ల సమాధుల్ని సందర్శించి పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.



కార్గిల్ అమరవీరుల కుటుంబీకులకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఓదార్పు

ప్రధాని నివాళులు

కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ , కేంద్ర మంత్రులు, ఇతర నాయకులు నివాళులర్పించారు. విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ట్వీట్ చేశారు. ''మన దేశ సైనికుల అపూర్వమైన విజయాన్ని దేశం గుర్తు చేసుకుంటోంది. దేశం కోసం ప్రాణాలు కోల్పోయిన అమరులందరికీ నివాళులర్పిస్తున్నాను. దేశం కోసం త్యాగం చేసిన వారి గాథలన్నీ తరతరాలకు స్ఫూర్తి దాయకం'' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రధాని మోదీ తన ట్వీట్‌లో కార్గిల్ విజయ్ దివస్ భారత వీరుల ధైర్య గాథల్ని గుర్తు చేస్తుందని, ప్రజలందరికీ వారు స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. అమరులందరికీ హృదయపూర్వక నివాళులర్పిస్తున్నట్టుగా పేర్కొన్నారు. 1999లో కార్గిల్‌ను ఆక్రమించిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పికొట్టి భారత్ విజయ దుందుభి మోగించింది.

సాక్షి హైదరాబాద్

గురువారం । 27 । జూలై । 2023

గాంధీ ఆస్పత్రిలో బుధవారం కిక్కిరిసిన రోగులు



నేల కూలిన భారీ వృక్షం



బంజారాహిల్స్ రోడ్ నంబర్- 14లో కూలిన భారీ వృక్షం

బంజారాహిల్స్: గడచిన వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని ఆశా ఆస్పత్రి పక్కన సురభి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్స్‌ను ఆనుకొని ఉన్న ఓ భారీ వృక్షం నేలకూలింది. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిన ఈ చెట్టుతో అక్కడ పార్కింగ్ చేసిన ఓ కారు, ఓ ద్విచక్ర వాహనం ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ నర్సింహరాజు ఘటనాస్థలానికి చేరుకొని డీఆర్ఎఫ్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. డీఆర్ఎఫ్ సిబ్బంది ఆరు గంటలు కష్టపడి చెట్ల కొమ్మలను తొలగించారు. ఇక్కడి నుంచి ట్రాఫిక్‌ను మరోదారికి మళ్లించారు. పది గంటల పాటు ఈ రోడ్డును మూసివేశారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ నాగేశ్వర్‌రావు ఈ సహాయక చర్యలను పర్యవేక్షించారు.

శ్రీనివాసుడు.. మృత్యుంజయుడు!



శ్రీనివాస్

రెప్పపాటులో చావును తప్పించుకోవడం అంటే ఇదేనేమో అనిపిస్తుంది.... ఆశా ఆస్పత్రి వద్ద చెట్టు కూలిన సమయంలో నాగోల్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై అటే వస్తున్నాడు. హెల్మెట్ ధరించి ఉన్న శ్రీనివాస్‌పై మొదట ఒక కొమ్మ తనపై పడుతున్నట్లు అనిపించడంతో పైకి చూశాడు. భారీ చెట్టు కూలుతున్న విషయాన్ని గమనించి వెంటనే రెప్పపాటు కాలంలో బైక్‌ను వదిలేసి ముందుకు దూకాడు. దీంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. అక్కడున్న వారంతా శ్రీనివాస్ సమయస్ఫూర్తిని అభినందించారు. ఆశ్చర్యమేంటంటే ఆ భారీ చెట్టు పెద్ద కొమ్మ ఒకటి సరిగ్గా శ్రీనివాస్ బైక్ పైనే పడింది.

ముసురుకున్న వ్యాధులు..ఆస్పత్రులకు బారులు

గాంధీఆస్పత్రి/అఫ్జల్‌గంజ్: ఇటీవల కురుస్తున్న వర్షాలతో ప్రజలు సీజనల్ వ్యాధులతో సతమతమవుతున్నారు. గాంధీ, ఉస్మానియా,ఫీవర్ ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ విభాగాలు నిత్యం వేలాది రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇంటిగ్రేటెడ్ సిస్టం (హెచ్ఎంఐఎస్)లో భాగంగా రోగుల ఆధార్‌కార్డు, వేలిముద్రలు సేకరించి ఓపీ చిట్టీలు అందించడంతో నిరుపేద రోగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే దుస్థితి నెలకొంది. ఆయా ఆస్పత్రులకు వారం రోజులుగా ఓపీ రోగుల సంఖ్య భారీగా పెరిగింది. రోగుల రద్దీకి అనుగుణంగా ఓపీ చిట్టీ కౌంటర్లను వైద్యాధికారులు పెంచారు. గాంధీ ఆస్పత్రికి ప్రతిరోజూ మూడున్నర నుంచి నాలుగు వేల మందికి ఓపీ విభాగంలో, మరో 1700 మందికి ఇన్‌పేషెంట్ విభాగంలో వైద్యసేవలు అందిస్తున్నామని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు వివరించారు. జలుబు, దగ్గు, గొంతునొప్పి, వైరల్ ఫీవర్లతో ఎక్కువ మంది ఓపీ విభాగానికి వస్తున్నట్లు వివరించారు. కాగా ఫీవర్ ఆస్పత్రికి రోజుకు 250 నుంచి 400 వందల మంది వరకు రోగులు ఔట్ పేషెంట్ విభాగంలో చికిత్సల కోసం వస్తున్నారని, వారిలో అధిక శాతం జలుబు, జ్వరాలతో వస్తున్నారని, వర్షా కాలం ఆరంభం నుంచే ఫీవర్‌కు రోగుల తాకిడి పెరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శంకర్ తెలిపారు.



ఫీవర్ ఆస్పత్రిలో రోగుల క్యూ

పాములొస్తున్నా పట్టించుకోరా!



అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో అధికారి టేబుల్‌పై వదిలిన పాము

అల్వాల్: పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ఇళ్లలోకి పాములు వస్తున్నాయి. జీహెచ్ఎంసికి ఫిర్యాదు చేసి 10 రోజులవుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదంటూ.. ఇంట్లోకి వచ్చిన పామును తీసుకు వచ్చి జీహెచ్ఎంసీ కార్యాలయంలో వదిలి నిరసన తెలిపిన ఘటన బుధవారం అల్వాల్‌లో చోటుచేసుకుంది. భారతీ నగర్‌కు చెందిన అక్షయ్‌కుమార్ ఇంటి సమీపంలోని ఓ భవనంలో చెత్తా చెదారం పేరుకుపోయి పిచ్చి మొక్కలు పెరిగాయి. ఆ ఇంట్లోంచి పాములు బయటికి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యపై జీహెచ్ఎంసీ అల్వాల్ వార్డు కార్యాలయంలో ఈ నెల 17న అక్షయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో తన ఇంట్లోకి వచ్చిన పామును కవర్‌లో వేసుకొని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలోకి తీసుకొచ్చి అధికారి టేబుల్‌పై వదిలారు. ఒక్కసారిగా అధికారులు, సిబ్బంది, వార్డు కార్యాలయానికి వచ్చిన వారు భయంతో బయటి పరుగులు తీశారు. సమస్య తీవ్రతను అధికారులకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇలా చేశానంటూ అక్షయ్‌కుమార్ తెలిపారు. అనంతరం పామును నిర్మానుష్య ప్రాంతంలో వదిలివేశారు. వార్డు నిర్వహణ అధికారి స్వామి మాట్లాడుతూ.. ఫిర్యాదు అందగానే చెత్తా చెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తాళం వేసి ఉన్న ఇంట్లోకి వెళ్లడానికి తమకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇంటి యజమానికి సైతం సమాచారం ఇచ్చామని వివరణ ఇచ్చారు.





వ్యర్థ జలాలతో చేపల మృతి

ఎదులాబాద్ శ్రీ లక్ష్మీనారాయణ చెరువులోకి వ్యర్థ, రసాయన జలాలు చేరడంతో వేలాది చేపలు బుధవారం మృతి చెందాయి. నాలుగైదు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి పారిశ్రామిక వాడల నుంచి వచ్చిన రసాయనాలు కలిసిన నీరు చెరువులో కలవడంతోనే చేపలు మృతి చెందినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. వ్యర్థ జలాలు చెరువులోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. – ఘట్‌కేసర్

పీర్జాదిగూడ వద్ద మూసీ ప్రవాహం



లోతట్టు.. బిక్కు బిక్కు

- రెడ్ అలర్ట్‌తో ప్రజల ఆందోళన
- పొంచి ఉన్న ముంపు ముప్పు
- బస్తీలు, కాలనీల్లో వరద భయం
- నగరాన్ని వీడని వరుస వర్షాలు

సాక్షి, సిటీబ్యూరో: పదిరోజులుగా వదలకుండా కురుస్తున్న వర్షాలతో బస్తీలు, ఇళ్లల్లోకి వరద నీరు చేరి లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. బుధ, గురువారాల్లో నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేయడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఇప్పటికే బస్తీలు, కాలనీల్లో నీటి నిల్వలతో అల్లాడుతున్నారు. సాధారణ పరిస్థితులు రావడానికి ఇంకెన్ని రోజులు పడుతుందో చెప్పలేని స్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాల హెచ్చరికలు వారిని తేరుకోకుండా చేస్తున్నాయి. హుస్సేన్‌సాగర్ దిగువ ప్రాంతాల్లోని పలు బస్తీలతో పాటు శివారు ప్రాంతాల్లోనూ సాధారణ వర్షాలకే నీరు చేరే బస్తీలు, కాలనీలు ఎన్నో ఉన్నాయి.

వణుకుతున్న కాలనీలు..

- హుస్సేన్ సాగర్ సర్‌ప్లస్ నాలా పరిసరాల్లోని నాగమయ్యకుంట, పద్మా కాలనీ, అంజయ్య నగర్, అవంతీనగర్, సూరజ్‌నగర్, ఆదర్శకాలనీ, బాపూజీనగర్, శ్రీరామ్‌నగర్, అరవింద్‌నగర్, రత్నానగర్, సత్యానగర్, సంజయ్‌గాంధీ నగర్, శంకర్ నగర్ తదితర బస్తీలు వర్షాలకు నీట మునిగే పరిస్థితులున్నాయి. శివార్లలోని ఉప్పల్, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లోని పలు కాలనీలు, బస్తీలకు ముంపు ముప్పు పొంచి ఉంది. ఉప్పల్ సమీపంలో రెండేళ్ల క్రితం నీట మునిగిన పలు కాలనీలకు ఇప్పటికీ సమస్యలు తీరలేదు. అలాంటి వాటిలో శ్రీనగర్ కాలనీ, సౌత్ స్వరూప్‌నగర్, కావేరీ నగర్, నాచారం ఎర్రకుంట, ఇందిరానగర్, వీరారెడ్డి నగర్, మల్లాపూర్ భవానీనగర్, మల్లికార్జున నగర్ తదితర ప్రాంతాలున్నాయి. కూకట్‌పల్లి ఆల్విన్ కాలనీ, ధరణినగర్, సరూర్‌నగర్ చెరువు చుట్టూ ఉన్న కాలనీలకూ వరద సమస్యలున్నాయి. షేక్‌పేట పరిసరాల్లోని నదీంకాలనీ తదితర ప్రాంతాలు వర్షం వస్తే మునుగుతాయి. వరద సమస్యల పరిష్కారానికి ఎస్ఎన్‌డీపీ కింద రెండేళ్ల క్రితమే పనులు చేపట్టినప్పటికీ అవి పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో భారీ వర్ష హెచ్చరికలతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు.



సహాయక చర్యల్లో డీఆర్ఎఫ్ బృందాలు

ముంపు నివారణ చర్యలు చేపట్టాలి: మేయర్

లోతట్టు ప్రాంతాల్లో వరద నివారణ చర్యలతో ముంపు సమస్యలు పరిష్కరించాలని మేయర్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. నగరంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటం, భారీ వర్షసూచనలున్న నేపథ్యంలో జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులతో వైర్లెస్ సెట్ ద్వారా సమీక్షించారు. జోన్ అధికారులు తమ పరిధిలో ఏయే ప్రాంతాల్లో ముంపు సమస్యలున్నాయో ముందుగానే గుర్తించి, సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. గాజుల రామారం, తదితర ప్రాంతాల్లో పలు కాలనీల్లో నీటినిల్వలు చేరినందున కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని తమ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు.

బల్దియా కాల్‌సెంటర్‌కు ఫిర్యాదుల వెల్లువ

సాక్షి, సిటీబ్యూరో: వరుస వర్షాలతో నగరంలోని రోడ్లపైకి వచ్చిన వరద నీరు ప్రవహించే దారి లేక పలు ప్రాంతాల్లో చెరువులను తలపిస్తున్నాయి. జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్‌కు నీటి నిల్వలపై 235 ఫిర్యాదులందాయి. డీఆర్ఎఫ్‌కు మరో 12 ఫిర్యాదులు వచ్చాయి. చెట్లు కూలడం తదితర ఫిర్యాదులు సైతం తగ్గడం లేదు. మంగళవారం చెట్లు కూలిన ఫిర్యాదులు 27, గోడలు కూలిన ఫిర్యాదులు 3, ఒకచోట కూలిన విద్యుత్ స్తంభంపై ఫిర్యాదులందాయి. బుధవారం మధ్యాహ్నం వరకు డీఆర్ఎఫ్‌కు 17 ఫిర్యాదులందగా, వాటిలో చెట్లు కూలినవి 11, నీటి నిల్వలవి 4, ఇతరత్రా రెండు ఫిర్యాదులున్నాయి. బంజారాహిల్స్ రోడ్‌నంబర్-14లో కూలిన ఒక పెద్దచెట్టును తొలగించేందుకు డీఆర్ఎఫ్, ట్రాఫిక్ పోలీసులు కలిసి ఆరు గంటలు శ్రమించాల్సి వచ్చింది.

70 లక్షలమందికి ఎస్ఎంఎస్‌లు

బుధవారం భారీ వర్షం కురవనున్నట్లు వాతావరణశాఖ తెలపడంతో ప్రజలను అప్రమత్తం చేస్తూ డీఆర్ఎఫ్ విభాగం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 70 లక్షలమందికి ఎస్ఎంఎస్‌లు పంపినట్లు అధికారులుతెలిపారు.

రోజంతా ముసురే

రాకపోకలకు అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: పది రోజులుగా వాన కష్టాలు వీడటంలేదు. వెల్లువెత్తుతున్న వరదలతో నగరం గజగజ వణుకుతోంది. జనజీవనం స్తంభించిపోతోంది. అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ ప్రకటనతో మరింత భయం పట్టుకుంది. అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దన్న సూచనలతో నగరవాసులు బయటికి వెళ్లేందుకు వెనకాడుతున్నారు. బుధవారం రోజంతా చిరుజల్లులు కురిశాయి. రాత్రి 10 గంటల వరకు టోలిచౌకీలో అత్యధికంగా 6.08 సెం.మీ వర్షపాతం నమోదైంది. రోడ్లపై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధాన రహదారులు చిత్తడిగా మారాయి. డ్రైనేజీలు, నాలాల మ్యాన్‌హోళ్లు పొంగి పొర్లుతున్నాయి. ఇప్పటికే లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. చెరువులు, కుంటలు నిండటంతో పరీవాహక ప్రాంతాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నేడు కూడా భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయనే ప్రకటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.



గాజుల రామారంలో..



బషీర్‌బాగ్‌లో బైక్‌పై వర్షానికి తడవకుండా..



ఎల్బీనగర్‌లో..



తుర్కయంజాల్‌లో..

వరదలపై నిఘా

- ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ నుంచి పర్యవేక్షణ
- ట్రాఫిక్ రద్దీ, వరద ప్రాంతాల గుర్తింపు
- 2 వేల మంది పోలీసు సిబ్బంది
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర వెల్లడి



రాయదుర్గం: వరదలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుకు సైబరాబాద్ పోలీసులు శ్రీకారం చుట్టారు. ఇంటిగ్రేటెడ్ ఆపరేషన్ సెంటర్ నుంచి పర్యవేక్షణ చేసేందుకు,. ఇక్కడి నుంచే ట్రాఫిక్ రద్దీ, వరద ప్రాంతాల గుర్తింపు ఏర్పాట్లు చేశారు. క్షేత్రస్థాయిలో క్రమబద్ధీకరణ కోసం రెండు వేల మంది పోలీసు సిబ్బందిని కూడా వినియోగించాలని నిర్ణయించారు. బుధవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో సైబరాబాద్ పోలీసులు, ఐటీ, ఐటీఈఎస్, ఫార్మా, హోటళ్లు, ఆస్పత్రుల సీఈఓలు, ఇతర అధికారులతో సీపీ స్టీఫెన్ రవీంద్ర ఆధ్వర్యంలో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల సమయంలో వాహనదారులు సురక్షిత ప్రయాణాన్ని కొనసాగించేలా చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. సైబరాబాద్ పోలీసులతో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి నిరంతరం గ్రౌండ్ లెవల్లో పరిస్థితిని పర్యవేక్షిస్తామన్నారు. నీరు నిలిచిపోయే ప్రాంతాలను గుర్తించడం, 8 బృందాలతో పీఎస్ఐటీసీ ద్వారా రోజంతా రద్దీగా ఉండే అన్ని రహదారులను పర్యవేక్షిస్తామన్నారు. వేగవంతమైన స్పందన కోసం 10 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయడం, రహదారిపై ఎక్కువ మంది పోలీసు సిబ్బందిని ఉండేలా చేస్తామన్నారు. దాదాపు 2వేల మంది సిబ్బందిని మోహరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఐటీ, ఇతర సంస్థల కార్యాలయాలకు వెళ్లేవారు కార్ పూలింగ్‌లో పాల్గొనేలా చూడాలని, సాధ్యమైన చోట మెట్రో, ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్‌సీఎస్‌సీ జనరల్ సెక్రెటరీ రమేష్‌కాజా, అదనపు కమిషనర్ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ నాయక్, డీసీపీ సందీప్, ఏసీపీ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంప్రదించాల్సిన నంబర్లు

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలపై మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ 87126 63011, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ 87126 63010, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 94906 17346. 24 గంటల పాటు 83339 93360 నంబర్ అందుబాటులో ఉంటుంది.



పెద్దఅంబర్‌పేట కత్వా వద్ద యువకుల సందడి

జల్లు.. పరవళ్లు

- జంట జలాశయాలకు వరద
- ఉస్మాన్ సాగర్ 2 గేట్ల ఎత్తివేత
- కొనసాగుతున్న హిమాయత్ సాగర్ నీటి విడుదల
- ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ



దిగువకు గండిపేట జలాలు

సాక్షి, సిటీబ్యూరో/బండ్లగూడ: వరుసగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి జంట జలాశయాలకు వరద పోటెత్తుతోంది. భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌తో పాటు హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారాయి. దీంతో జలాశయాల గేట్లు, తూముల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆరు రోజుల నుంచే హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తుండగా, తాజాగా బుధవారం ఉస్మాన్ సాగర్ రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. వాతావరణ శాఖ మరో రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఎగువ ప్రాంతాల నుంచి మరింత వరద ప్రవాహం పెరిగే అవకాశాలు ఉండటంతో పరీవాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

హుస్సేన్‌సాగర్‌కు..

హుస్సేన్ సాగర్‌కు వరద పెరిగింది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి నాలాల నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో హుస్సేన్‌సాగర్ నీటి మట్టం ఫుల్ ట్యాంక్ లెవల్‌ను దాటేసింది. పూర్తిస్థాయి నీటి మట్టం దాటడంతో అధికారులు తూముల ద్వారా హుస్సేన్‌సాగర్ నుంచి నీటిని మూసీలోకి విడుదల చేస్తున్నారు. పూర్తిస్థాయి నీటి మట్టం 513.41 మీటర్లు కాగా.. ప్రస్తుతం 513.47 మీటర్లుగా నీటి మట్టం కొనసాగుతోంది.

దిగువకు నీటి విడుదల

జంట జలాశయాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో దిగువకు విడుదల చేస్తున్నారు. హిమాయత్‌సాగర్‌కు ప్రస్తుతం 1200 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. రెండు గేట్లు ఒక అడుగు మేర ఎత్తి 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఉస్మాన్‌సాగర్‌కు ఎగువ భాగం రిజర్వాయర్ కు 800 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా.. 216 క్యూసెక్కుల నీటిని దిగువనున్న మూసీలోకి వదులుతున్నారు.

ఉధృతంగా మూసీ..

జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో 1566 క్యూసెక్కుల వరద నీరు దిగువనున్న మూసీ నదిలోకి విడుదలవుతోంది. దీంతో మూసీ పరీవాహక ప్రాంతాల్లో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. పురానాపూల్, జియాగూడ, కుల్సుమ్‌పురాలలోని లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేశారు. పాతబస్తీలోని ఉస్మాన్‌నగర్‌లోని పలు కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

భార్యా భర్తల 'డ్రగ్స్‌' దందా!

అనుమతి లేకుండా నియంత్రిత ఔషధాల విక్రయం

- ఎన్‌డీపీఎల్‌ లైసెన్సునూ ఫోర్జరీ చేసిన నిందితులు
- మెడికల్‌ ఏజెన్సీ ముసుగులో సాగుతున్న వ్యవహారం
- గుట్టురట్టు చేసిన నార్కోటిక్స్‌ బ్యూరో అధికారులు
- ముగ్గురు నిందితుల అరెస్టు, భారీగా ఇంజెక్షన్లు సీజ్‌



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: ఒక మార్ఫైన్‌ టాబ్లెట్‌ను రోగి వేసుకుంటే దాదాపు 12 గంటలు నిద్రలోనే ఉంటాడు. ఒక మిల్లీ లీటర్‌ ఫెంటనైల్‌ సిట్రేట్‌ ఇంజెక్షన్‌ 100 మార్ఫైన్‌ టాబ్లెట్లతో సమానం. అలాంటి ఇంజెక్షన్లు 3265 (9.33 లీటర్లు) అక్రమంగా నిల్వ ఉంచి, విక్రయించడానికి ప్రయత్నించారో మెడికల్‌ ఏజెన్సీ నిర్వాహకులు. దీనిపై సమాచారం అందుకున్న తెలంగాణ స్టేట్‌ నార్కోటిక్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో (టీఎస్‌–నాబ్‌) అధికారులు దాడి చేసి వీటితో సహా మరికొన్ని నియంత్రిత జాబితాలోని మందులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చక్రవర్తి గుమ్మి బుధవారం తెలిపారు.

విక్రయం, వినియోగానికీ ప్రత్యేక లైసెన్సులు..

సాధారణ ఔషధాలను సరఫరా చేసే మెడికల్‌ ఏజెన్సీలు నియంత్రిత జాబితాలో ఉన్న ఫెంటనైల్‌, మార్ఫైన్‌, మిడాజోలం, కోడైన్‌ ఫాస్ఫేట్‌ తదితర ఇంజెక్షన్లు, టాబ్లెట్లు విక్రయించకూడదు. దీనికోసం ఔషధ నియంత్రణ మండలి నుంచి ప్రత్యేకంగా ఎన్‌డీపీఎస్‌ 1, 2 లైసెన్సులు తీసుకోవాలి. ఈ మందులను డబుల్‌ లాకర్‌ విధానంలో పటిష్టంగా భద్రపరచాలి. కాగా మౌలాలీ ఎంజే కాలనీకి చెందిన భార్యభర్తలు సుశీల్‌ కుమార్‌ మిశ్రా, నేహా చింతమన్‌రావు భగవత్‌ మల్కాజిగిరిలో ఏఎస్‌ ఎంటర్‌ప్రైజెస్‌ పేరుతో మెడికల్‌ ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. వీరికి 2022 వరకు ఎన్డీపీఎస్‌ 1, 2 లైసెన్సులు ఉండేవి. ఈ ఏడాది రెన్యువల్‌ చేయించుకోవాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేశాడు. ఈ ఔషధాలను ముంబైకి చెందిన రూసన్‌ హెల్త్‌ కేర్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ తయారు చేస్తుంది. అందులో పని చేసే రీజనల్‌ సేల్స్‌ మేనేజర్‌ బి.ఉదయ్‌ కిరణ్‌ సలహా మేరకు పాత లైసెన్సునే ఫోర్జరీ చేసి రెన్యువల్‌ చేసినట్లు సృష్టించాడు. దీని ఆధారంగా రూసన్‌ కంపెనీ డిస్ట్రిబ్యూటర్‌కు లేఖ రాసి వీటిని పొందుతున్నాడు.



స్వాధీనం చేసుకున్న మందులు

వేరే రాష్ట్రానికి రవాణా చేయాలన్నా...

ఈ ఔషధాలను వేరే రాష్ట్రాలకు రవాణా చేయాలన్నా ప్రత్యేక ట్రాన్స్‌పోర్టు లైసెన్సు ఉండాలి. ఈ నిబంధనల్ని తుంగలో తొక్కుతున్న సుశీల్‌, నేహా తెలంగాణ, ఏపీల్లోని అనేక ఆస్పత్రులకు బ్లాక్‌లో విక్రయించేస్తున్నారు. ఇలా ఇప్పటికి ఆరు బ్యాచ్‌లు ఖరీదు చేసి విక్రయించారు. వీరి దందాపై టీఎస్‌–నాబ్‌ ఇన్‌స్పెక్టర్‌ పి.రమేష్‌ రెడ్డికి సమాచారం అందింది. దీంతో బుధవారం ఏఎస్‌ ఎంటర్‌ప్రైజెస్‌పై దాడి చేసి భార్యభర్తలతో పాటు ఉదయ్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి భారీగా నియంత్రిత జాబితాలోని మందులు స్వాధీనం చేసుకుని కేసును మల్కాజిగిరి పోలీసులకు అప్పగించారు. ఇలాంటి దందాలపై సమాచారం తెలిస్తే 8712671111 నెంబర్‌కు తెలపాలని పోలీసులు కోరుతున్నారు.

రూ 6 వేలు లంచం తీసుకుంటూ దొరికిన లైన్‌ ఇన్‌స్పెక్టర్‌



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న కరెన్సీ నోట్లు

లాలాపేట: ఓ ఇంటికి ఉన్న విద్యుత్‌ కనెక్షన్‌ను మార్చేందుకు రూ.6 వేలు లంచం తీసుకుంటూ ఓ ఎలక్ట్రికల్‌ లైన్‌ఇన్‌స్పెక్టర్‌ ఏసీబీ అధికారులకు రెడ్‌ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ సంఘటన బుధవారం తార్నాకలో చోటు చేసుకుంది. లాలాగూడలోని టీఎస్‌పీఎస్సీడీసీఎల్‌ అసిస్టెంట్‌ ఇంజనీర్‌ కార్యాలయంలో లైన్‌ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.వెంకటేశ్వర్లుకు లాలాగూడ ప్రాంతంలో మహ్మద్‌ షాహిద్‌ అలీ తన ఇంటికి ఉన్న కమర్షియల్‌ విద్యుత్‌ కనెక్షన్‌ను డొమెస్టిక్‌ కేటగిరిగా మార్చాలని దరఖాస్తు పెట్టుకున్నాడు. ఆ దరఖాస్తును కొన్నిరోజుల నుంచి వెంకటేశ్వర్లు పెండింగ్‌లో పెట్టాడు. దీనిపై షాహిద్‌ అలీ ప్రశ్నించగా రూ.ఆరు వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు ఆరు వేల రూపాలను బుధవారం కార్యాలయంలో అందజేస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వర్లును అరెస్టు చేసి ఏసీబీ అడిషినల్‌ స్పెషల్‌ జడ్జి ముందు ప్రవేశపెట్టారు. దీంతో అతన్ని రిమాండ్‌కు తరలించారు.

బియ్యం...షాంపూ..సర్ఫ్‌లో బంగారం

ఆరు వేర్వేరు కేసుల్లో 1.35 కోట్ల బంగారం పట్టివేత

- విదేశీ కరెన్సీ..సిగరెట్లు సైతం



పట్టుబడిన బంగారం



బియ్యం, షాంపులో బంగారం ముక్కలు

శంషాబాద్‌: బంగారం అక్రమ రవాణాకు కాదేదీ అనర్హం అన్నట్లుగా మారుతోంది అక్రమార్కుల తీరు.. కస్టమ్స్‌ అధికారులు కట్టడి పెరుగుతున్నా..రోజుకో కొత్త కొత్త మార్గాల్లో అక్రమంగా బంగారాన్ని తరలించేందుకు యత్నిస్తూ పట్టుబడుతున్నారు.. తాజాగా బియ్యం, షాంపు, సర్ఫ్‌లతో పాటు పనిముట్లలో బంగారం తీసుకొచ్చి పట్టుబడ్డారు. బుధవారం కస్టమ్స్‌ అధికారులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 22న దుబాయ్‌ నుంచి వచ్చిన నలుగురు వేర్వేరు ప్రయాణికులను తనిఖీ చేయగా ఇద్దరు వ్యక్తులు వారి దుస్తుల్లో దాచుకుని తీసుకొచ్చిన బంగారం బయటపడగా మరో ఇద్దరు వ్యక్తులు పనిముట్లలో దాచుకుని తీసుకొచ్చిన బంగారం బయటపడింది. మొత్తం 1 కేజీ 559 గ్రాముల బంగారం విలువ 93.28 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ఈ నెల 23న కువైట్‌ నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల వద్ద ఉన్న లగేజీని అధికారులు పరిశీలించారు. అందులో బాస్మతి బియ్యం, దుస్తులు ఉతికే సర్ఫు, షాంపులు ఉండడంతో అనుమానంతో వాటిని పరిశీలించారు. చిన్న చిన్న ఇనుప ముక్కల మాదిరిగా చేసి తీసుకొచ్చి 704 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ 42.8 లక్షలుగా నిర్ధారించారు.

సిగరెట్లు.. కరెన్సీ

బహ్రేన్‌ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద 22 వేల విలువ చేసే 15 వేల విదేశీ సిగరెట్లు లభ్యం కాగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా హైదరాబాద్‌ నుంచి అల్‌ఖైమా వెళుతున్న ప్రయాణికుడి వద్ద భారత కరెన్సీలో 7.5 లక్షల విలువ చేసే సౌది కరెన్సీని అధికారులు స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓక్షిత్‌ ఎన్‌క్లేవ్‌ను సందర్శించిన మల్లు రవి



ఓక్షిత్‌ ఎన్‌క్లేవ్‌లో నిరసన తెలుపుతున్న డాక్టర్‌ మల్లు రవి, భూపతిరెడ్డి తదితరులు

సుభాష్‌నగర్‌: పరిపాలన చేతకాని మున్సిపల్‌ శాఖామంత్రి కేటీఆర్‌ రాజీనామా చేయాలని, విశ్వనగరమని గొప్పలు చెబుతున్న వారు కుత్బుల్లాపూర్‌లో రోడ్ల పరిస్థితిని చూసి సమాధానం చెప్పాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్‌ మల్లు రవి అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డితో కలిసి మల్లు రవి గాజులరామారంలోని ఓక్షిత ఎన్‌క్లేవ్‌ను సందర్శించారు. కాలనీ నీట మునగడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ పోస్టర్లతో నిరసన తెలిపారు. వర్షం పడిన ప్రతిసారి లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టడం లేదని, డ్రైనేజీ లైన్‌లను ఆధునీకరించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్‌ ఏ బ్లాక్‌ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌ గౌడ్‌, మండల మాజీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌ రెడ్డి పాల్గొన్నారు.

తాళం వేసి మూడేళ్లు!

ఉస్మానియా ఆస్పత్రి పాత భవనానికి ఇంకా లభించని మోక్షం

- మూడేళ్ల క్రితం వర్షపు నీరు వార్డుల్లోకి చేరడంతో మూసివేత
- అందుబాటులో ఉన్న భవనాల్లో రోగుల సర్దుబాటు
- ఇప్పటికీ అతీగతీలేని కొత్త భవనం నిర్మాణం

అఫ్జల్‌గంజ్‌: పేదల పెద్దాసుపత్రి అయిన ఉస్మానియా జనరల్‌ ఆస్పత్రి పాత భవనానికి తాళం పడి నేటికి మూడేళ్లు పూర్తి. దాదాపు వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ భవనం భారీగా దెబ్బతినడంతో శిథిలావస్థకు చేరింది. 2020 జులైలో కురిసిన వర్షాలకు వర్షం నీరు రోగుల వార్డుల్లోకి చేరడంతో అదే నెల 27న ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆస్పత్రి పరిపాలన విభాగం అధికారులు ఈ భవనానికి తాళం వేసి మూసివేశారు. కానీ ఇప్పటి వరకు కూడా ఈ భవనం స్థానంలో కొత్త దాని నిర్మాణం గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వాస్తవంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ స్వయంగా ఉస్మానియా ఆస్పత్రిని సందర్శించి నూతన భవనం నిర్మాణం కోసం రూ 200 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, కొంతమంది చరిత్రకారులు పాత భవనం హెరిటేజ్‌ జాబితాలో ఉన్న కారణంగా కూల్చవద్దని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ తర్వాత ఇక కొత్త భవనం ఊసే ఎత్తడం లేదు.

గవర్నర్‌ సైతం ఆందోళన

ఇటీవల గవర్నర్‌ తమిళిసై సౌందర్యరాజన్‌ సైతం స్వయంగా ఆస్పత్రిని సందర్శించి ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త భవనం నిర్మించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాస్తానని వెల్లడించారు. దీనిపై స్పందించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి హరీష్‌ రావు వారం రోజుల్లోపు న్యాయస్థానంలో అఫిడవిట్‌ దాఖలు చేసి నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తామని వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నూతన ఆస్పత్రులు, టీచింగ్‌ ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నప్పటికీ..తెలంగాణ వాసులకు ఎంతో కీలకమైన ఉస్మానియాను పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. పాత భవనం మూసి వేయడంతో కులీకుతుబ్‌షా, ఓపీ భవనాల్లో పెరుగుతున్న రోగులను సర్దుబాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆస్పత్రికి నూతన భవనం మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.



ఉస్మానియా ఆస్పత్రి పాత భవనం (ఫైల్‌ ఫోటో)

త్వరలోనే నూతన భవనం



ఉస్మానియా జనరల్‌ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న భవనాల్లో రోగులను సర్దుబాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. నూతన భవనం వస్తే మరింత మంది రోగులకు వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుంది. మంత్రి హరీష్‌ రావు నేతృత్వంలో అధునాతన వైద్య పరికరాలు సమకూర్చడంతో ఇక్కడ మరింత మెరుగైన వైద్య సేవలందించగలుగుతున్నాం. త్వరలోనే నూతన భవనం మంజూరు అవుతుందని ఆశిస్తున్నాం.

– డాక్టర్‌ బి నాగేందర్‌, సూపరింటెండెంట్‌, ఉస్మానియా ఆస్పత్రి

త్వరలో బాచుపల్లికి తెలుగు వర్సిటీ తరలింపు

నాంపల్లి: ఐదెకరాల విస్తీర్ణం నుంచి వందెకరాల విస్తీర్ణంలోనికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం అతి త్వరలో తరలిపోనుంది. నగర శివారు బాచుపల్లిలో తెలుగు వర్సిటీ కోసం ప్రభుత్వం వందెకరాల భూమిని సమకూర్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం కేటాయించిన ఈ భూమిలో ఇప్పటికే బహుళ అంతస్తుల భవంతుల నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రస్తుతం నగరం నడిబొడ్డున నాంపల్లిలో ఉండే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాన్ని పూర్తిగా తరలించేందుకు వర్సిటీ పాలనా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వర్శిటీ తరలింపునకు మంచి ముహూర్తం కోసం ఎదురు చూస్తోంది. అన్ని సక్రమంగా కుదిరితే మనోహర మాసమైన అధిక శ్రావణం పూర్తవగానే నిజ శ్రావణంలో పాలు పొంగించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే ఫర్నిచర్‌, ఫైళ్లు, కంప్యూటర్ల తరలింపుకు టెండర్లను ఆహ్వానించినట్లు తెలిసింది. టెండర్లు దక్కించుకున్న కంపెనీ తెలుగు వర్శిటీలోని వస్తు సామాగ్రిని ప్యాకింగ్‌ చేస్తున్నారు. ఈ తరలింపు ప్రక్రియ పది రోజులకు పైగా పట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏది ఏమైనా ఆగస్టు 15 తరువాత ఎప్పుడైనా బాచుపల్లికి తెలుగు వర్సిటీ నాంపల్లి నుంచి పూర్తిగా తరలిపోయే అవకాశం ఉందని చెప్పవచ్చు.

నేడు ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

అంబర్‌పేట: నిరుద్యోగ యువత కోసం ఉచితంగా శిక్షణ అందించి 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పించడానికి పరవస్తు క్రియేటివ్‌ ఫౌండేషన్‌, రాంకీ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఈ నెల 27న సికింద్రాబాద్‌లోని ఎస్‌వీఐటీ క్యాంపస్‌లో ఉదయం 9:30 గంటలకు మెగా స్క్రీనింగ్‌ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు పీసీఎఫ్‌ కార్యదర్శులు సందీప్‌ హరి, గద్దె భాస్కర్‌, రాంకీ ఫౌండేషన్‌ ప్రెసిడెంట్‌ ముప్వ రాంరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25 ఏళ్లలోపు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఉచిత వసతితోపాటు నిపుణులతో సంబంధిత ఉద్యోగ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. సాఫ్ట్‌ స్కిల్స్‌, మాక్‌ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఐటీ సెక్టార్‌లో సీఆర్‌ఎం, ఐటీ హెల్ప్‌ డెస్క్‌, బీపీఓ, డాటాఎంట్రీ, ఐటీసేల్స్‌, సర్వర్‌ మేనేజ్‌మెంట్‌ తదితర ఉద్యోగాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. వార్షికజీతం కనీసం రూ.3 లక్షలకు పైగా ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కోర్సు కాలపరిమితి 40–60 రోజులు ఉంటుంది. ఆసక్తిగల వారు www.paravasthu.org లో రిజిస్ట్రేషన్‌ చేసుకోవాలని సూచించారు.

గుండెపోటుతో కాదు..గాయాల వల్లే..

- కొద్దిరోజుల క్రితం మృతిచెందిన వివాహిత లహరి
- గాయాలవల్లే చనిపోయినట్లు తాజాగా పోస్టుమార్టం రిపోర్టు
- లహరి భర్త వల్లభ్‌రెడ్డి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

హిమాయత్‌నగర్‌: హిమాయత్‌నగర్‌కు చెందిన వివాహిత లహరి మృతి వివాదాస్పదంగా మారింది. కొద్దిరోజుల క్రితం ఆమె గుండెపోటుతో మృతిచెందిందని లహరి తండ్రి జైపాల్‌రెడ్డికి సమాచారం అందింది. తాజాగా ఆమె గుండెపోటుతో కాదని.. తలపై, శరీరంపై గాయాలవ్వడం వల్లే మృతి చెందిందంటూ వైద్యులు ధృవీకరించారు. దీంతో ఈ వ్యవహారంలో మొదట నుంచి అనుమానంగా ఉన్న ఆమె భర్త వల్లభ్‌రెడ్డిని నారాయణగూడ పోలీసులు బుధవారం నల్లగొండలో అరెస్టు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే...హిమాయత్‌నగర్‌కు చెందిన జైపాల్‌రెడ్డి పెద్ద కుమార్తె లహరికి గత ఏడాది నల్లగొండ జిల్లాకు చెందిన వల్లభ్‌రెడ్డితో వివాహం జరిగింది. ఈ నెల 15వ తేదీన లహరి గుండెపోటుకు గురై మృతిచెందినట్లు జైపాల్‌రెడ్డికి సమాచారం అందింది. దీనిపై అదేరోజు తన కుమార్తె మరణంపై అనుమానం లేదంటూనే..తన కుమార్తె మృతికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ జైపాల్‌రెడ్డి నారాయణగూడ పోలీసులకు రెండు విధాలుగా ఫిర్యాదు చేశాడు. దీనిపై 174 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. లహరి తలకు బలమైన గాయాలయ్యాయని, అందువల్లే మృతిచెందిందని పోస్టుమార్టం రిపోర్టులో వెల్లడైంది. దీంతో లహరి భర్త వల్లభ్‌రెడ్డిని పోలీసులు బుధవారం నల్లగొండలో అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చారు. అనంతరం రిమాండ్‌కు పంపినట్లు నారాయణగూడ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌ తెలిపారు.

కాసులు కురిపిస్తున్న భూముల క్రమబద్ధీకరణ జీఓ

- ప్రభుత్వ స్థలాల్లో వాలిన పెద్ద గద్దలు
- రెగ్యులరైజేషన్‌ పేరుతో అన్యాక్రాంతం
- నేతలు, వారి బంధువుల పేరున 59 జీఓ కింద దరఖాస్తులు
- పొజిషన్‌లో లేకపోయినా ఉన్నట్లు ధ్రువీకరణ
- 'మామూలు'గా సాగుతున్న రెవెన్యూ తనిఖీలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పేదలు నివసించే ఇళ్లు, స్థలాల రెగ్యులరైజేషన్‌ కోసం సర్కారు తీసుకువచ్చిన జీఓ 59.. పలువురు నేతలు, అధికారులకు అక్షయ పాత్రగా మారింది. ఇదే అదనుగా భావించిన వీరు ప్రభుత్వ ఖాళీ స్థలాలపై కన్నేశారు. నిర్మాణాలు లేని చోట ఇళ్లు ఉన్నట్లు.. కరెంటు లేని చోట మీటర్లు జారీ చేసినట్లు.. పంచాయతీకి ఇంటి పన్నులు సైతం చెల్లించినట్లు తప్పుడు రసీదులు సృష్టించారు. వీటి ఆధారంగా.. కొంతమంది నాయకులు తమతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, అనుచరుల పేరున భూముల క్రమబద్ధీకరణకు దర ఖాస్తు చేసుకున్నారు. తనిఖీలకు వచ్చిన రెవెన్యూ అధికారులకు అడిగినంత ముట్టజెప్పి.. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారు.

పసుమాముల కేంద్రంగా..

అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం పసుమాముల రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్‌ 102, 106, 137, 267, 386/4 నుంచి 386/12, 413, 444లలో ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో రెవెన్యూ అధికారులు నోటీసు బోర్డులు కూడా పెట్టారు. ఈ స్థలానికి బహిరంగ మార్కెట్లో గజానికి రూ.25 వేలకుపైగా ధర పలుకుతోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధికి ప్రధాన అనుచరుడిగా చెప్పుకొంటున్న ఓ స్థానిక నేత కన్ను వీటిపై పడింది. ఖాళీగా ఉన్న ఈ భూములను ఎలాగైనా చేజిక్కించుకోవాలని భావించాడు. ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్‌ 59ను అనుకూలంగా మలుచుకునే కుట్రకు తెరతీశాడు. ఆయా భూముల్లో ఏళ్ల తరబడి తామే పొజిషన్‌లో ఉన్నట్లు తప్పుడు పత్రాలు సృష్టించారు. తన పేరుతో పాటు భార్య, కొడుకు, తల్లి, తండ్రి, తోడల్లుడు, మరదలు, డ్రైవరు ఇలా సపరివారం, బంధువుల పేరున ఎకరాల్లో ఉన్న భూమిని గుంటలు, గజాల్లోకి మార్చారు. ఒక్కో వ్యక్తి పేరున ఒక్కో సర్వే నంబరులో రెండు, మూడు ప్లాట్లు ఉన్నట్లు రికార్డులు సృష్టించారు. ఒక్కో వ్యక్తి పేరున 1,500 నుంచి 2,500 గజాల వరకు ఉన్నట్లు నోటరీ డాక్యుమెంట్లు రూపొందించారు. ఈ మేరకు ఆయా వ్యక్తుల పేరున జీఓ నంబర్‌ 59 కింద దరఖాస్తు చేసుకున్నారు. ఇలా ఆయన ఒక్కరే పది వేల గజాలకుపైగా కొల్లగొట్టేందుకు యత్నిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఫ్యామిలీ ప్యాక్‌గా రెగ్యులరైజేషన్‌

జీఓ నంబర్‌ 59 కింద ఒక్క పసుమాముల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వానికి 218 దరఖాస్తులు రాగా 186 అప్లికేషన్లు ఖాళీ స్థలాలకు సంబంధించినవే కావడం విశేషం. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చిన అధికారుల చేతులు తడిపి, జిల్లా స్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి క్రమబద్ధీకరణ పేరుతో తక్కువ రేటుకు స్థలాలను కొల్లగొడుతున్నారు.

ఎవరి వాటా వారిదే!

తట్టి అన్నారం రెవెన్యూ సర్వే నంబర్‌ 106లోని ప్రభుత్వ భూమిని ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు కలిసి కొల్లగొట్టారు. స్థలాల క్రమబద్ధీకరణలో వాటాలు మాట్లాడుకుని ఈ తతంగాన్ని నడిపించారు. అమనగల్లు రెవెన్యూ పరిధి సర్వే నంబర్‌ 40లోని 22 గుంటల భూమిని ప్రభుత్వం గతంలో జీహెచ్‌ఎంసీకి కేటాయించింది. స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, ఇతరులు కలిసి ఈ భూములను కొల్లగొట్టేందుకు యత్నిస్తున్నారు. సర్వే నంబరు 60లోని భూమికి పాత తేదీలతో స్టాంప్‌ పేపర్లు, నోటరీలు సృష్టించి రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సర్వే నం.71లోని భూమిపై ఇప్పటికీ కోర్టులో కేసు నడుస్తోంది. ఇందులోనూ అర్జీలు పెట్టుకున్నారు. సర్వే నం. 255లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇక్కడి నిర్మాణాలకు ఆగమేఘాలపై కరెంట్‌ మీటర్లు జారీ అవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ నుంచి ఇంటి పన్ను రసీదులు పుట్టుకొస్తున్నాయి. మునుగనూరు సర్వే నంబర్‌ 90లోని స్థలాల క్రమబద్ధీకరణలోనూ ఇదే తంతు సాగుతోంది.

తహసీల్దార్లకు కనక వర్షం

పేదల ఇళ్లు, స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్‌ 59 కొంత మంది తహసీల్దార్లకు కాసుల వర్షం కురుస్తోంది. పొజిషన్‌లో ఎలాంటి నిర్మాణాలు లేకపోయినా ఉన్నట్లుగా నిర్ధారించి రెగ్యులరైజ్‌ చేస్తున్నారు. ఇందుకోసం పెద్ద మొత్తంలో దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.నిజానికి 2020 జూన్‌కు ముందు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లిన నివాస స్థలాల ను మాత్రమే ఈ జీఓ కింద పరిగణించాలి. కానీ ఇవేవీ పట్టించుకోవడం లేదు. పసుమాముల లోని ప్రభుత్వ, లావణి పట్టా భూముల అన్యాక్రాంతంపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

నిబంధనలు పాటిస్తున్నాం

ప్రభుత్వ భూముల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లు, స్థలాల క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్‌ 59 తీసుకొచ్చారు. పసుమాముల రెవెన్యూ పరిధి నుంచి కూడా దరఖాస్తులు అందాయి. నిబంధనల ప్రకారం ఉన్న వాటిని మాత్రమే అప్రూవల్‌ చేస్తున్నాం. మిగిలినవి తిరస్కరిస్తున్నాం. ఎలాంటి నిర్మాణాలు లేకుండా ఖాళీగా ఉన్న భూములను రెగ్యులరైజ్‌ చేస్తున్నామనే ఆరోపణల్లో వాస్తవం లేదు. ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తున్నాం.

– కలెక్టర్‌ హరీష్‌

క్లుప్తంగా...

ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా వెంకటేష్



బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా దోత్రె వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. 2017 బ్యాచ్‌కు చెందిన వెంకటేష్ ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ జిల్లా అడిషినల్ కలెక్టర్‌గా పని చేశారు. ఇదిలా ఉండగా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్‌ను సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

సీఐటీయూ నేతల ఆందోళన

వెంగళరావునగర్: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు రాపర్తి అశోక్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మధురానగర్–యూసుఫ్‌గూడ లేబర్ అడ్డా వద్ద ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రసాద్, పుల్లయ్య, కృష్ణ, రాంబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ వ్యవస్థ రద్దుతో నష్టమే..

పంజగుట్ట: వీఆర్‌ఏ వ్యవస్థ రద్దుతో ప్రభుత్వ భూముల రక్షణ లేకుండా కబ్జాకు గురయ్యే అవకాశం ఉందని వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేయకుండా మరింత పటిష్టం చేయాలని తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాల్యాల మురళీధర్ గుప్త డిమాండ్ చేశారు. బుధవారం పంజగుట్టలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేయడమంటే నిరుపేద రైతులను రెవన్యూ సేవలు అందించకపోవడమే అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. పార్టీ సెక్రటరీ జనరల్ ఇనంపల్లి సుదర్శన్, యువజన విభాగం అధ్యక్షులు బండారి శ్రీనివాస్, యువజన కార్యనిర్వహణ అధ్యక్షులు చింతల మహేందర్, అబ్బరమోయిన అంజి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఫలహారం బండి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న నవీన్‌యాదవ్

రహమత్‌నగర్: అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని నవ్‌యుగ్ నిర్మాణ్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నవీన్ యాదవ్ ఆకాంక్షించారు. మాల మహానాడు రహమత్‌నగర్ డివిజన్ యూత్ అధ్యక్షుడు రాకేష్ (రాకీ) ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. యువజన నాయకులు అనీల్ ముదిరాజ్, వేణు, భాను, సాయి, సంపత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఖైరతాబాద్: తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారి నవీన్ నికోలస్‌ని మాల వెలుగు సంఘం సభ్యులు అభినందించారు. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, రాజలింగం, బి.అనంతరామ్, భాను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.83, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 50, పచ్చిమిర్చి 75, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 80, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 16, క్యారెట్ 45, దొండ 18, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 15, దోసకాయ 21, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 43, మొరంగడ్డ 18, కందగడ్డ 28, సొరకాయ 17, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

హుండీల ఆదాయం లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలను బుధవారం అధికారులు లెక్కించారు. 25 రోజులు హుండీల ద్వారా రూ.36,46,612 ఆదాయం వచ్చిందని ఈఓ ఎస్.అన్నపూర్ణ తెలిపారు.

అడ్డాల్లో ఆకలి కేకలు!



ఫిలింనగర్ గౌతంనగర్ అడ్డా వద్ద పనుల కోసం ఎదురు చూస్తున్న కూలీలు

ఉపాధి దొరక్క నిర్మాణ రంగ కార్మికుల పరేషాన్

- ఎడతెరిపి లేని వర్షాలతో కూలీలకు దొరకని పనులు
- పస్తులుండాల్సి వస్తోందంటూ సర్వత్రా ఆవేదన

వరుణుడి దెబ్బకు అడ్డా కూలీలు ఆగమవుతున్నారు. ఒక వైపు వరుసగా కురుస్తున్న వానలకు నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోగా ఆ నిర్మాణ పనులపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది నిత్యం అడ్డాల వద్దకు రావడం పనులు దొరక్క తిరిగి ఇళ్లకు వెళ్తున్నారు. వారం రోజులుగా ఇదే తంతు జరుగుతుండటంతో వారు తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు.

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో చింతల్‌బస్తీ, ఫిలింనగర్, పంజగుట్ట, బంజారాహిల్స్ రోడ్ నెం. 12 కమాన్, ఖైరతాబాద్, సోమాజిగూడ, శ్రీనగర్ కాలనీ, ఇందిరానగర్, వెంకటేశ్వరనగర్, జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45, బంజారాహిల్స్ రోడ్ నెం. 10 ప్రాంతాల్లోని అడ్డాల వద్ద నిత్యం వందలాది మంది నిర్మాణ రంగ కార్మికులు కూలీ పనులు చేసేందుకు వస్తుంటారు. అయితే వరుసగా వానలు కురుస్తుండటంతో పనులు దొరక్క ఏం చేయాతో తెలియని దిక్కుతోచని పరిస్థితుల్లో కూలీలు తిరుగుతున్నారు.

- రెక్కాడితే కానీ డొక్కాడని తమను ఆదుకునేందుకు ఎవ్వరూ ముందుకు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల నుంచి పనులు దొరక్కపోవడంతో దినసరి కూలీలకు రోజు గడవడమే కష్టతరంగా మారింది. ఆదుకునేవారు లేక వీరి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. అసలు అంతంత మాత్రంగా ఉన్నా వీరి బతుకులపై వారం రోజుల వాన తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది.

పట్టింపేది...

అడ్డాకూలీలు కార్మిక శాఖ అందించిన గుర్తింపు కార్డులను పొంది ఉన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వీరిని ఆదుకోవడానికి మాత్రం ఏ అధికారి ముందుకు రావడం లేదు. కనీసం అడ్డాల వద్ద భోజనాలు ఏర్పాటు చేసినా వీరికి కొంత ఊరట లభించి ఉండేది. అధికారులు ఆమాత్రం సమయం చిక్కడం లేదు. ఆలోచించే నాథుడే కరువయ్యాడు. కనీసం ప్రజాప్రతినిధులు అయినా వీరిని పట్టించుకొని ఉంటే కొంత ఉపయోగంగా ఉండేది. ఆ దిశలో కూడా ఏ ఒక్కరు స్పందించిన పాపాన పోవడం లేదు.

అంబేడ్కర్ నగర్‌లో ఉద్రిక్తత

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు కాంగ్రెస్ నేతల నిర్ణయం

- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి గృహనిర్బంధం



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బస్తీవాసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46 అంబేడ్కర్‌నగర్ బస్తీలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు కాంగ్రెస్ పార్టీ నేతలు తలపెట్టడంతో ఇక్కడ తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఈ బస్తీలో నిర్మించాలని తలపెట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాంతాన్ని బుధవారం ఉదయం పరిశీలించేందుకు నిర్ణయించారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఇక్కడ భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే సమయంలో బస్తీవాసులు కొందరు కాంగ్రెస్ నేతలను అడ్డుకునేందుకు పక్కా ప్రణాళికలు రూపొందించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పరిశీలించేందుకు వచ్చే కాంగ్రెస్ నేతలను వెనక్కి పంపాలని పెద్ద ఎత్తున బస్తీవాసులు మోహరించారు. ఇక్కడికి కాంగ్రెస్ నేతలను ఎందుకు పిలుస్తున్నారంటూ స్థానిక కాంగ్రెస్ నేతలను నిలదీయగా తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ నేతలను ఇక్కడికి రానివ్వవద్దంటూ పోలీసులతో కూడా స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా ఒక వైపు పోలీసు బందోబస్తు, ఇంకోవైపు బస్తీవాసుల మోహరింపుతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తకరంగా తయారైంది. నినాదాలు, ప్రతినినాదాలతో ఆ ప్రాంతామంతా దద్దరిల్లింది. ప్రశాంతంగా ఉన్న బస్తీలో ఇదేమి గొడవంటూ రెండు వైపులా తీవ్ర ఘర్షణ పూరిత వాతావరణం చోటు చేసుకుంది. మొత్తానికి కాంగ్రెస్ నేతలను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేయడంతో సాయంత్రానికి పరిస్థితి సద్దుమణిగింది.

రోహిణ్‌రెడ్డి గృహ నిర్బంధం...

జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46 అంబేడ్కర్‌నగర్ బస్తీలో ఏడేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారని ఇప్పటికీ నిర్మాణాలు ముందుకు సాగడం లేదని వీటిని పరిశీలించేందుకు వెళ్తున్న తమను జూబ్లీహిల్స్ పోలీసులు గృహ నిర్బంధం చేశారని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన కార్యాలయంలో బ్లాక్ ప్రెసిడెంట్లు సమీర్ కుర్చి, సుఖ్‌దేవ్‌తో పాటు డివిజన్ అధ్యక్షులు గొల్యాల రాజు, నారికేళ్ల నరేష్ తదితరులను గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో 2 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాలని అధికార పార్టీ గొప్పలు చెప్పుకుంటోందని ఎక్కడ నిర్మించారో ప్రశ్నించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. తమను ముందస్తు అరెస్టు చేయడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అక్రమాలు బయటపడతాయని తమను బయటికి వెళ్లనివ్వడం లేదని... ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీల సంక్షేమానికి సీఎం ప్రాధాన్యం

- పేద విద్యార్థుల ఉన్నత విద్యకు రూ. 20 లక్షల స్కాలర్‌షిప్
- బీసీ కమిషన్ సభ్యుడు ఉపేంద్ర

లక్డీకాపూల్: బడుగు బలహీనవర్గాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరాధ్య దైవమని బీసీ కమిషన్ సభ్యుడు సి.హెచ్.ఉపేంద్ర పేర్కొన్నారు. ప్రతిభావంతులైన బీసీ విద్యార్థులకు మొత్తం ఫీజును ప్రభుత్వమే చెల్లించాలని తీసుకున్న నిర్ణయం స్ఫూర్తిదాయకమైందన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ఐఐటీ, ఐఏఎంలతోపాటు, సెంట్రల్ వర్సిటీలతోపాటు 200కు పైగా విద్యాసంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ స్కీం ద్వారా లబ్ధి పొందనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పది వేల మంది పేద బీసీ విద్యార్థులకు ఉన్నత విద్యకు అవకాశాలు మెరుగుపడతాయన్నారు. గతంలో ఎంతో మంది పేద విద్యార్థులు ఫీజు చెల్లించలేక విద్యకు దూరమయ్యారన్నారు. సీఎం తీసుకున్న నిర్ణయంతో వారి ఆశయాలు, తల్లిదండ్రుల కలలు నెరవేర్చుకునే అవకాశం రావడం బీసీ విద్యార్థులు చేసుకున్న అదృష్టం అని ఉపేంద్ర అన్నారు. రాష్ట్రంలో విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మహాత్మ జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా రూ. 20 లక్షలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని 401 ప్రీ మెట్రిక్ హాస్టల్స్‌లోని 30,732 మంది విద్యార్థులతో పాటు బీసీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్లోని విద్యార్థులకు సైతం సంపూర్ణ వసతులు కలుగుతుందన్నారు. తద్వారా 34 వేలకు పైగా బీసీ విద్యార్థులకు భోజన వసతితో పాటు పూర్తిస్థాయిలో కాస్మొటిక్ చార్జీలు, ఉలెన్ బ్లాంకెట్స్, బెడ్ షీట్స్, కార్పెట్, నోట్ బుక్స్ అందించడం గొప్ప విషయమన్నారు. గురుకుల పాఠశాలను 19 నుంచి 327కు పెంచి నాణ్యమైన భోజనం, విద్యను అందిస్తూ తెలంగాణ రాష్ట్రంలో జ్యోతిరావు పూలే ఆశయాలను నెరవేరుస్తున్నారన్నారు.

ఎన్నికల నిర్వహణపై సదస్సు

హాజరైన ఖైరతాబాద్ ఎన్నికల అధికారి

బంజారాహిల్స్: రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో ఎన్నికల సంఘం ముందస్తుగా అన్న చర్యలు తీసుకుంటున్నది. షెడ్యూల్ విడుదలకు ముందే ఎన్నికల కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఓటర్ల జాబితా సవరణ, రూపకల్పన ముమ్మరంగా సాగుతున్నది. ప్రత్యేక, సంచార వాహనాలు ఏర్పాటు చేసి ఈవీఎంలు, వీవీప్యాట్ల తనిఖీ వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఆవరణలో బుధవారం నియోజకవర్గ ఎన్నికల అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖైరతాబాద్ నియోజకవర్గం ఈఆర్‌వో వి. ప్రశాంతి ఈ సమావేశానికి హాజరయ్యారు. ఐటీ, లీగల్ ప్రొవిజన్స్‌పై ఈ సమావేశం జరిగింది. ఎన్నికల ప్రక్రియ రూపకల్పనపై ఇందులో అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరు, వినియోగం, ఈవీఎంల భద్రత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

నలుగురు మందుబాబులకు జైలు

బంజారాహిల్స్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డ్రంక్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 29 మంది వాహనదారులను బుధవారం నాంపల్లిలోని 8వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులు హాజరుపరిచారు. ఇందులో మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న టి. అఖిల్, ఎస్. శరత్‌కుమార్, కె. వంశీకృష్ణ, ప్రతాప్‌లకు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 2100 జరిమానా విధించారు. మిగతా 25 మందికి 2100 చొప్పున జరిమానా విధించారు. జరిమానాల రూపంలో మొత్తం రూ. 60,900 వసూలైనట్లు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

అడుగడుగునా గుంతలే..



బంజారాహిల్స్‌లోని సినీమ్యాక్స్ ముందు దెబ్బతిన్న మ్యాన్‌హోల్



వర్షానికి గుంతలు తేలిన కేబీఆర్ పార్కు పార్కింగ్ స్థలం

బంజారాహిల్స్: గత వారం రోజుల నుంచి ఆగకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. అడుగడుగునా గుంతలుపడిన రహదారులపై వాహనదారులు నరకాన్ని చూస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లకు వర్షాలు పడుతుండటంతో జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు మరమ్మతులు చేయలేని పరిస్థితులు తలెత్తాయి. దీంతో రోజురోజుకు పరిస్థితి అధ్వానంగా మారుతున్నది. ఓ వైపు రోడ్లపై గుంతలు నరకాన్ని చూపిస్తుండగా మరో వైపు జలమండలి మ్యాన్‌హోళ్లు చుక్కలు చూపిస్తున్నాయి. వీటికి తోడు వరద నీటి కాల్వల మ్యాన్‌హోళ్లపై చెత్తా చెదారం, రాళ్లు పేరుకుపోవడంతో కురుస్తున్న వాన నీళ్లు రోడ్లపైనే తిష్ఠవేస్తున్నాయి. దీంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారుతున్నది. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా ఉపయోగం లేకుండా పోతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నాలా ఇలా.. వరద వెళ్లేదెలా?



ఎంజీ నగర్ నాలాలో పేరుకుపోయిన గడ్డి, వ్యర్థాలు

ఫిలింనగర్: వానాకాలానికి ముందే నాలాల్లో చెత్తాచెదారం, వ్యర్థాలు, బురద పిచ్చిమొక్కలు తొలగించి వరద నీరు వెళ్లేందుకు అనువుగా తీర్చిదిద్దాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ దిశగా కనీసమైనా సఫలం కాలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మే నెలలో అన్ని నాలాల్లో డీసిల్టింగ్ చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కూడా కేటాయించారు. తీరాచూస్తే తూతూ మంత్రంగా పనులు జరిగినట్లుగా తాజా వర్షాలతో జీహెచ్‌ఎంసీ పనితీరు బట్టబయలవుతున్నది. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోకి వచ్చే ఫిలింనగర్‌లోని మహాత్మా గాంధీనగర్ బస్తీ నాలా చెత్తాచెదారంతో పాటు పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. వరద నీరు వెళ్లాల్సిన నాలాలో బురద భారీగా పేరుకుపోవడంతో వరదంతా వెనక్కి తన్నుకొచ్చి ఇళ్లల్లోకి చేరుతున్నది. ఈ నాలాలో డీసిల్టింగ్ చేపట్టినట్లు సంబంధిత అధికారులు బిల్లులు కూడా రాబట్టారని తీరా చూస్తే తూతూ మంత్రంగా పనులు చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు.

వరద సమస్యలను పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో వరద కారణంగా ఖైరతాబాద్ డివిజన్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్ విజయారెడ్డి సూచించారు. బుధవారం ఆమె అధికారులతో కలిసి స్థానికంగా పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ ఈఈ ఇందిరాబాయ్, డీఈ చైతన్య, ఏఈ చరణ్, డీజీఎం సరిత, మేనేజర్ స్వామిలతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ప్రతిసారి వర్షం కురినప్పుడల్లా స్థానికులు పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, డీసిల్టింగ్, శివరేజ్ పైప్‌లైన్ ఓవర్‌ఫ్లో కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. స్థానిక అసోసియేషన్ చైర్మన్ అనిల్, జ్ఞానేశ్వర్ యాదవ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ కోచింగ్‌కు స్కాలర్‌షిప్ పరీక్ష

చిక్కడపల్లి: ఐఏఎస్, ఐఆర్‌ఎస్ వంటి సర్వీసుల సాధనే లక్ష్యంగా ఉన్న విద్యార్థులకు హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ నుంచి అవకాశాన్ని కల్పిస్తోందని అకాడమీ డైరెక్టర్ శరత్ చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. అకాడమీ నిర్వహించే స్కాలర్ షిప్ పరీక్షరాసే మెరుగైన మార్కులు సాధించిన అభ్యర్థుల్లో ముగ్గురికి ఉచితంగా కోచింగ్, మిగిలిన వారికి 50 శాతం స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కూడా ప్రత్యేక స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సివిల్స్ ఆసక్తి ఉన్న విద్యార్థులకు చేయూతను అందిస్తామన్నారు. ఈ నెల 30న శనివారం ఉదయం 10 గంటలకు అశోక్‌నగర్‌లోని తమ ఇనిస్టిట్యూట్‌లో పరీక్ష జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పరీక్ష అనంతరం అవగాహన సదస్సు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు విద్యార్థులకు సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. సెల్ నెంబర్ 9434188688ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా కార్గిల్ దివస్



ర్యాలీలో పాల్గొన్న ఐఐఎంసీ కళాశాల విద్యార్థులు



యాత్ర నిర్వహిస్తున్న ఐఐఎంసీ విద్యార్థులు

బంజారాహిల్స్: ఎన్‌సీసీ సైఫాబాద్ సైన్స్ కాలేజీ ఆధ్వర్యంలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైఫాబాద్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరుకాగా ఎన్‌సీసీ అధికారి డాక్టర్ పల్లాటి నరేష్, క్యాడెట్లు ఘనంగా అమరజవాన్లకు నివాళులు అర్పించారు. కార్గిల్ అమరవీరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించడమే కాకుండా వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించి వారి విజయస్ఫూర్తిని గుర్తు చేసుకొని నినాదాలు, ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని రక్షణ రంగంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలన్నారు. నరేష్ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు దేశ భవిష్యత్ కోసం, రక్షణ కోసం పూర్తి పాఠాలు నేర్చుకొని ఆచరించాలని దేశ సేవలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాకులు డాక్టర్ జగదీష్, హాస్టల్ వైస్ ప్రిన్సిపాల్ ఎ.ఆర్.బాలకృష్ణతో పాటు 50 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

లక్డీకాపూల్‌లో...

పంజగుట్ట: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా లక్డీకాపూల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) ఎన్‌సీసీ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కాలేజీ నుంచి టెలిఫోన్ భవన్ మీదుగా సెక్రటేరియట్ నుంచి అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అమరవీరులను స్మరించుకుంటూ, భారత్ మాతాకీజై అంటూ నినాదాలు చేసుకుంటూ వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, పలువురికి అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రఘువీర్ మాట్లాడుతూ... దేశాన్ని కబలించేందుకు వచ్చిన శత్రువుల వెన్నులో వణకు పుట్టించేలా వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన 527 మంది జవాన్లను స్మరించుకుంటూ ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సీనియర్ అండర్ ఆఫీసర్ మన్సూర్ జావిద్, విజయానంద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎంసీ కళాశాల ఆధ్వర్యంలో 5కే ర్యాలీ

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని ఐఐఎంసీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులతో విజయ్ దివస్ 5కే ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి సచివాలయం మీదుగా 5 కిలోమీటర్ల మేర విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అమర జవానుల స్ఫూర్తితో యువత దేశ సేవలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు.

కార్మికనగర్‌లో తిరంగా మార్చ్

రహమత్‌నగర్: కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లను భారతీయులందరూ స్మరించుకోవాలని బీజేపీ నాయకురాలు జూటూరి కీర్తిరెడ్డి అన్నారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో తిరంగా మార్చ్ నిర్వహించారు. కళ్యాణ్‌నగర్ వరకు తిరంగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ... దేశం రక్షణ కోసం 73 రోజుల పాటు కొనసాగిన కార్గిల్ పోరాటంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారని, వారిని దేశ ప్రజలు ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకుంటారన్నారు. బీజేపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాజేందర్ రాథోడ్, అనూప్, మధుసూదన్, గణేష్‌గౌడ్, జ్యోతి, మల్లిగౌడ్, నవీన్, సతీష్ పాల్గొన్నారు.





తిరంగా మార్చ్‌లో పాల్గొన్న కీర్తిరెడ్డి.. కార్గిల్ దివస్‌లో పాల్గొన్న సైఫాబాద్ సైన్స్ కాలేజీ ఎన్‌సీసీ క్యాడెట్లు

అడ్డదారిలో విదేశాలకు వాహనాల రవాణా

- సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన కొటక్ మహింద్రా బ్యాంక్
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన సీసీఎస్ పోలీసులు

హిమాయత్‌నగర్: తమ వద్ద వాహనాల కోసం రుణాలు పొందిన కొందరు వ్యక్తులు వాటిని తిరిగి చెల్లించకుండా ఆ వాహనాలను విదేశాలకు రవాణా చేస్తున్నట్లు కొటక్ మహీంద్రా బ్యాంక్ హైదరాబాద్ శాఖ సీసీఎస్ పోలీసుల్ని ఆశ్రయించింది. లీగల్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా, కల్వకుర్తికి చెందిన కుపునూరి పరశురాములు, కొండకాల రాజశేఖర్, కోపునూరి శాంతి, కొండకాల జంగయ్య, కొండకాల ఇంద్రమ్మలు కొటక్ మహేంద్ర బ్యాంక్‌కు వాణిజ్య పరమైన సామగ్రి, వాహనాలు కొనేందుకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిచ్చిన డాక్యుమెంట్లను పరిశీలించిన తరువాత రుణాలు మంజూరు చేయడంతో ఆయా వస్తువులను వారు కొనుగోలు చేశారు. ఆయా వస్తువులపై బ్యాంకు హైపోతికేషన్ ఉంది. రుణాలు పొంది, వస్తువులు చేతికొచ్చిన తరువాత బ్యాంకు వాయిదాలు సరిగా చెల్లించలేదు. దీంతో రుణాలు చెల్లించాలని రుణగ్రస్తులైన ఐదుగురికి బ్యాంకు సూచనలు చేసింది. హైపోతికేషన్‌లో ఉన్న వాహనాలు, ఇతర సామాగ్రిని పరిశీలించేందుకు బ్యాంకు అధికారులు ప్రయత్నించగా అవన్నీ అప్పటికే ఈ ముఠా ఇతరులకు విక్రయించినట్లు తెలిసింది. మన దేశంలో రుణాలు పొంది, విదేశాలకు ఆయా వస్తువులను అక్రమ పద్ధతిలో ఎగుమతి చేస్తున్నట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా...

ఐఎంఏ సైంటిఫిక్ కమిటీ కన్వీనర్‌గా డా.కిరణ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర సైంటిఫిక్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ కిరణ్ మాదల నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్‌గా డాక్టర్ డీసీ తిరుపతిరావు, కో చైర్మన్‌గా డాక్టర్ శ్రీరంగ్ అబ్కారీ, సభ్యులుగా డాక్టర్లు శశికళారెడ్డి, రామనర్సింహారెడ్డి, ఎంఎస్ఎస్ ముఖర్జీ, టి.సుబ్రమణ్యేశ్వరరావు, పి.దత్తాత్రేయ, పవన్‌కుమార్, చిన్మయి రాత, ఎంవీ రావు, శ్రీభూషణ్ రాజు ఉన్నారు.

5 నుంచి రాష్ట్ర పీజీ మెడికల్ కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 5వ తేదీ నుంచి మొదటి విడత రాష్ట్రస్థాయి కోటా మెడికల్ పీజీ (ఎండీ, ఎంఎస్, డిప్లొమా, ఎండీఎస్, పీజీ డీఎన్‌బీ) సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు ఆగస్టు 16 వరకు కౌన్సెలింగ్ జరుగనుంది. ఇందులో సీట్లు పొందినవారు 20, 21 తేదీల్లో చేరాలి. ఇక రెండో విడత కౌన్సెలింగ్ వచ్చే నెల 25 నుంచి సెప్టెంబర్ 6 వరకు నిర్వహించనున్నారు. వాటిల్లో సీట్లు పొందినవారు సెప్టెంబర్ 11, 12వ తేదీల్లో చేరాలి. ఇక మూడో విడత కౌన్సెలింగ్ సెప్టెంబర్ 16 నుంచి 26వ వరకు జరగనుంది. అందులో సీట్లు పొందినవారు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ మధ్య చేరాలి. స్ట్రే వేకెన్సీ (తుది విడత) కౌన్సెలింగ్ అక్టోబర్ 1 నుంచి పదో తేదీ వరకు జరుగుతుంది. అందులో సీట్లు పొందినవారు పదో తేదీనే చేరాల్సి ఉంటుంది. తరగతులు సెప్టెంబర్ 5 నుంచే జరుగుతాయని ఎన్ఎంసీ తెలిపింది.

ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓయూ పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ. పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు osmania.ac.inలో చూడవచ్చని వివరించారు.

ఏఎన్ఎం పోస్టులు 1520

భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలో ఏఎన్ఎం (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్–ఫిమేల్) పోస్టుల భర్తీకి ప్రకటన జారీ అయ్యింది. మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్యకార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు సమర్పించాలి. రాతపరీక్ష ఇంగ్లిష్‌లో ఉంటుంది. పేస్కేల్ రూ. 31,040 నుంచి రూ.92,050 మధ్య ఉంటుంది. బహుళ ఐచ్ఛిక ఎంపిక విధానంలో రాతపరీక్ష ప్రాతిపదికన ఓఎంఆర్ లేదా కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అయితే ఈ రెండు పద్ధతుల్లో ఏ విధంగా పరీక్ష నిర్వహిస్తారన్న దానిపై త్వరలో వెల్లడిస్తామని గోపీకాంత్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు రుసుము రూ. 500, ప్రాసెసింగ్ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్ తదితర కేటగిరీలకు మినహాయింపు ఉంటుంది.

మొత్తం పోస్టులు: 1520 (ఫిమేల్)
దరఖాస్తులు స్వీకరణ: వచ్చేనెల 25న ఉదయం 10:30 నుంచి
దరఖాస్తులకు చివరి తేదీ : సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం 5:30 వరకు
పరీక్ష కేంద్రాలు : హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్

ఇవీ అర్హతలు:

- అభ్యర్థులు తప్పనిసరిగా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) ట్రైనింగ్ కోర్సు చేసి ఉండాలి. లేదా ఇంటర్‌లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) శిక్షణ కోర్సు పాసై ఉండాలి.
- తెలంగాణ రాష్ట్ర నర్సెస్ అండ్ మిడ్ వైఫ్స్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి.
- నిర్ధారించిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాదిపాటు క్లినికల్ ట్రైనింగ్ చేసి ఉండాలి. లేదా గుర్తించిన ఆస్పత్రుల్లో ఏడాది అప్రెంటిషిప్ పూర్తి చేసి ఉండాలి. వారు తెలంగాణ పారామెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. ఎవరైనా అభ్యర్థి ఈ అర్హతలకు సమానమైన ఇతర అర్హతలను కలిగి ఉంటే, ఆ విషయాన్ని బోర్డు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి రిఫర్ చేస్తారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుంది.
- దరఖాస్తుదారులు 18 – 44 ఏళ్ల మధ్యలో ఉండాలి. వివిధ వర్గాలకు సంబంధించి వారికి ప్రభుత్వం నిర్ణయించిన



వయోపరిమితి సడలింపులు వర్తిస్తాయి.

- పరీక్షలో మార్కులకు గరిష్ఠంగా 80 పాయింట్లు ఉంటాయి. వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన/చేస్తున్న వారికి గరిష్ఠంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇస్తారు.
- గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించినవారికి ప్రతి 6 నెలలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు.
- కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ అనుభవమున్న వారు ధ్రువీకరణపత్రాన్ని పొందిన తర్వాత ఆ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.
- కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ ఏ సేవలు అందించి ఉంటే, ఆ కేటగిరీ పోస్టులకు మాత్రమే పాయింట్లు వర్తింపజేస్తారు.

అప్‌లోడ్ చేయాల్సినవి :

అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాలు నమోదు చేయడంతోపాటు అవసరమైన పత్రాల సాఫ్ట్ కాపీ (పీడీఎఫ్)లను అప్‌లోడ్ చేయాలి. ఆధార్ కార్డ్, పదోతరగతి సర్టిఫికెట్, అర్హత సాధించిన కోర్సులకు చెందిన సర్టిఫికెట్లు ఉండాలి. అనుభవ ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), స్థానికత గుర్తింపు కోసం 1 నుంచి 7వ తరగతి వరకు చదివిన సర్టిఫికెట్లు లేదా నివాస ధ్రువీకరణపత్రం, ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే కులధ్రువీకరణ పత్రం, బీసీల విషయంలో తాజా నాన్–క్రీమీలేయర్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోరేవారు తాజా ఆదాయం, ఆస్తి సర్టిఫికెట్, స్పోర్ట్స్ సర్టిఫికెట్, సదరం నుంచి దివ్యాంగ సర్టిఫికెట్, ఎన్‌సీసీ ధ్రువీకరణపత్రం వంటివి అవసరాన్ని బట్టి జత చేయాల్సి ఉంటుంది.

జోన్లవారీగా స్థానికులకు 95 శాతం రిజర్వేషన్

ఏఎన్ఎం పోస్టులను జోన్లవారీగా భర్తీ చేస్తారు. ఆయా జోన్ల అభ్యర్థులకే 95% పోస్టులు కేటాయిస్తారు. మిగతావి ఓపెన్ కేటగిరీలో భర్తీ చేస్తారు.

- జోన్–1 (కాళేశ్వరం)లో ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి,ములుగు జిల్లాలు.
- జోన్–2 (బాసర)లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల
- జోన్–3 (రాజన్న)లో కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి
- జోన్–4 (భద్రాద్రి)లో కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్
- జోన్–5(యాదాద్రి)లో సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి, జనగాం
- జోన్–6(చార్మినార్)లో మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్
- జోన్–7(జోగులాంబ)లో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ–గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలున్నాయి.

వివిధ జోన్లు, కేటగిరీల వారీగా పోస్టుల వివరాల పట్టిక...

కేటగిరీ	జోన్–1	జోన్–2	జోన్–3	జోన్–4	జోన్–5	జోన్–6	జోన్–7	మొత్తం
ఓసీ	49	68	78	72	71	56	57	451
ఈడబ్ల్యూఎస్	18	23	27	24	25	19	21	157
బీసీ–ఏ	14	16	20	17	19	14	13	113
బీసీ–బీ	15	21	25	23	23	18	21	146
బీసీ–సీ	2	3	2	3	2	2	1	15
బీసీ–డీ	12	15	19	16	16	14	13	105
బీసీ–ఈ	7	9	11	9	10	8	7	61
ఎస్సీ	25	33	38	35	35	27	29	222
ఎస్టీ	17	23	27	24	25	20	21	157
స్పోర్ట్స్	3	4	5	4	5	3	4	28
ఓహెచ్	7	10	11	10	10	8	9	65
మొత్తం	169	225	263	237	241	189	196	1520

ఓహెచ్: ఆర్థోపెడిక్ హ్యాండిక్యాప్

‘పల్లెవెలుగు’లో మరో రాయితీ టికెట్

30 కి.మీ. పరిధిలో రూ.50కే రానుపోను సదుపాయం

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ఆటోల్లో వెళ్లే ప్రయాణికులను బస్సుల వైపు మళ్లించేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కొత్తగా పల్లె వెలుగు బస్సుల్లో 30 కి.మీ. దూరం ప్రయాణించే వారికి రాయితీ టికెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. కొద్ది రోజుల క్రితం సంస్థ టీ9–60 పేరుతో పల్లెవెలుగు బస్సుల్లో 60 కి.మీ. పరిధిలో తిరిగే ప్రయాణికులకు రూ.100కే రానుపోను రాయితీ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దానికి స్పందన తక్కువగా ఉండటంతో, ఇప్పుడు టీ9–30 పేరుతో 30 కి.మీ. పరిధిలో తిరిగే వారికి రూ.50కే రానుపోను వర్తించేలా రాయితీ టికెట్‌ను ప్రారంభించింది. ఈ టికెట్లు గురువారం నుంచి కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

ఆటోల్లో ప్రయాణించేవారిపై గురి..

చాలా ప్రాంతాల్లో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పల్లెవెలుగు బస్సు టికెట్‌పై రాయితీ ప్రకటిస్తే వారిలో కొందరైనా బస్సులెక్కుతారని ఆర్టీసీ భావిస్తోంది. ప్రస్తుతం పల్లెవెలుగు బస్సుల్లో 30 కి.మీ. నిడివిలో ప్రయాణించే వారి సంఖ్య దాదాపు మూడున్నర లక్షలుగా ఉంది. అంతకు రెట్టింపు జనం అదే పరిధిలో ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా తెచ్చిన రాయితీ టికెట్ తీసుకుంటే.. రూ.50తో గమ్యం వెళ్లితిరిగి రావచ్చు. దానికి అదనంగా రూ.20 చెల్లించి కాంబి టికెట్ తీసుకుంటే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా అదే టికెట్‌తో రాను, పోనూ ప్రయాణించవచ్చు. కొద్ది రోజుల క్రితం 60 కి.మీ. నిడివిలో ప్రయాణించేవారికోసం రూ.100కే రానుపోను టికెట్ తీసుకురాగా, 60 కి.మీ. పరిధిలో తిరిగే ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో దానికి పెద్దగా స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో చాలా మంది డిపో మేనేజర్లు కోరటంతో కొత్త విధానం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ఈ టికెట్ చెల్లుబాటులో ఉంటుంది. సాయంత్రం 6 వరకు టికెట్ల జారీ ఉంటుంది. 30 కి.మీ. పరిధిలో పొరుగు రాష్ట్రంలో ప్రయాణం ఉంటే.. అక్కడ కూడా ఇది చెల్లుబాటు (టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనే) అవుతుందని అధికారులు ప్రకటించారు. ఈ కొత్త టికెట్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం బస్‌భవన్‌లో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, ఎండీ సజ్జనార్‌లు ఆవిష్కరించారు.

ఎంబీబీఎస్ అర్హుల జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హుల జాబితాను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. కన్వీనర్ కోటా సీట్ల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం ఈ జాబితాను విడుదల చేసినట్లు కాళోజీ వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం 22,167 మంది అర్హత సాధించారని వర్సిటీ తెలిపింది. అర్హత జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 29న సాయంత్రం 4 గంటల్లోపు knrugadmission@gmail.comకు తెలియజేయాలని సూచించింది. కాగా, వెబ్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ అనంతరం వీరు తమకు ఇష్టమైన కాలేజీలను ఎంపిక చేసుకోవచ్చని, వారికి వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు వెల్లడించింది.

‘ఓఆర్ఆర్ లీజు’ సమాచారం ఇవ్వడం లేదు

- గత నెల 14న దరఖాస్తు చేసినా అధికారులు స్పందించడంలేదు
- హైకోర్టులో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిటిషన్



సాక్షి, హైదరాబాద్: నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) టోల్ నిర్వహణ బదిలీ (టీవోటీ)కి సంబంధించిన సమాచారాన్ని, సమాచార హక్కు చట్ట ప్రకారం కోరినా అధికారులు ఇవ్వడం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 14న దరఖాస్తు చేసినా ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అధికారుల తీరు ఆర్టీఐ చట్టంతో పాటు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను కూడా ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. తాను మే 1న తొలిసారి దరఖాస్తు చేయగా, మే 23న అరకొర సమాచారం మాత్రమే ఇచ్చారని వివరించారు. దీంతో జూన్ 14న మరోసారి దరఖాస్తు చేశానన్నారు. ఓఆర్ఆర్ లీజు నివేదికలు, 30 ఏళ్లకు ఇవ్వడంపై మంత్రిమండలి నిర్ణయం, 2021–22, 2022–23 సంవత్సరాలలో ఆర్జించిన మొత్తం ఆదాయానికి సంబంధించి సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. లీజు పారదర్శకంగా జరిగిందా? లేదా? తెలుసుకోవడానికి ఈ సమాచారం కీలకం అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ), హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ప్రజా సంబంధాల అధికారి, ఎండీ(ఎఫ్ఏసీ)లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టం ప్రకారం కోరిన సమాచారం ఇచ్చేలా ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్ నేడు లేదా రేపు విచారణకు రానుంది. ఓఆర్ఆర్ నిర్వహణ, టోలు వసూలు బాధ్యతలను 30 ఏళ్ల పాటు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్, ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్‌లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

నగర వార్తలు

ముషీరాబాద్ స్కూల్‌ను పరిశీలించిన డీఈఓ



సాక్షి ఎఫెక్ట్..

ముషీరాబాద్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం నీటితో నిండిపోయింది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యార్థులు నడిచేందుకు వీలుగా బండలను ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రాంగణంలో చేరిన వర్షపు నీరు, విద్యార్థుల ఇబ్బందులపై ‘సాక్షి’లో బుధవారం ప్రచురితమైన ఫొటో కథనంపై జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి స్పందించారు. అంతకు ముందే జీహెచ్ఎంసీ సర్కిల్–15 డివిజన్ ఇంజినీర్ సన్నీ సిబ్బందితో వచ్చి పాఠశాల ప్రాంగణంలో నీటిని తొలగించారు. ఆ తరువాత రోహిణి పాఠశాల ప్రాంగణానికి చేరుకొని పరిశీలించారు. డిఈ సంజీవరావు, డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి, ముషీరాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌యాదవ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాబేర్, స్కూల్ అడ్మిన్ రత్నం తదితరులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల దుస్థితిపై రోహిణి మాట్లాడుతూ... ప్రస్తుతం పాఠశాల ఆవరణలో నూతన స్కూల్ బిల్డింగ్ నిర్మాణ పనులు జరుగుతున్నందున నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి నిర్మాణ ఖర్చులకు కావాల్సిన నిధులను విడుదలకు కృషి చేస్తానని పేర్కొన్నారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు ప్రత్యేక పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఇంకుడు గుంతలను కూడా ఏర్పాటు చేయాలన్నారు.

నాలాలు, వరద నీటి కాలువల శుభ్రతపై దృష్టి సారించాలి

- మురుగు, వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా పటిష్ట చర్యలు అవసరం
- వర్షపు నీరు భూమిలో ఇంకేలా చూడాలి
- అన్ని విభాగాలు సమష్టిగా పనులు చేయాలి
- ‘ఎస్కీ’లో పలువురు నిపుణుల అభిప్రాయం



రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు ఇతర నిపుణులు

రాయదుర్గం: పట్టణ ప్రాంతాల్లో నిత్యం నాలాలు, వరద నీటి కాలువలను శుభ్రం చేసే అంశంపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి చారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఫ్లడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ‘ఫ్లడ్ రిస్క్ మిటిగేషన్ అండ్ మేనేజ్‌మెంట్’ అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిపుణులు మాట్లాడుతూ... ప్రస్తుతం పట్టణ ప్రాంతాలు కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్నాయని, ఈ నేపథ్యంలో రోడ్లపైకి మురుగునీరు, వర్షపునీరు రాకుండా శాశ్వత ప్రాతిపదికన నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని చాలా వరకు భూమిలో ఇంకేలా చర్యలు తీసుకోవాలని కూడా పేర్కొన్నారు. అన్ని విభాగాల వారు సమష్టిగా చర్యలు చేపడితే దాదాపు అన్ని సమస్యలు తీరేందుకు అవకాశం ఉంటుందన్నారు. తరచూ రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదికలిస్తే వాటిని ప్రభుత్వాలు అమలు చేస్తే చాలా వరకు సమస్యలు తీరేందుకు ఆస్కారం ఉందన్నారు. ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కరుణాగోపాల్, రీ సస్టేనబిలిటీ లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ పి.జి.శాస్త్రి, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ కె.కిషన్, జేఎన్‌టీయూఏ వాటర్ రిసోర్సెస్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.గిరిధర్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గోపాల్‌నాయక్, సిటీ ట్రాఫిక్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.నర్సింగ్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని మాదిగ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ... రాత్రికి రాత్రి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం గడచిన మూడు దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి స్పందించకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని విమర్శించారు. ఇకనైనా ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి మాదిగ, ఉపకులాలకు 12 శాతం కేటాయించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో మాదిగ సామాజిక వర్గాలకు 15 సీట్లు కేటాయించాలని కోరారు. దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై రోజు రోజుకు దాడులు పెరుగుతున్నాయన్నారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న దురాగతాలే నిదర్శనమన్నారు. మాదిగ మేధావుల ఫోరం సలహాదారులు పల్లెల వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ వి.నతానియల్, కోశాధికారి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు బి.ఆనంద్, ఎం.నర్సయ్య, వళపాక నర్సింహ్మా, పవన్‌కుమార్, ప్రొఫెసర్ అంజయ్య, ఆరెపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే ఉప్పల్–వరంగల్ ‘కారిడార్’ నిర్మాణం

- రెండు రోజుల్లో పనులు పునఃప్రారంభం
- మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్



ఉప్పల్: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతోనే ఉప్పల్–వరంగల్ జాతీయ రహదారి (ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్) పనులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. నిర్మాణ పనులు పనులు 28 నుంచి పునఃప్రారంభం అవుతాయని ఆయన వెల్లడించారు. ఉప్పల్ స్కైఓవర్ నిర్మాణ పనులలో జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వ సహాయ నిరాకరణ వల్లే జాప్యం జరుగుతుండటాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తాను కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. యుద్ధ ప్రాతిపదిక ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయాలని కోరామన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి జులై 24న అవసరమైన నిధుల విడుదలకు అనుమతి మంజూరు చేశానారన్నారు. ఈ నెల 28 నుంచి పనులను ప్రారంభించాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారని ప్రభాకర్ వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సీఎం కేసీఆర్ వెంటనే తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ద్వారా రోడ్డుకు ఇరువైపులా బీటీ రోడ్డు వేస్తామని ప్రకటన చేయించారని ఎద్దేవాచేశారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వమే జోక్యం చేసుకుని రోడ్డు వేయిస్తుందనే విషయాన్ని ప్రజలు గమనించాలని ఈ సందర్భంగా ఎన్‌వీఎస్ఎస్ కోరారు. దాన్ని మేమే వేస్తున్నామన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం కపట నాటకానికి తెర తీసిందని ఆయన విమర్శించారు.

ఐటీల లాగవుట్ ఇలా..

వర్షాల నేపథ్యంలో ఆగస్టు 1వతేదీ వరకు.. సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు

రాయదుర్గం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా సైబరాబాద్ పోలీసులు చర్యలు ప్రారంభించారు. గత వారం రోజులుగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడగా పోలీసుల జోక్యంతో తీరాయి. దీంతో అన్ని సంస్థలు లాగవుట్ సమయాలు పాటిస్తే చాలా వరకు సమస్యలు తీరే అవకాశం ఉంటుందని ప్రయోగాత్మకంగా సమయాలు నిర్ణయించారు.

ఫేజ్–1 లాగవుట్ సమయం

- మధ్యాహ్నం 3.. ఐకియా నుంచి సైబర్ టవర్ రోడ్డు
- రహేజా మైండ్‌స్పేస్‌లోని అన్ని సంస్థలు, టీసీఎస్, హెచ్ఎస్‌బీసీ, డెల్, ఫోనిక్స్ (మాదాపూర్/కొండాపూర్), ఒరాకిల్, క్వాల్‌కామ్, టెక్ మహేంద్రా, పూర్వా సమ్మిట్, వాటర్‌మార్క్, ఇతర ఐటీ సంస్థలు, ఐటీ పార్కులకు

ఫేజ్–2 :

- 4.30 గంటలకు బయోడైవర్సిటీ, రాయదుర్గం పరిసరాలు, మీనాక్షి ప్రాంతం....
- హైదరాబాద్ నాలెడ్జిసిటీ, పార్కులోని అన్ని సంస్థలు, టీహబ్, గ్యాలక్సీ, ఎల్‌టీఐ, ట్విట్జా, కామర్‌జోన్‌లోని సంస్థలు, ఆర్ఎంజెడ్ నెగ్జిటీలోని సంస్థలు, స్కైవ్యూ భవనంలోని సంస్థలు, దివ్యశ్రీ ఒరియన్‌లోని సంస్థలు, అసెండస్, ఇతర కంపెనీలు, ఐటీ పార్కులలోని సంస్థలు పాటించాలి

ఫేజ్–3 :

- 6 గంటలకు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్/ గచ్చిబౌలి
- మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, విప్రో, సెంటురస్, బ్రాడ్‌వే ,వర్చుషా, బీఎస్ఆర్ ఐటీ పార్కులోని సంస్థలు, ఐసీఐసీఐ, వేవ్‌రాక్‌లోని సంస్థలు, అమెజాన్, హనీవెల హిటాచీ, సత్వా క్యాపిటల్, క్యాప్ జెమినీ, జీఏఆర్‌లోని అన్ని సంస్థలు, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, క్యూసిటీలోని సంస్థలు, డీఎల్ఎఫ్‌లోని సంస్థలు, ఐటీ పార్కులోని సంస్థలు పాటించాలి

ఐఐటీ, ఐఐఎంల్లోని బీసీ విద్యార్థులకు...
పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై హర్షం

- ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకూ వర్తింపజేయాలి
- బీసీ సంక్షేమ సంఘం నేతలు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ, ఐఐఎంలో చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ప్రకటించడాన్ని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లపల్లి అంజి హర్షం వ్యక్తం చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ వంటి వృత్తి విద్యా కోర్సులు చదివే సుమారు ఐదున్నర లక్షల విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల వృత్తి విద్యా కోర్సులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందిస్తున్నారని గుర్తుచేశారు. ఇక్కడ మాత్రం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించకపోగా కోట్ల రూపాయల బకాయిలు ఉండటంతో విద్యార్థులను కళాశాలల యాజమాన్యం విద్యాభ్యాసం పూర్తయినా సర్టిఫికెట్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ అడ్మిషన్ ఇవ్వాలని, అవసరమైతే అదనపు సెక్షన్‌లు తెరవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మెస్ చార్జీలను రూ. 1575 నుంచి రూ. 2500లకు పెంచాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్యను 300 మందికి మాత్రమే ఎందుకు కుదించారని ప్రశ్నించారు.

బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐఐటీ, ఐఐఎం చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంసీఏ చదివే విద్యార్థులకు ఎందుకు నిరాకరిస్తుందని ఇది సవతి తల్లి ప్రేమ కాదా అని ప్రశ్నించారు. బీసీ హాస్టల్స్‌కు ఒక్క సొంత భవనం కూడా లేదని అద్దెలకు మాత్రం కోట్లాది రూపాయలు చెల్లిస్తూ అధికారులు మధ్య దళారుల పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మిల్లెట్స్ రెస్టారెంట్



శంషాబాద్: విమాన ప్రయాణికులకు మిల్లెట్స్ (చిరుధాన్యాల) వంటకాల రుచులు అందుబాటులోకి వచ్చాయి. ఐఐఎంఆర్, న్యూట్రిహబ్ కలిసి మిల్లెట్స్ మార్వెల్ సంస్థ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో తన రెస్టారెంట్‌ను బుధవారం ప్రారంభించింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐసీఏఆర్‌లోని ఐఐఎంఆర్ డైరెక్టర్ తారా సత్యవతి, న్యూట్రిహబ్ సీఈఓ దయాకర్‌రావు, మిల్లెట్ మార్వెల్ సంస్థ ఎండీ భరత్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మిల్లెట్స్ మార్వెల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రిషికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక ఉద్యోగంలో ఎవరైనా ఎన్ని గంటలు పని చేస్తారు?
8 గంటలు.
మరి గృహిణి?
24 గంటలు.
ఆ అనుభవం ఎక్కువా? ఈ అనుభవం ఎక్కువా?



ఎక్స్‌పీరియన్స్ ఉందా?

...ఆ గృహిణిగా బోలెడంత!

సీట్లో కూచుని చేసే ఉద్యోగం అనుకోండి... గృహిణికి ఇల్లే కదా సీటు. ఆ సీటు వదులుతుందా ఆమె. అందులోనే కూచుని అన్ని పనులూ చక్కబెడుతుంది. పిల్లలూ, వంట, బట్టలుతకడం, అత్తామామలను చూసుకోవడం, బంధువులొస్తే చేసి పెట్టడం.... సరే. బయట తిరిగి చేయాల్సిన ఉద్యోగం అనుకోండి. గృహిణి ఏమన్నా ఇంట్లో కూచుంటుందా ఏం? బయటే కదా తిరగాలి. పిల్లల్ని స్కూల్లో వదలడానికి, కూరగాయలు తేవడానికి, కరెంటు బిల్లు కట్టడానికి, సరుకుల కోసం, ఇంట్లో ఉండే పెద్దవాళ్లను ఆస్పత్రికి తీసుకెళ్లడానికి, మందులకూ మాకులకూ... తిరగాల్సిందే కదా.

ఉద్యోగంలో నీకు అనుభవం ఉందా అనంటే ఆఫీసులో చేసిన ఉద్యోగానిది మాత్రమే అనుభవమా... గృహిణిగా ఉండి చేసింది అనుభవం కాదా? ఈ ప్రశ్నే వేసింది ఒక గృహిణి.

అసలేం జరిగింది

సాధారణంగా కొత్త జాబ్ వెతుక్కోవాలంటే సి.వి (రెజ్యూమె)ని పక్కాగా రెడీ చేసుకోవాలి. విద్యార్హతలు, నైపుణ్యాలతోపాటు అనుభవం తప్పనిసరిగా చెప్పాలి. ఉద్యోగం మానేసి మధ్యలో గ్యాప్ ఉంటే ఆ సమయంలో ఏం చేశామో కూడా సదరు కంపెనీకి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం చాలామంది రకరకాల కారణాలను చూపిస్తుంటారు. కానీ ఇప్పుడు మనం చెప్పుకుంటోన్న ఓ మహిళ మాత్రం గతంలో ఉద్యోగం చేసి మానేసి తిరిగి ఉద్యోగానికి అప్లయి చేస్తూ గ్యాప్‌లో 13 ఏళ్లపాటు గృహిణిగా పని చేసానని రెజ్యూమెను అప్‌లోడ్ చేసింది. గ్రౌతిక్ అనే కంటెంట్ కంపెనీ వ్యవస్థాపకుడు యుగన్ష్ చోక్రా ఆమె సి.వి.ని చూసి మురిసి పోయాడు. ఈమె ఎంతో నిజాయితీగా గృహిణిగా పని చేశానని చెబుతోంది అని ప్రశంసిస్తూ సి.వి.ని లింక్డ్ ఇన్‌లో పోస్టు చేశారు.

ఈ పోస్టుప్రకారం...

ఓ మహిళ గతంలో ఉద్యోగం చేసి 2009లో ఇంటి అవసరాల నిమిత్తం మానేసింది. ఇప్పుడు కాస్త వెసులుబాటు దొరకడంలో మళ్లీ చేసేందుకు రెడీ అయ్యింది. తన రెజ్యూమెని తయారు చేసింది. అందులో గ్యాప్‌లో ఏం చేశావ్? అనే ప్రశ్నకు పదమూడేళ్లపాటు గృహిణిగా చేశానని చెప్పింది. 'గృహిణి అంటే ఫుల్‌టైమ్ జాబ్. సి.వి.లో దానిని ప్రత్యేకంగా చెప్పడం చాలా మంచి విషయం. ఎంతో మంది గ్యాప్‌లో ఏం చేశారంటే అక్కడ ఇక్కడ ఉద్యోగాలు చేశామని ఫేక్ ఎక్స్‌పీరియన్స్‌లు పెడుతుంటారు. కానీ ఈమె చాలా నిజాయితీగా చెప్పి తన వ్యక్తిత్వమేమిటో చెప్పకనే చెప్పింది' అని చోక్రా ప్రశంసించారు. ఈ పోస్టును చూసిన నెటిజన్లు ఆమెను అభినందనల్లో ముంచెత్తుతున్నారు.

ఇదో మేలుకొలుపు

ఈ పోస్టు ఎంతో మంది మహిళలకు, కంపెనీలకు మేలుకొలుపులాంటిది. నిజానికి గృహిణిగా ఉండటానికి ఏ ఉద్యోగి అయినా గ్యాప్ తీసుకుంటే ఆమెకు అదొక ప్రత్యేక అర్హతగా భావించి ప్రత్యేక రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగం ఇచ్చే విషయాన్ని కూడా పరిశీలిస్తే తప్పు లేదు. కారణం? గృహిణిగా స్త్రీ ఇంటిని, తద్వారా సమాజాన్ని నిలబెడుతుంది. పిల్లలను ఆరోగ్యకరంగా పెంచి మంచి పౌరులుగా సమాజానికి ఇస్తుంది. భర్త ఇంటి టెన్షన్లలో మునగకుండా పని మీద శ్రద్ధ పెట్టి మంచిగా పని చేసి వ్యవస్థ ముందుకెళ్లడంలో సాయపడుతుంది. ఇన్ని చేసిన స్త్రీ– తనకు వెసులుబాటు దొరికి ఉద్యోగం చేస్తానంటే పిలిచి ఉద్యోగం ఇవ్వాల్సిన బాధ్యత కంపెనీలకు ఉంటుంది. అలాంటి స్త్రీలను ప్రోత్సహించాల్సిన బాధ్యత సమాజానికుంటుంది. హోం మేకర్‌గా ఇక జీవితం అయిపోయింది అనుకోకుండా అదే ఒక అర్హతగా ఉద్యోగం వెతుక్కోవచ్చని ఈ పోస్టు భరోసా ఇస్తోంది. ఇంకెందుకు ఆలస్యం... గృహిణి అని చెప్పుకోవడానికి సిగ్గుపడకుండా ధైర్యంగా ఉద్యోగాలు వెతుక్కోండి మహిళలూ.

ప్లాస్టిక్ మనీ!





ఈ హోటల్‌లో ఏదైనా ఆర్డర్ ఇవ్వండి.. కడుపు నిండా తినండి. ఒక్క రూపాయి కూడా ఇవ్వద్దు! అవును మీరు కరెక్ట్‌గానే చదివారు. తిన్నంత తిని డబ్బులు వద్దు అంటున్నారు అని సంతోషపడిపోకండి! ఎందుకంటే డబ్బులకు బదులు ప్లాస్టిక్ ఇవ్వాలండోయ్.

ప్లాస్టిక్‌పై నిషేధం విధించినప్పటికీ... ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ప్రభుత్వ అధికారులు వివిధ రకాలుగా ప్రయత్నిస్తున్నారు. అయినా ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గడంలేదు. ఈ సమస్యను అధిగమించేందుకు... గుజరాత్‌లోని జునాఘడ్‌కు కలెక్టర్‌గా పనిచేస్తోన్న రచిత్ రాజ్ 'ప్రకృతి' పేరిట సరికొత్త కాన్సెప్ట్‌తో ప్లాస్టిక్ కేఫ్‌ను గతేడాది జూన్ ముప్పైన ప్రారంభించారు. ఈ కేఫ్‌ను ఓం శాంతి అనే సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌నకు చెందిన రేఖా బెన్ నడిపిస్తోంది. ఇది సోంపు, నిమ్మకాయ షర్బత్, ఇడ్లీ, పోహా, డోక్లా, మేథీ థెప్లా, గుజరాతీ థాళీలను అందిస్తోంది. వీటిలో ద్రవాహారం కావాలంటే అరకేజీ, ఆహార పదార్థాలు కావాలంటే కేజీ ప్లాస్టిక్ ఇస్తే సరిపోతుంది. పర్యావరణాన్ని కాపాడుకోవాలన్న ఆకాంక్ష ఉన్న కస్టమర్లు ఈ కేఫ్‌కు ఎగబడి వస్తున్నారు. తరచు వచ్చే కస్టమర్లతో పాటు, పబ్లిక్ హాలిడేస్‌లో కస్టమర్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కేఫ్ లోనేగాక ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌లలో సైతం కేఫ్ ఆర్డర్లు అందిస్తోంది.



ప్లాస్టిక్ తీసుకుంటున్న సిబ్బంది

ప్లాస్టిక్ మనీతో...

ప్లాస్టిక్‌ను ఎన్నిసార్లు నిషేధించినప్పటికీ... ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గడం లేదు. దీనిని కచ్చితంగా అమలు చేసేందుకు రచిత్ రాజ్ టీమ్ ప్లాస్టిక్ మనీ కేఫ్‌ను ప్రారంభించింది. ప్లాస్టిక్ వాడకంపై ఆసక్తి తగ్గించి, ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించడం, రసాయన ఎరువులు వాడకుండా పండించిన ఆహారాన్నే ప్రజలకు అందించడం , సెల్ఫ్‌హెల్ప్ గ్రూపు మహిళలతో వీటిని నిర్వహించడమే లక్ష్యంతో ప్లాస్టిక్‌మనీతో ఈ కేఫ్‌ను నడిపిస్తున్నారు.

ఆదాయం... ఆరోగ్యం....

డబ్బులకు బదులుగా తీసుకునే ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్‌కు పంపించి కాలుష్యాన్ని తగ్గిస్తున్నారు. సహజసిద్ధ ఎరువులతో పండించిన ఆహారం అందించి ఆరోగ్యం కాపాడుతూ, రసాయనాలు లేని పంటలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల ద్వారా ఈ కేఫ్‌లను నడిపించి వారికి ఉపాధి కల్పిస్తున్నారు. కేఫ్‌లో ఆహార పదార్థాలను మట్టి పాత్రల్లో వడ్డిస్తూ ఇటు ప్రజల ఆరోగ్యంతోపాటు, అటు పర్యావరణాన్నీ పరిరక్షిస్తున్నారు.

ఇలాంటి కేఫ్‌లు మరిన్ని ఏర్పాటైతే ప్లాస్టిక్ భూతాన్ని సులభంగా వదిలించుకోవచ్చు అంటున్నారు ఈ కేఫ్‌ను ప్రశంసిస్తున్నవారు.

బ్యూటిప్స్

బొట్టు మచ్చ ఉందా?



బొట్టుబిళ్ల పెట్టుకునే ప్రదేశంలో కొన్నిసార్లు దురద, దద్దుర్లు, వాపు, మచ్చలు ఏర్పడుతుంటాయి. బొట్టుపెట్టుకునే ప్రదేశంలో చర్మం పొడిబారడం వల్ల ఇటువంటి సమస్యలు తలెత్తుతాయి. వీటిని అధిగమించేందుకు ఇలా చేయండి చాలు...

మాయిశ్చరైజర్ : బొట్టుబిళ్ల తీయకుండా అదేపనిగా ఉంచడం వల్ల చర్మం పొడిబారి దురద వస్తుంటుంది. ఇలాంటప్పుడు రాత్రి పడుకునే ముందు బొట్టుబిళ్లను తీసి మాయిశ్చరైజర్ రాసి మర్దన చేయాలి. ఇది పొడిబారిన చర్మానికి తేమనందించి దురదను తగ్గిస్తుంది.



నూనె: రోజూ రెండు నిమిషాలపాటు కొబ్బరి లేదా నువ్వుల నూనె రాసి మర్దన చేయాలి. దీనివల్ల చర్మానికి తేమ అంది మచ్చ పడకుండా ఉంటుంది.

జెల్ : అలోవెరా జెల్‌ను రాసి మర్దన చేయడం వల్ల అక్కడ ఏర్పడే దద్దుర్లు, మొటిమలు పోతాయి. అలోవెరా జెల్‌లోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ సెప్టిక్ గుణాలు చర్మాన్ని దురద, దద్దుర్ల నుంచి రక్షణ కల్పిస్తాయి.



గ్లూ తక్కువగా : బొట్టు బిళ్లలను ఎంపిక చేసేటప్పుడు గ్లూ, గమ్ తక్కువగా ఉండే వాటినే ఎంచుకోవాలి. రాత్రి పడుకునే ముందు బొట్టుబిళ్లను తీసేసి మాయిశ్చర్ రాసుకుని పడుకోవాలి. ఉదయం బొట్టు బిళ్ల పెట్టుకుంటే ఏ సమస్యా ఉండదు.

ఇంగువతో నిగారింపు

రెండు స్పూన్ల ముల్తానీ మట్టిలో స్పూను తేనె, చిటికెడు ఇంగువ, స్పూను రోజ్‌వాటర్ వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి ఇరవై నిమిషాలపాటు ఆరబెట్టాలి. తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఈ ప్యాక్‌ను వారంలో రెండుసార్లు వేయడం వల్ల మొటిమలు, నల్లమచ్చలు, ముడతలు పోతాయి. చర్మం పొడిబారడం తగ్గి ముఖం కాంతిమంతమవుతుంది.



సేవాపథం

కోటి కలల కొండ బడి

మెరుపు మెరిస్తే, వాన కురిస్తే, హరివిల్లు విరిస్తే పిల్లల్లో ఒకరిగా మారి ఆనందించేవాడు. పేదపిల్లల కోసం ఏదైనా చేయాలనేది ఆయన కల. ఆ కల సాకారం కాకుండానే ఈ లోకాన్ని విడిచి వెళ్లాడు. తండ్రి కలను నెరవేర్చడానికి సేవాపథంలోకి వచ్చింది పోర్షియా పుటతుండ...





స్కూలు పిల్లలతో పోర్షియా

ఝార్ఖండ్‌లోని రాంచీలో పుట్టిన పోర్షియా పుటతుండ కోల్‌కతా, ఢిల్లీ, నోయిడా, ముంబైలలో పెరిగింది. పోర్షియా తండ్రికి పిల్లలంటే ఎంతో ఇష్టం. పిల్లలతో కలిసి నర్సరీ రైమ్స్ పాడడం ఇష్టం. ఆటలు ఆడుతూ పాఠాలు చెప్పడం ఇష్టం.

గ్రామీణ ప్రాంతాలలోని పేదపిల్లలకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంచేవాడు.

పేద పిల్లల కోసం తనవంతుగా ఏదైనా చేయాలని నిరంతరం తపించేవాడు.

తన కలలు సాకారం కాకుండానే ఆయన చనిపోయారు. తండ్రి జ్ఞాపకాల స్ఫూర్తితో ఆయన ఆశయాలను నెరవేర్చే క్రమంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని కోమిక్ అనే గ్రామంలో అక్కడి అట్టడుగు వర్గాల పిల్లల కోసం ఫ్రీబోర్డింగ్ స్కూల్ ప్రారంభించింది పోర్షియా.

'హైయెస్ట్ విలేజ్ ఆఫ్ ఇండియా'గా పేరున్న కోమిక్‌లోని ఎంతోమంది పేద పిల్లలకు పోర్షియా ఇప్పుడు తల్లి, గురువు, సంరక్షకురాలు. జర్నలిజంలో డిగ్రీ చేసిన పోర్షియా ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో పనిచేసింది. ఆ తరువాత 'సీఎస్ఎస్'లో న్యూస్ ప్రొడ్యూసర్‌గా బాధ్యతలు నిర్వహించింది. కొంతకాలం తరువాత జర్నలిజాన్ని వదులుకొని సేవాదారిలోకి వచ్చింది.

పోర్షియా ఈ గ్రామాన్ని ఎంచుకోవడానికి కారణం?

ఆమెకు ప్రయాణాలు అంటే చాలా ఇష్టం. తొలిసారిగా హిమాచల్‌ప్రదేశ్‌లోని స్పితి లోయకు వచ్చినప్పుడు తనకు ఎంతో మనశ్శాంతిగా అనుభూతి చెందింది. ఆ ప్రాంతంతో ఏదో అనుబంధం ఉన్నట్లు అనిపించింది. తండ్రి చనిపోయిన తరువాత పోర్షియాపై కుంగుబాటు నీడలు కమ్ముకున్నాయి.

చీకట్లో నుంచి వెలుగులోకి రావడానికి తనకు ఇష్టమైన ప్రదేశం గురించి పోర్షియా ఆలోచిస్తున్నప్పుడు స్పితి గుర్తుకు వచ్చింది.

అక్కడి పేదపిల్లలతో మాట్లాడుతున్నప్పుడు స్వయంగా తండ్రితో మాట్లాడినట్లే అనిపించింది. వారి కోసం ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది. స్కూల్ ప్రారంభానికి ముందు కజా ప్రాంతంలోని ఒక స్థానిక కుటుంబంతో నెలరోజులు గడిపింది. ఆ కుటుంబంలోని పిల్లలకు పాఠాలు చెప్పింది.

ప్రకృతి సోయగాలను ఆస్వాదించడం కోసం ఊళ్ల వెంట తిరుగుతున్నప్పుడు చదువుకు దూరమైన, సరైన చదువు లేని ఎంతోమంది పేదపిల్లలు కనిపించారు. వారిని విద్యావంతులను చేయాల్సిన అవసరం కనిపించింది.



బోర్డింగ్ స్కూలులో పిల్లలు

'ఉద్యోగాన్ని, ముంబైని విడిచి ఇక్కడకు రావడం అనేది సాహసంతో కూడుకున్న పని. కాని నేను ఇష్టంతో ఇక్కడకు వచ్చాను. ముంబైని విడిచి రావాలనే ఆలోచన నా స్నేహితులు, సన్నిహితులు ఎవరికీ నచ్చలేదు. తెలివి తక్కువ నిర్ణయం తీసుకున్నావు అని ముఖం మీదే చెప్పారు. గోడకు కొట్టిన బంతిలా తిరిగి వస్తావు అని కూడా అన్నారు. అయితే అవేమీ నా నిర్ణయాన్ని మార్చలేకపోయాయి. ఇక్కడికి వచ్చిన తరువాత నా జీవితానికి ఒక పరమార్థం దొరికినట్లు అనిపించింది' అంటుంది పోర్షియా.

తొలి అడుగులో భాగంగా....

పిల్లలు ఆడుకునే చోటుకు వెళ్లేది. 'మీకు బొమ్మలు ఎలా వేయాలో నేర్పిస్తాను' 'కొత్త ఆటలు నేర్పిస్తాను' 'ఇంగ్లీష్‌లో మాట్లాడడం నేర్పిస్తాను' అంటూ వారితో స్నేహం చేసేది. చెట్టు కింద కూర్చొని బొమ్మలు గీయడం, రైమ్స్ పాడడం నేర్పేది. ఒక్కరొక్కరుగా నలభై మంది పిల్లల వరకు ఆమెకు దగ్గరయ్యారు.

ఆ సమయంలో తనకు ఫ్రీ బోర్డింగ్ స్కూల్ ఆలోచన వచ్చింది. కోమిక్‌లో ఒక ప్రదేశాన్ని అద్దెకు తీసుకొని ఫ్రీ బోర్డింగ్ స్కూల్ ప్రారంభించింది.

ఇల్లు అలకగానే పండగ కాదు అన్నట్లు పెద్ద సమస్య వచ్చింది. 'ఇప్పుడు మా పిల్లలు చదువుకొని ఏం చేయాలి? చిన్నాచితకా పనులు చేసుకుంటే ఏదో విధంగా బతుకుతారు' అంటూ పిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులు నిరాకరించేవారు. వారి ఆలోచన ధోరణిలో మార్పు తీసుకురావడానికి పోర్షియా చాలా కష్టపడాల్సి వచ్చింది.

పాఠాలతో పాటు తోటపని నుంచి నృత్యం వరకు పిల్లలకు ఎన్నో నేర్పుతోంది పోర్షియా.

'నా కల సాకారం అవుతుందా, లేదా అనుకునేదాన్ని. స్కూల్ ప్రారంభించిన తరువాత నా మీద నాకు, నా పై పిల్లల పేరెంట్స్‌కు నమ్మకం వచ్చింది. ఇది తొలి అడుగు మాత్రమే' అంటుంది పోర్షియా పుటతుండ.

సైబర్ టాక్

ఇటీవల మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా వార్తలు చదివే యాంకర్లను చూసి ఆశ్చర్యపోయాం. ఇది టెక్నాలజీపరంగా మనం చూస్తున్న మార్పులు. అంతవరకు బాగానే ఉంది కానీ, సోషల్ మీడియాలో మన ఫొటోలు, వీడియోలు దొంగిలించి, ఏఐ టెక్నాలజీ ద్వారా తక్కువ నిడివి గల మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలుగా రూపొందించి, వాటిద్వారా మనల్ని బెదిరించే, సన్నిహితులను డబ్బు అభ్యర్థించే నేరస్థులు పుట్టుకొస్తున్నారు జాగ్రత్త!!



ఏఐ స్కామ్స్

ఏది నిజం.. ఏది మాయ!

చెక్ చేసుకోండి

లేనిది ఉన్నట్టుగా సృష్టించి, భ్రమించేలా చేసే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డీప్ ఫేక్ స్కామ్స్ కొత్తగా వెలుగు చూస్తున్నాయి. స్కామర్లు ఈ ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్నారు.

■ దీనివల్ల జరిగే హాని..

- ఒక వ్యక్తిని వేధించడం లేదా అవమానించడం. సమాజంలో వారి ఇమేజ్‌ను, అలాగే విశ్వసనీయతను నాశనం చేయడం.
- ఈ విధానం ద్వారా డబ్బులను డిమాండ్ చేయడం లేదా వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడం, బెదిరించడం.
- కస్టమర్ కేవైసీ మెకానిజమ్‌ను కూడా మోసం చేయడం.
- క్రిమినల్ న్యాయ పరిశోధనల కోసం ఎలక్ట్రానిక్ సాక్ష్యాలను మార్చడం.
- తప్పుడు సమాచార ప్రచారాలకు మద్దతు ఇవ్వడం.
- వినియోగదారుల పాస్‌వర్డ్‌లను తెలుసుకోవడానికి ఏఐ టెక్నాలజీని ఉపయోగించడం.

■ బాధితులను మోసగించడానికి స్కామర్లు ఉపయోగించే సాకులు

ఉదాహరణకు: మనకు లైవ్ వీడియో కాల్ వస్తుంది. ఆ వీడియోలో మనకు బాగా తెలిసిన సన్నిహిత వ్యక్తే ఉంటారు. 'మా ఇంట్లో దొంగతనం జరిగింది. నా దగ్గర అవసరానికి డబ్బేమీ లేదు. సహాయం చెయ్ ప్లీజ్' అని అడుగుతారు. లేదంటే.. సడెన్‌గా జబ్బు పడ్డాను, అత్యవసర పరిస్థితుల కోసం నాకు డబ్బు కావాలి / యాక్సిడెంట్ అయ్యింది, డబ్బు కావాలి' అని అంటారు. ఆ సమయంలో 'అయ్యో, మనకు తెలిసిన వారికే, ఎంతటి కష్టం వచ్చింది అనుకుంటాం. డబ్బు సాయానికి ఆన్‌లైన్ బదిలీలు చేస్తాం. ఆ తర్వాత కానీ, జరిగిన నష్టం అర్థం కాదు.

■ డీప్ ఫేక్ స్కామ్ నమూనా..

ఏఐ ఆధారిత ఫోన్ వీడియో కాల్ మోసాలు అవతలివారిని ఒప్పించేవిగా, నమ్మించేవిగా ఉండవచ్చు.

- నేరగాళ్లు బాధితులను యాదృచ్ఛికంగా ఎంచుకుంటారు. మన సోషల్ మీడియా ప్రొఫైల్ ఇందుకు ఉపయోగపడుతుంది. ఆ తర్వాత స్కామర్లు బాధితులతో సోషల్ నెట్‌వర్క్‌లతో కమ్యూనికేట్ చేయడం ప్రారంభిస్తారు.
- స్కామర్ మనకు తెలిసిన వ్యక్తిలా నటిస్తాడు. తప్పుడు కథనాలను పునరావృతం చేయడం ద్వారా (ఏఐ–ఆధారిత డీప్ ఫేక్‌లను ఉపయోగించడం) బాధితులను పెద్ద మొత్తంలో డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసేలా ఒప్పించడం, లేదా తియ్యగా మాట్లాడుతూ ఆర్థిక సహాయాన్ని అభ్యర్థించడం వంటి మోసాలకు పాల్పడుతారు.



ఒరిజినల్



ఏఐ కల్పితం

■ దుర్వినియోగం ఇలా అవుతోంది..

- డీప్ ఫేక్‌లను (వీడియోలు, ఫేక్‌వర్చువల్ ఐడెంటిటీలు) రూపొందించడంలో ఏఐ సహాయపడుతుంది. ఇది చాలా వాస్తవికంగా కనిపిస్తుంది. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికీ, అసలు వ్యక్తుల్లా నటించడానికీ ఉపయోగపడుతుంది.
- మోడర్న్ స్టైల్‌లో వాయిస్ ఫిషింగ్ దాడులను నిర్వహించడానికి సైబర్ నేరస్తులు సోషల్ మీడియా అకౌంట్లనుంచి మన ఆడియోలను క్లోన్ చేయవచ్చు. (ఎమర్జెన్సీ సాకుతో డబ్బును బదిలీ చేయడానికి బాధితుల్లా నటించవచ్చు)
- ఏఐ టెక్నిక్స్ ఉపయోగించి సైబర్ నేరస్తులు మీ ఇమెయిల్‌ను పోలినటువంటి మెయిల్స్‌నే క్రియేట్ చేయవచ్చు.
- ఇప్పటికే ఉన్న ఆన్‌లైన్ సేఫ్టీని తప్పించి హైటెక్ మాల్వేర్‌ను రూపొందించడానికి ఏఐ ఉపయోగపడుతుంది.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో నడిచే డిజిటల్ ల్యాండ్ స్కేప్‌లు మనుషుల ప్రవర్తనకు తగినట్టుగా అనుకరిస్తాయి. అందుకే, ఏఐ సాధనాలను ఉపయోగించి మరింత నమ్మదగిన సోషల్ దాడులకు పాల్పడవచ్చు.

■ నేరాల బారిన పడకుండా చిట్కాలు

- కోడ్ వర్డ్ తప్పనిసరి చేయాలి. మీ పిల్లలు, కుటుంబసభ్యులు, సన్నిహితులకు సంబంధించి ఒక కోడ్‌వర్డ్‌ను సెట్ చేయండి. ఏదైనా వీడియో, లైవ్ ద్వారా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన చర్చ వచ్చినప్పుడు కోడ్‌వర్డ్ చెప్పమని అడిగి, నిర్ధారించుకోవచ్చు.
- లైవ్‌లో అయితే 'ఒకసారి వెనక్కి తిరగమని చెప్పండి. ఏఐ టెక్నాలజీ అయితే అలా తిరగడం అనేది సాధ్యం కాదు.
- సైబర్ నేరస్థులు మీ సన్నిహితుల ఫోన్ నంబర్ల మాదిరే కనిపించే యాక్సెస్‌ను కూడా కలిగి ఉంటారు. అందుకని, మీకు తెలిసిన నంబర్ నుండి వాయిస్ మెయిల్ లేదా టెక్స్ట్ వచ్చినా వెంటనే స్పందించకుండా కొంత సమయం తీసుకొని, లోతైన కారణాన్ని కనుక్కోండి.
- మీ సోషల్ మీడియా, ఇ–మెయిల్ అకౌంట్స్‌కు రెండు రకాల ప్రామాణీకరణను పాటించండి. దీని వల్ల మీరు అనధికార విషయాలకు దూరంగా ఉండవచ్చు.
- అంకెలు, ప్రత్యేక అక్షరాలతో బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించండి.
- ఇ–మెయిల్స్, ఎస్సెమ్మెస్‌లలో వచ్చే షార్ట్ లింక్స్‌పై క్లిక్ చేసేటప్పుడు జాగ్రత్త అవసరం. ధ్రువీకరించినవాటిని మాత్రమే ఓపెన్ చేయండి.

ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్న ఏఐ మోసాల నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే 'ఏది నిజం – ఏది మాయ' అని తెలుసుకోవడం ముఖ్యం. ఆధునిక పద్ధతుల్లో జరిగే ఏ మోసాలైనా మానవ మేధస్సును ఉపయోగించి అడ్డుకోవడం సులువే. అందుకు కావల్సింది కొంత జాగరూకత మాత్రమే అని గుర్తించాలి.

ఇన్‌పుట్స్:
అనిల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్





ఆసియా క్రీడలకు భారత ఫుట్‌బాల్ జట్లు

ఆసియాలో టాప్-8లో లేకపోయినా భారత పురుషుల, మహిళల ఫుట్‌బాల్ జట్లను ఆసియా క్రీడలకు పంపించాలని కేంద్ర క్రీడా శాఖ నిర్ణయం తీసుకుంది. ఆసియా క్రీడల్లో ఆయా జట్లలో ముగ్గురు మినహా మిగతా సభ్యులు అండర్-23 ఆటగాళ్లే ఉండాలి. సీనియర్ ఆటగాళ్ల హోదాలో కెప్టెన్ సునీల్ ఛెత్రి, గోల్‌కీపర్ గుర్‌ప్రీత్, డిఫెండర్ సందీప్ జింగాన్ ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. మరోవైపు భారత మహిళల సాఫ్ట్‌బాల్, పురుషుల వాటర్‌పోలో, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్ 5x5 జట్లను ఆసియా క్రీడలకు పంపించకూడదని భారత ఒలింపిక్ సంఘం నిర్ణయం తీసుకుంది.

భారత చెస్ 83వ గ్రాండ్‌మాస్టర్‌గా ఆదిత్య



మహారాష్ట్రకు చెందిన ఆదిత్య సామంత్ భారత చెస్‌లో 83వ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించాడు. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న బీల్ చెస్ ఫెస్టివల్‌లో ఆదిత్య జీఎం హోదా ఖరారు కావడానికి అవసరమైన 2500 ఎలో రేటింగ్‌ను అధిగమించడంతోపాటు చివరిదైన మూడో జీఎం నార్మ్‌ను సాధించాడు. 20 ఏళ్ల ఆదిత్య అబుదాబి మాస్టర్స్‌లో తొలి జీఎం నార్మ్, ఎల్ లోబ్రెగట్ ఓపెన్‌లో రెండో జీఎం నార్మ్ సాధించాడు.

వరల్డ్‌కప్ దిశగా వన్డేల సన్నాహకం

- నేడు భారత్, విండీస్ తొలి వన్డే
- జోరు మీదున్న టీమిండియా
- రాత్రి గం. 7 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

దాదాపు రెండు నెలల తర్వాత జరిగే వన్డే వరల్డ్‌కప్‌కు సన్నాహాలు షురూ చేస్తున్న జట్టు ఒకవైపు... వరల్డ్‌కప్‌కు అర్హత సాధించకుండా దూరంగా ఉండిపోయిన జట్టు మరోవైపు... తుది జట్టు కూర్పు ప్రయత్నాల్లో, కీలక ఆటగాళ్ల ఫామ్‌లోకి వచ్చే ప్రయత్నంలో ఒక జట్టు... అసలు గెలుపు, ఓటముల ప్రభావమే లేకుండా, గెలిస్తే కనీసం వరల్డ్‌కప్ సూపర్ లీగ్ పాయింట్లు కూడా అందుబాటులో లేని స్థితిలో మరో జట్టు... ఈ నేపథ్యంలో భారత్, వెస్టిండీస్ మధ్య వన్డే సిరీస్‌కు రంగం సిద్ధమైంది. అగ్రశ్రేణి ఆటగాళ్లతో టీమిండియా సహజంగానే ఫేవరెట్ కాగా, విండీస్ ఈ ఫార్మాట్‌లోనైనా పోటీ ఇస్తుందా అనేది చూడాలి.

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): తొలి టెస్టు గెలిచి, రెండో టెస్టులో వాన కారణంగా విజయావకాశం చేజార్చుకున్న భారత జట్టు ఇప్పుడు వన్డేల్లో చెలరేగేందుకు సిద్ధమైంది. భారత్, విండీస్ మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో తొలి పోరు జరుగుతుంది. వరల్డ్‌కప్‌నకు ముందు సాధనగా ఉపయోగపడగల ఈ సిరీస్‌లో రోహిత్ బృందం పూర్తి స్థాయిలో సత్తా చాటాలని భావిస్తుండగా... సీనియర్ల గైర్హాజరుతో పలువురు యువ ఆటగాళ్లను పరీక్షించేందుకు విండీస్ ప్రయత్నిస్తోంది.

సూర్యకుమార్‌పై దృష్టి...

23 మ్యాచ్‌లలో 433 పరుగులు... వన్డేల్లో సూర్యకుమార్ యాదవ్ గణాంకాలు ఇవి. టి20ల్లో విధ్వంసక ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్నా, వన్డేల్లో అతను ఇంకా తడబడుతూనే ఉన్నాడు. ఆసీస్‌తో గత మూడు వన్డేల్లో తొలి బంతికి డకౌట్ అరుదైన రికార్డు సాధించిన అతను తన సత్తాను ప్రదర్శించేందుకు ఇది సరైన వేదిక. వికెట్ కీపర్ స్థానం కోసం ఇషాన్ కిషన్, సంజూ సామ్సన్ మధ్య గట్టి పోటీ ఉంది. అప్పుడప్పుడు మాత్రమే అవకాశాలు దక్కించుకున్న సామ్సన్ ఈసారి చాన్స్ వృథా చేసుకోకూడదని పట్టుదలగా ఉన్నాడు. ఆల్‌రౌండర్లుగా హార్దిక్, జడేజాలతో పాటు పిచ్‌ను బట్టి అక్షర్, శార్దుల్‌లలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. టెస్టుల్లో సత్తా చాటిన సిరాజ్ ఇక్కడా పేస్ బౌలింగ్ దళానికి సారథి. రెండో పేసర్‌గా ఉమ్రాన్ తనకు దక్కిన అవకాశాన్ని వాడుకోవాల్సి ఉంది. చహల్‌కంటే కూడా ఈ ఏడాది భారత్ ఆడిన 9 వన్డేల్లో 8 మ్యాచ్‌లలో బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్‌కే ప్రధాన స్పిన్నర్‌గా అవకాశం ఉంది. భారత టాప్-3 రోహిత్, గిల్, కోహ్లి తమ స్థాయి మేరకు ఆడితే జట్టుకు తిరుగుండదు.



రోహిత్

పిచ్, వాతావరణం

దాదాపు ఏడాది క్రితం ఇక్కడ జరిగిన వన్డే సిరీస్‌లో బౌలర్లు బాగా ప్రభావం చూపడంతో తక్కువ స్కోర్లే నమోదయ్యాయి. అయితే ఈసారి కొంత బ్యాటింగ్‌కు అనుకూలం. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించవచ్చు.

హెట్‌మైర్ పునరాగమనం...



హెట్‌మైర్, షై హోప్

సమీప భవిష్యత్తు గురించి ఎలాంటి స్పష్టత లేకపోయినా పరువు దక్కించుకునే ప్రయత్నంలో వెస్టిండీస్ పోరాడనుంది. వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్‌లో పేలవ ప్రదర్శన వారి వన్డే జట్టు స్థాయిని చూపిస్తోంది. హోల్డర్, పూరన్, కీమో పాల్‌లాంటి కాస్త పేరున్న ఆటగాళ్లు ఈ సిరీస్‌కు దూరమయ్యారు. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా ఫలితంతో సంబంధం లేకుండా కొత్తగా ప్రయత్నించేందుకు సిద్ధమైంది. గుడకేశ్ మోతీ, యానిక్ కారియా, జేడెన్ సీల్స్‌లాంటి ఆటగాళ్లు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇది సరైన అవకాశం. 47 వన్డేల్లో 100కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో పాటు భారత్‌పైనే రెండు సెంచరీలు సాధించిన హెట్‌మైర్‌పైనే ప్రధానంగా అందరి దృష్టీ నిలిచింది. కింగ్, కెప్టెన్ షై హోప్ బ్యాటింగ్‌లో ఇతర కీలక ఆటగాళ్లు.

8 ఇరుజట్ల మధ్య జరిగిన గత 8 వన్డేల్లో భారతే విజయం సాధించింది. 2019 డిసెంబర్‌లో భారత్‌ను ఆఖరిసారిగా విండీస్ ఓడించింది.

6 వెస్టిండీస్‌లో వెస్టిండీస్‌తో భారత జట్టు ఇప్పటి వరకు పది ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లు ఆడింది. ఇందులో ఆరుసార్లు భారత్, నాలుగుసార్లు వెస్టిండీస్ సిరీస్‌లు గెల్చుకున్నాయి. గత ఐదు సిరీస్‌లలో భారతే పైచేయి సాధించింది. 2006లో చివరిసారి విండీస్ సొంతగడ్డపై భారత్‌పై సిరీస్ నెగ్గింది.

అభిమానులకు షాక్!

భారత్, పాక్ వరల్డ్‌కప్ మ్యాచ్ తేదీ మారే అవకాశం



న్యూఢిల్లీ: వన్డే వరల్డ్‌కప్‌లో అత్యంత ప్రతిష్టాత్మక పోరు... అభిమానుల కోణంలో అయితే మరీ భావోద్వేగాల సమరం... అందుకే ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ఫ్యాన్స్ భారత్, పాకిస్తాన్ మధ్య జరిగే మ్యాచ్ కోసం ఎదురు చూశారు. విమాన టికెట్లతో పాటు పెద్ద మొత్తంలో ఖర్చు చేసి భారీగా పెరిగిన రేట్‌లతో హోటల్ గదులు కూడా బుక్ చేసుకున్నారు. ఎన్ని వ్యయప్రయాసలెదురైనా నరేంద్ర మోదీ స్టేడియంలో మ్యాచ్ చూసేందుకు అక్టోబర్ 15 కోసం ప్రణాళిక రూపొందించుకున్నారు. అయితే ఇప్పుడు వీరందరి ప్లాన్ తలకిందులయ్యే అవకాశమూ కనిపిస్తోంది! అహ్మదాబాద్‌లో అదే రోజు నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గుజరాత్‌లో అత్యంత వైభవంగా జరిగే నవరాత్రి ఉత్సవాల మొదటి రోజు మ్యాచ్ జరపడం చాలా సమస్యగా మారుతుందని అక్కడి భద్రతా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆ రోజు సెక్యూరిటీ కల్పించడం తమ వల్ల సాధ్యం కాదని చేతులెత్తేసిన పోలీసులు, మ్యాచ్‌ను మరో రోజుకు మార్చాలని బీసీసీఐ అధికారులకు సూచించారు. ప్రకటించిన తేదీకంటే ఒక రోజు ముందు అక్టోబర్ 14కు మ్యాచ్ మారే అవకాశం ఉంది. అయితే ఒక రోజు మారినా ఫ్యాన్స్‌కు ఇది పెద్ద సమస్యగా మారడం మాత్రం ఖాయం. అసలు షెడ్యూల్ ప్రకటించడమే చాలా ఆలస్యం కాగా... గుజరాత్‌లో నవరాత్రి గురించి బోర్డు కార్యదర్శి జై షాకు తెలియకపోవడం ఆశ్చర్యకరం! దీనిపై నేడు జరిగే బీసీసీఐ సమావేశం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు వరల్డ్ కప్ నిర్వహణకు సంబంధించి నేడు వివిధ సబ్ కమిటీలతో నేడు బోర్డు చర్చించనుంది.

8 పరుగులిచ్చి 7 వికెట్లు

- అంతర్జాతీయ టి20ల్లో కొత్త ప్రపంచ రికార్డు
- మలేసియా పేసర్ ఇద్రూస్ ఘనత
- 11.2 ఓవర్లలో చైనా 23 ఆలౌట్



ఇద్రూస్

కౌలాలంపూర్: అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో సంచలన బౌలింగ్ ప్రదర్శన నమోదైంది. మలేసియా పేస్ బౌలర్ స్యాజ్‌రుల్ ఇద్రూస్ 4 ఓవర్లలో 8 పరుగులే ఇచ్చి 7 వికెట్లు పడగొట్టాడు. అంతర్జాతీయ టి20ల్లో ఇదే ఒక బౌలర్ అత్యుత్తమ ప్రదర్శన. ఇప్పటి వరకు ఎవరూ 7 వికెట్లు తీయలేదు. గతంలో అత్యుత్తమ బౌలింగ్ రికార్డు పీటర్ అహో (నైజీరియా; 6/5, సియెరా లియోన్) పేరిట ఉంది. ఐసీసీ పూర్తి స్థాయి సభ్యత్వం ఉన్న జట్లలో దీపక్ చహర్ (6/7,బంగ్లాదేశ్‌పై)దే బెస్ట్ బౌలింగ్. ఓవరాల్‌గా టి20 క్రికెట్‌లో కొలిన్ అకర్‌మన్ (7/18) పేరిట ఉన్న రికార్డును కూడా ఇద్రూస్ సవరించాడు. టి20 ప్రపంచకప్ ఆసియా 'బి' క్వాలిఫయర్ టోర్నీలో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇద్రూస్ ధాటికి చైనా 11.2 ఓవర్లలో 23 పరుగులకే కుప్పకూలింది. ఇద్రూస్ వికెట్లన్నీ క్లీన్‌బౌల్డ్ కావడం విశేషం. చైనా తరఫున బరిలోకి దిగిన 11 మందికీ ఇది తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ మాత్రమే కాదు...ఓవరాల్‌గా కూడా ఇదే తొలి టి20 మ్యాచ్. అనంతరం మలేసియా 4.5 ఓవర్లలో 2 వికెట్లకు 24 పరుగులు చేసి విజయాన్నందుకుంది.

సింధు ఏడో 'సారీ'

మళ్లీ తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్



టోక్యో: ఈ ఏడాది తన నిరాశాజనక ప్రదర్శన కొనసాగిస్తూ... భారత బ్యాడ్మింటన్ స్టార్ ప్లేయర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 టోర్నీ నుంచి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు కేవలం 32 నిమిషాల్లో 12-21, 13-21తో ప్రపంచ 18వ ర్యాంకర్ జాంగ్ యి మన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. ఈ ఏడాది సింధు 13 వరల్డ్ టూర్ సూపర్ టోర్నీల్లో ఆడగా ఏడు టోర్నీల్లో ఆమె తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. మహిళల సింగిల్స్‌లో బరిలో ఉన్న మరో భారత క్రీడాకారిణి మాళవిక బన్సోద్ కూడా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. అయా ఒహోరి (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో మాళవిక 7-21, 15-21తో ఓటమి పాలైంది.

సాత్విక్-చిరాగ్ జోడీ శుభారంభం

ఈ సంవత్సరం నాలుగు టైటిల్స్ నెగ్గిన జోరు మీదున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. తొలి రౌండ్‌లో ప్రపంచ రెండో ర్యాంక్ జంట సాత్విక్-చిరాగ్ 21-16, 11-21, 21-13తో లియో కర్నాండో-డానియల్ మార్టిన్ (ఇండోనేసియా) ద్వయంపై గెలిచింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ (భారత్) 21-15, 12-21, 24-22తో సహచరుడు ప్రియాన్షు రజావత్‌పై గెలుపొందగా... మిథున్ 21-13, 22-24, 18-21తో వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు.

పాకిస్తాన్ 563/5



షఫీఖ్

కొలంబో: శ్రీలంక జట్టుతో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ 132 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 563 పరుగులు సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 178/2తో ఆట కొనసాగించిన పాకిస్తాన్ మూడు వికెట్లు చేజార్చుకొని 385 పరుగులు చేసింది. ఓపెనర్ అబ్దుల్లా షఫీక్ (201; 19 ఫోర్లు, 4 సిక్స్‌లు) డబుల్ సెంచరీ చేయగా... ఆగా సల్మాన్ (132 బ్యాటింగ్; 15 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించాడు. ప్రస్తుతం పాక్ 397 పరుగుల ఆధిక్యంలో ఉంది.

సౌత్ జోన్‌కు రెండో గెలుపు



మయాంక్

పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీ దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో సౌత్ జోన్ జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. వెస్ట్ జోన్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో సౌత్ జోన్ 12 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా సౌత్ జట్టు 46.4 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (115 బంతుల్లో 98; 9 ఫోర్లు) రెండు పరుగుల తేడాతో సెంచరీని కోల్పోయాడు. వెస్ట్ బౌలర్లలో పార్థ్ మూడు వికెట్లు తీయగా, రాజ్‌వర్ధన్, షమ్స్ ములానీలకు రెండు వికెట్ల చొప్పున లభించాయి. 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్ట్ జట్టు 36.2 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. సర్ఫరాజ్ ఖాన్ (42; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), అతీత్ షేథ్ (40; 6 ఫోర్లు) రాణించారు. సౌత్ జోన్ స్పిన్నర్లు సాయికిశోర్ (3/44), వాషింగ్టన్ సుందర్ (2/34) వెస్ట్ జోన్ జట్టును దెబ్బ తీశారు. ఇతర మ్యాచ్‌ల్లో నార్త్ జోన్ 48 పరుగులతో సెంట్రల్ జోన్‌పై, ఈస్ట్ జోన్ ఎనిమిది వికెట్లతో నార్త్ ఈస్ట్‌జోన్‌పై గెలిచాయి.

ఇంగ్లండ్‌తో భారత్ మ్యాచ్ 'డ్రా'

బార్సిలోనా: స్పెయిన్ హాకీ సమాఖ్య శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నాలుగు దేశాల అంతర్జాతీయ హాకీ టోర్నీని భారత మహిళల జట్టు 'డ్రా'తో ప్రారంభించింది. ఇంగ్లండ్ జట్టుతో బుధవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌ను భారత్ 1-1తో 'డ్రా'గా ముగించింది. ఇంగ్లండ్ తరఫున హోలీ హంట్ ఏడో నిమిషంలో గోల్ చేయగా... భారత జట్టుకు లాల్‌రెమ్‌సియామి 41వ నిమిషంలో గోల్ సాధించి స్కోరును సమం చేసింది. చివరి క్వార్టర్‌లో రెండు జట్లకు రెండు చొప్పున పెనాల్టీ కార్నర్‌లు లభించినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఇదే టోర్నీలో పోటీపడుతున్న భారత పురుషుల జట్టు తొలి మ్యాచ్‌లో స్పెయిన్ జట్టు చేతిలో 1-2తో ఓడిపోగా... నెదర్లాండ్స్ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌ను 1-1తో 'డ్రా' చేసుకుంది.


సినిమా



రజనీకాంత్, తమన్నా

రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహించిన 'జైలర్' ఆగస్టు 10న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలోని తమిళ పాట 'కావాలయ్యా' తెలుగు వెర్షన్ 'కావాలి...'ని హీరో రానా షేర్ చేశారు. శ్రీ సాయి కిరణ్ రాసిన ఈ పాటను సింధూజ శ్రీనివాసన్‌తో కలిసి ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ పాడారు. అలాగే 'జైలర్' నుంచి తమిళ 'జుజుబి' పాట లిరికల్ వీడియోను బుధవారం రిలీజ్ చేశారు.

విహారం.. వినోదం



అజిత్



మహేశ్ బాబు



విజయ్



సమంత



రకుల్

స్టోరీ సిట్టింగ్స్, సినిమా షూటింగ్స్, ప్రమోషన్స్... ఇలా ఎప్పుడూ బిజీ బిజీగా ఉంటుంటారు సినిమా స్టార్స్. అందుకే అప్పుడప్పుడూ కాస్త రిలాక్స్ అవ్వాలనుకుంటారు. విహారం.. వినోదం కోసం కొంత టైమ్ కేటాయిస్తారు. ప్రస్తుతం అలా వెకేషన్ మోడ్‌లో ఏ స్టార్స్ ఎక్కడున్నారో తెలుసుకుందాం.

మాల్దీవుల్లో మస్తీ

వెకేషన్ స్పాట్ కోసం మాల్దీవులను ఎంచుకున్నారు రజనీకాంత్. వారం రోజుల క్రితం ఆయన మాల్దీవులకు వెళ్లిన సంగతి గుర్తుండే ఉంటుంది. అక్కడి బీచ్‌లో రజనీ నడుస్తున్న ఫొటోలు కూడా నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఇక వెకేషన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలోని సినిమా, లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్‌లోని సినిమాలతో రజనీకాంత్ బిజీ అవుతారు.

విదేశాల్లో బర్త్ డే

ఇటీవలి కాలంలో సినిమా షెడ్యూల్స్‌కి కాస్త గ్యాప్ రావడంతో మహేశ్‌బాబు హాలిడే మోడ్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి దుబాయ్ వెకేషన్‌లో ఉన్నారు మహేశ్‌బాబు. రెండు వారాలకు పైగానే ఈ వెకేషన్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఆగస్టు 9న మహేశ్ బర్త్ డే. ఈ పుట్టినరోజుని విదేశాల్లోనే ఫ్యామిలీతో కలిసి జరుపుకుంటారని తెలుస్తోంది. ఇక ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేశ్‌బాబు 'గుంటూరు కారం' సినిమా చేస్తున్నారు.

వెకేషన్ కంటిన్యూ

ఈ ఏడాది సంక్రాంతి సమయంలో విడుదలైన అజిత్ తమిళ చిత్రం 'తునివు' (తెలుగులో 'తెగింపు'). ఆ సినిమా తర్వాత దాదాపు హాలిడే మూడ్‌లోనే ఉన్నారు అజిత్. తనకు ఇష్టమైన బైక్స్‌పై విదేశాల్లోని బ్యూటిఫుల్ లొకేషన్స్‌ను సందర్శించారు. కాగా అజిత్ తర్వాతి చిత్రం 'విడా ముయర్చి' ప్రకటన వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలు కావడానికి మరికొంత సమయం ఉందట. దీంతో మరోసారి అజిత్ విదేశాలకు ప్రయాణమయ్యారని టాక్.

షార్ట్ గ్యాప్

విజయ్ హీరోగా నటించిన 'లియో' చిత్రం ఈ దసరాకు విడుదల కానుంది. అలాగే విజయ్ నెక్స్ట్ ఫిల్మ్ వెంకట్ ప్రభు దర్శకత్వంలో ఉంటుంది. ఈ చిత్రం ఆరంభం కావడానికి కాస్త టైమ్ ఉందట. ఈ షార్ట్ గ్యాప్‌లో విజయ్ విదేశాలకు వెళ్లారని కోలీవుడ్ సమాచారం.

బాలీలో జాలీగా..

ఆరోగ్య, వ్యక్తిగత కారణాల దృష్ట్యా సినిమా చిత్రీకరణలకు కాస్త దూరంగా ఉండాలని సమంత నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సమంత వెకేషన్ కోసం బాలీ వెళ్లారు. అక్కడ ఐస్ బాత్ చేశారు సమంత (మెరుగైన ఆరోగ్యం కోసం ఓ ప్రక్రియ). మైనస్ 4 డిగ్రీల చలిలో ఆరు నిమిషాల పాటు ఐస్ బాత్ చేసినట్లుగా సోషల్ మీడియాలో షేర్ చేశారీ బ్యూటీ. ఇక సమంత హీరోయిన్‌గా నటించిన 'ఖుషీ' చిత్రం సెప్టెంబరు 1న విడుదల కానుంది. ఇందులో విజయ్ దేవరకొండ హీరో. అలాగే వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో నటించిన 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

దుబాయిలో హాయి హాయి..

గత నెల మాల్దీవుల్లో రకుల్ ప్రీత్ సింగ్ చాలా జోష్‌గా గడిపారు. ఈ హాలిడేని ఫుల్లుగా ఎంజాయ్ చేశారు. తాజాగా ఫ్యామిలీతో కలిసి దుబాయ్ రిసార్ట్స్‌లో ఫుల్ జోష్‌లో ఉన్నారు రకుల్. తన తల్లి బర్త్ డేను దుబాయ్‌లో గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారామె. ఇందుకోసమే రకుల్ అండ్ ఫ్యామిలీ దుబాయ్ వెళ్లారు.

'భోళా శంకర్' షూటింగ్‌ను పూర్తి చేసిన తర్వాత వెకేషన్‌కు వెళ్లొచ్చారు చిరంజీవి. ఇటీవలే హైదరాబాద్ తిరిగొచ్చిన చిరంజీవి ఆగస్టు 11న విడుదల కానున్న 'భోళా శంకర్' ప్రమోషన్స్‌తో బిజీ అవుతారని తెలుస్తోంది. ఇక ఇటీవలే ఆస్ట్రియా వెళ్లొచ్చారు వెంకటేశ్. అక్కడ కొంత క్వాలిటీ హాలి డే టైమ్‌ను స్పెండ్ చేసొచ్చారు. ప్రస్తుతం సైంధవ్ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు వెంకటేశ్. ఈ చిత్రం డిసెంబరు 22న విడుదల కానుంది. మరోవైపు యాభై రోజులు యూఎస్‌లో స్పెండ్ చేసిన ప్రభాస్ హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'సలార్', మారుతి దర్శకత్వంలోని 'రాజా డీలక్స్' (ప్రచారంలో ఉన్న ఓ టైటిల్) చిత్రాలతో ప్రభాస్ బిజీ అవుతారని తెలుస్తోంది. ఇటు దర్శకుల విషయానికి వస్తే... రాజమౌళి తమిళనాడులోని ఆధ్యాత్మిక లొకేషన్స్‌లో ఎక్కువ టైమ్ స్పెండ్ చేశారు. ఇలా వెకేషన్‌కి వెళ్లొచ్చిన హీరో హీరోయిన్లు, దర్శకులు మరికొందరు ఉన్నారు.

అద్దం ముందు డైలాగ్స్ చెప్పేదాన్ని



ప్రణవి

''స్లమ్ డాగ్ హజ్బెండ్' కథ కొత్తగా ఉంటుంది. ఇందులో నేను చేసిన మౌనిక పాత్ర కూడా కొత్తగా ఉంటుంది'' అన్నారు ప్రణవి మానుకొండ. ఏఆర్ శ్రీధర్ దర్శకత్వంలో సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమాని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ ఈ నెల 29న రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా ప్రణవి మాట్లాడుతూ– ''నాకు చిన్నప్పటి నుంచి నటనంటే ఇష్టం. బాల నటిగా మంచి ఆఫర్లు వచ్చాయి. అనుష్కగారి 'అరుంధతి' సినిమా డైలాగ్స్‌ను అద్దం ముందు నిలబడి చెప్పేదాన్ని. 'రొటీన్ లవ్ స్టోరీ, ఉయ్యాలా జంపాలా, అమిగోస్' సినిమాల్లో మంచి పాత్రలు చేశాను. సీరియల్స్‌లోనూ లీడ్‌గా చేశాను. హీరోయిన్‌గా 'స్లమ్ డాగ్ హజ్బెండ్' ఫస్ట్ మూవీ. నేను తెలుగమ్మాయిని కావడం ప్లస్‌గా భావిస్తున్నా. ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నప్పటికీ నా ఫోకస్ సినిమాలపైనే'' అన్నారు.

కృష్ణగాడంటే ఓ రేంజ్



'దిల్' రాజు

రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా రాజేష్ దొండపాటి దర్శకత్వం వహించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎన్‌కే శ్రీలత నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 4న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేసి, సినిమా పెద్ద హిట్టవ్వాలన్నారు. ''కృష్ణ అనే కుర్రాడి లైఫ్‌లోకి ఓ అమ్మాయి వచ్చాక, ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయి? అనేది ఈ చిత్రం ప్రధానాంశం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ముగ్గురు మహిళల కథ

సంధ్య బాయిరెడ్డి, కిరణ్ కస్తూరి, రచన యాదనపూడి, అభిషేక్ సబ్బే, వరుణ్ వేగినాటి, కార్తీక్ కందాళ కీలక పాత్రల్లో సంధ్య బాయిరెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'మేక్ ఎ విష్'. కిరణ్ కస్తూరి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాతలు ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, ఈ చిత్రనిర్మాణ నిర్వహణ భాగస్వామి భవాని శ్రీను (ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్) విడుదల చేశారు. ''ముగ్గురు మహిళల ప్రేమ కథలు, వారి సమస్యల చుట్టూ ఈ కథ ఉంటుంది'' అన్నారు సంధ్య బాయిరెడ్డి.



'మేక్ ఎ విష్' ఫస్ట్ లుక్

రీల్స్

ఇండియన్ 3.. ఆన్ ది వే!



కమల్‌హాసన్

హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన సూపర్ హిట్ ఫిల్మ్ 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు') సినిమాకు సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. కాగా శంకర్ మూడో భాగాన్ని కూడా ప్లాన్ చేశారనే టాక్ బలంగా వినిపిస్తోంది. 'ఇండియన్ 2' షూటింగ్ పూర్తయిందని, 'ఇండియన్ 3' షూటింగ్ కూడా 70 శాతం పూర్తయిందనే వార్తలు తెరపైకి వచ్చాయి. 'ఇండియన్ 2' విడుదలైన ఏడాది తర్వాత 'ఇండియన్ 3' రిలీజ్ అవుతుందని భోగట్టా.

టిక్కెట్టే కొనకుండా...



సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు' సినిమాతో హీరోగా సూపర్ హిట్ అందుకున్న సిద్ధు జొన్నలగడ్డ ఆ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న 'టిల్లు స్క్వేర్'లో నటిస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'టిక్కెట్టే కొనకుండా లాటరీ కొట్టిన సిన్నోడా...' అంటూ సాగే తొలి మాస్ సాంగ్‌ను బుధవారం విడుదల చేశారు. రామ్ మిరియాల స్వరపరచి, పాడిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. ఈ చిత్రానికి సంగీతం: రామ్ మిరియాల, శ్రీ చరణ్ పాకాల.

మంచి చేయడానికే పోటీ చేస్తున్నా



''చలనచిత్ర వాణిజ్య మండలి (తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్) ఎన్నికల్లో అధ్యక్షునిగా, ప్యానల్ సభ్యులుగా నిజాయతీగా సేవ చేసేవాళ్లను ఎన్నుకోండి'' అని నిర్మాత సి. కల్యాణ్ అన్నారు. ఈ నెల 30న చలన చిత్ర వాణిజ్య మండలి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా పోటీ చేస్తున్న సి. కల్యాణ్ తన ప్యానల్ సభ్యులతో కలిసి మాట్లాడుతూ– ''గతంలో నేను పోటీ చేయాలనుకున్నప్పుడు కొందరు నిర్మాతలు 'యూఎఫ్ఓ, క్యూబ్' వంటి డిజిటల్ ఛార్జీల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటామని చెబితే విరమించుకున్నాను. కానీ, వాళ్లు సభ్యుల శ్రేయస్సు కోసం కృషి చేయలేదు. అందుకే.. అందరికీ మంచి చేయాలనే ఆశయంతో పోటీ చేస్తున్నాను'' అన్నారు.

– నిర్మాత సి. కల్యాణ్

రుద్రంకోటలో...



జయలలిత

సీనియర్ నటి జయలలిత సమర్పించి, ఓ కీలక పాత్ర చేసిన చిత్రం 'రుద్రంకోట'. రాము కోన దర్శకత్వంలో అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ చిత్రంలో అనిల్ ఆర్కా, విభీష, రియా హీరో హీరోయిన్లు. ఈ చిత్రం ఆగస్టులో స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదల కానుంది. ''శ్మశాన వాటికలో పెరిగిన ఓ యువకుడి ప్రేమకథా చిత్రమిది. భద్రాచలం దగ్గర రుద్రంకోట అనే ఊరి నేపథ్యంలో కథ నడుస్తుంది'' అన్నారు అనిల్ ఆర్కా కండవల్లి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	351	66,707
నిఫ్టీ ▲	98	19,778

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,110	▽	34
డోజోన్స్	35,464	▲	26
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,677	▽	15
డాక్స్	16,131	▽	80
షాంఘై	3,223	▽	8
నికాయ్	32,668	▽	14

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	59,692	▲	549
బంగారం (22 క్యారట్)	59,453	▲	547
వెండి (కిలో)	74,520	▲	581

ఫెడ్ మళ్లీ వడ్డీ పెంపు బాట



వాషింగ్టన్: ప్రపంచ ఫైనాన్షియల్ మార్కెట్లను ప్రభావితం చేయగల యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ తాజాగా వడ్డీ రేటును 0.25 శాతం పెంచింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు 2001 తదుపరి 5.25–5.5 శాతానికి చేరాయి. వెరసి ఫండ్స్ రేట్లు 22ఏళ్ల గరిష్టాన్ని తాకాయి. వడ్డీ రేటును పావు శాతం పెంచేందుకు ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫెడ్ భవిష్యత్‌లోనూ వడ్డీ రేట్ల పెంపు ఉండవచ్చన్న సంకేతాలు ఇవ్వడం గమనార్హం! కాగా.. ధరల కట్టడికి 2022 మార్చి నుంచి వరుసగా 10 సమావేశాలలో వడ్డీ రేట్లను పెంచుతూ వచ్చిన ఫెడ్ గత సమావేశంలో తొలిసారి యథాతథ పాలసీ అమలుకు కట్టుబడింది.

తనిష్క్ నుంచి కొత్త ఆభరణాల కలెక్షన్



హైదరాబాద్: జ్యువెలరీ రిటైల్ బ్రాండ్ తనిష్క్ 'ది ఆటమ్ ఎడిట్' పేరిట కొత్త ఆభరణాల కలెక్షన్‌ను తీసుకొచ్చింది. ఉంగరాలు, చెవిపోగులు, పెండెంట్‌లు, నెక్లెస్‌లు, బ్రాస్‌లెట్‌లు, బ్యాంగిల్స్ వంటివి ఇందులో ఉన్నాయి. కలెక్షన్ విడుదల సందర్భంగా డైమండ్ ఆభరణాలపై 20% వరకు తగ్గింపు అందిస్తోంది. పాత బంగారాన్ని మార్పిడి ద్వారా వజ్రాభరణాలుగా మార్చుకోవచ్చు. అలాగే 22 క్యారెట్ల కంటే ఎక్కువ ఉన్న పాత బంగారు ఆభరణాలకు 100% మార్పిడి విలువ పొందవచ్చు. పరిమిత కాలానికి మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఆఫర్ దేశంలోని అన్ని తనిష్క్ స్టోర్లలో చెల్లుబాటు అవుతుంది.

రష్యాలో అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మా తాజాగా 'ఆరో ఫార్మా ఎల్‌ఎల్‌సీ' పేరిట రష్యాలో తమ అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. రష్యాలో ఫార్మా వ్యాపార కార్యకలాపాలకు ఇది ఉపయోగపడనున్నట్లు సంస్థ తెలిపింది. ఇందులో ప్రాథమికంగా 10 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించింది. కంపెనీ అనుబంధ సంస్థ అయిన ఆరో యాక్టివ్ ఫార్మాకు ఆరో ఫార్మాలో 100% వాటాలు ఉంటాయి.

రిలయన్స్ రిటైల్‌లో 'ఖతార్' పెట్టుబడి!

- ఒక శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి
- డీల్ విలువ సుమారు రూ.8,200 కోట్లు

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో భాగమైన రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో (ఆర్‌ఆర్‌వీఎల్) వాటా కొనుగోలు చేసేందుకు ఖతార్ సావరిన్ వెల్త్ ఫండ్ అయిన ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి. మాతృ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డులోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నేతృత్వంలో చర్చలు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో సుమారు 1% వాటాను దక్కించుకోవడానికి ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ రూ.8,200 కోట్లు పెట్టుబడి చేసేందుకు సిద్ధమైంది. ఈ డీల్ ద్వారా రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌ను 100 బిలియన్ డాలర్లుగా (రూ.8,20,000) విలువ కట్టినట్టు తెలుస్తోంది.

పోటీపడుతున్న ఇన్వెస్టర్లు..

గల్ఫ్ దేశాల నుంచి ఇప్పటికే మూడు సావరిన్ వెల్త్ ఫండ్స్ రిలయన్స్ రిటైల్‌లో 2020లో పెట్టుబడి పెట్టాయి. వీటిలో సౌదీ అరేబియాకు చెందిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ 2.04 శాతం వాటా కోసం రూ.16,400 కోట్లు పెట్టుబడి చేసింది. అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ 1.2 శాతం వాటా కోసం రూ.5,513 కోట్లు, యూఏఈ సంస్థ ముబదాల 1.4



శాతం వాటాకై రూ.6,248 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. రిలయన్స్ రిటైల్‌లో రెండు నెలల వ్యవధిలో 10.09 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు రూ. 47,265 కోట్లను కుమ్మరించిన ప్రపంచ పెట్టుబడి సంస్థల జాబితాలో ఈ మూడు కూడా ఉన్నాయి. వీటితోపాటు కేకేఆర్, సిల్వర్ లేక్ పార్ట్‌నర్స్, జనరల్ అట్లాంటిక్, జీఐసీతోపాటు టీపీజీ సైతం పెట్టుబడి పెట్టాయి.

దూకుడు మీదున్న రిలయన్స్..

కంపెనీ నియమించిన ఇద్దరు గ్లోబల్ కన్సల్టెంట్లు రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌ను 92–96 బిలియన్ డాలర్లుగా విలువ కట్టినట్టు ఈ నెల ప్రారంభంలో వార్తలు వెలువడ్డాయి. కంపెనీలను కొనుగోలు చేయడం, భారతీయ మార్కెట్ కోసం ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ల ఫ్రాంచైజీ హక్కులను పొందడం ద్వారా రిలయన్స్ రిటైల్ తన వ్యాపారాన్ని దూకుడుగా విస్తరిస్తోంది.

జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ జట్టు

- అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఏర్పాటు
- రూ. 2,460 కోట్ల పెట్టుబడులకు రెడీ

డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి విడివడిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్.. ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌రాక్‌తో చేతులు కలిపింది. ఇందుకు సమాన వాటా (50:50)తో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేయనున్నట్లు జియో ఫైనాన్షియల్ తాజాగా పేర్కొంది. తద్వారా దేశీయంగా అసెట్ మేనేజ్‌మెంట్ నిర్వహణకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. దీనిలో భాగంగా రెండు సంస్థలూ 15 కోట్ల డాలర్ల (రూ. 1,230 కోట్లు) చొప్పున ఇన్వెస్ట్ చేయనున్నట్లు తాజాగా వెల్లడించింది. జియో ఫైనాన్షియల్ వనరులు, బ్లాక్‌రాక్ పెట్టుబడుల నైపుణ్యం కలసి జియో బ్లాక్‌రాక్ ద్వారా లక్షలాది ఇన్వెస్టర్లకు కొత్త సొల్యూషన్లు అందించనున్నట్లు వివరించింది. ఈ భాగస్వామ్యంతో దేశీ అసెట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలో డిజిటల్ ఫస్ట్ ఆఫరింగ్స్ ద్వారా మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ లాభం 18% అప్

- క్యూ1లో రూ. 1,402 కోట్లు
- ఆదాయం రూ. 6,738 కోట్లు; 29 శాతం వృద్ధి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్‌ఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 1,402 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో నమోదైన రూ.1,188 కోట్లతో పోలిస్తే ఇది 18% అధికం. ఇక ఆదాయం రూ.5,215 కోట్ల నుంచి సుమారు 29% వృద్ధి చెంది రూ.6,738 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, కీలకమైన అమెరికా మార్కెట్లో ఉత్పత్తుల ధరల క్షీణత ధోరణి కాస్త తగ్గడం తదితర అంశాలు క్యూ1లో మెరుగైన పనితీరుకు దోహదపడ్డాయని బుధవారం ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ, సీఎఫ్‌వో పరాగ్ అగర్వాల్, బ్రాండెడ్ జనరిక్స్ విభాగం సీఈవో ఎంవీ రమణ తెలిపారు. నగదు నిల్వలను కొత్త బ్రాండ్లు.. సంస్థల కొనుగోళ్లు, పరిశోధన.. అభివృద్ధి కార్యకలాపాలపై పెట్టుబడులు మొదలైన అవసరాల కోసం వెచ్చించనున్నట్లు ఇజ్రేలీ వివరించారు. అమెరికాలో జనరిక్స్ విభాగంలో కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ, రష్యాలో పుంజుకోవడం వంటి అంశాల తోడ్పాటుతో అమ్మకాలపరంగా పటిష్టమైన వృద్ధి సాధించగలిగామని



సంస్థ సహ–చైర్మన్ జీవీ ప్రసాద్ వివరించారు. భవిష్యత్ వృద్ధి చోదకాలపై పెట్టుబడులు పెట్టడం, ఆవిష్కరణలను కొనసాగిస్తూనే.. అధిక వృద్ధిని కూడా సాధించాలనే తమ వ్యూహానికి అనుగుణంగా ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు.

క్యూ1లో మరిన్ని విశేషాలు..

- విభాగాల వారీగా, గ్లోబల్ జనరిక్స్ (జీజీ) ఆదాయం 36% వృద్ధి చెంది రూ. 5,426 కోట్ల నుంచి రూ. 6,008 కోట్లకు చేరింది. ఫార్మా సర్వీసెస్, యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ (పీఎస్‌ఏఐ) ఆదాయం 5% క్షీణించి రూ. 671 కోట్లకు తగ్గింది.
- ప్రాంతాలవారీగా.. కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్లో జీజీ ఆదాయం 79% పెరిగి రూ. 3,198 కోట్లుగా నమోదైంది. క్యూ1లో అమెరికాలో 6, కెనడాలో రెండు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టారు.
- భారత మార్కెట్లో ఆదాయం 14 శాతం తగ్గి రూ. 1,148 కోట్లకు పరిమితమైంది.
- యూరప్ మార్కెట్లో ఆదాయం 22 శాతం పెరిగి రూ. 507 కోట్లకు చేరింది.
- వర్ధమాన మార్కెట్లను చూస్తే..ఆదాయం 28 శాతం వృద్ధి చెంది రూ. 1,155 కోట్లకు పెరిగింది.

బుధవారం బీఎస్‌ఈలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేరు 1 శాతం పెరిగి రూ. 5,476 వద్ద ముగిసింది.

టెక్ మహీంద్రా లాభం 38% డౌన్

తొలి త్రైమాసికంలో రూ. 692 కోట్లు

ముంబై: మార్జిన్లు గణనీయంగా కుదించుకుపోవడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా నికర లాభం 38 శాతం క్షీణించి రూ. 692 కోట్లకు పరిమితమైంది. గత క్యూ1లో ఇది రూ. 1,132 కోట్లు. ఇక ఆదాయం రూ. 13,159 కోట్ల నుంచి స్వల్పంగా 3.5 శాతం వృద్ధి చెంది రూ. 13,718 కోట్లకు చేరింది. గత అయిదేళ్లలో చూసిన అత్యంత కఠినమైన క్వార్టర్లలో ఈ త్రైమాసికం ఒకటని సీఈవో, ఎండీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్న సీపీ గుర్నానీ తెలిపారు. కీలకమైన కమ్యూనికేషన్స్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ (సీఎంఈ) విభాగం పనితీరు .. ఆర్థిక ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపినట్లు పేర్కొన్నారు. అయితే, వచ్చే త్రైమాసికంలో పరిస్థితులు మెరుగుపడగలవని ఆయన అభిప్రాయపడ్డారు. మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా కంపెనీ వ్యాపార వృద్ధి అవకాశాలు ఆశావహంగా ఉన్నాయని కొత్త సీఈవో, ఎండీగా చేరిన మోహిత్



జోషీ ధీమా వ్యక్తం చేశారు. క్యూ1లో టెక్ మహీంద్రా ఐటీ సేవల పరిశ్రమలోనే అత్యంత తక్కువగా 6.8 శాతం నిర్వహణ లాభాన్ని నమోదు చేసింది. గత క్యూ1లో ఇది 11 శాతంగా ఉండగా, క్రితం త్రైమాసికంలో 11.2 శాతంగా ఉంది.

క్యూ1లో మరిన్ని కీలకాంశాలు..

- సీఎంఈ విభాగం ఆదాయం 8.2% క్షీణించింది. బీఎఫ్‌ఎస్‌ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా), రిటైల్, రవాణా విభాగాలూ మందగించాయి.
- నికర కొత్త డీల్స్ పరిమాణం 802 మిలియన్ డాలర్ల నుంచి 359 మిలియన్ డాలర్లకు తగ్గింది.
- మొత్తం ఉద్యోగుల సంఖ్య 6 శాతం తగ్గి 1.48 లక్షలకు పరిమితమైంది. అయితే అట్రిషన్ రేటు (ఉద్యోగుల వలసలు) 23 శాతం నుంచి 13 శాతానికి దిగి వచ్చింది.

బీఎస్‌ఈలో టెక్ మహీంద్రా షేరు సుమారు 1 శాతం క్షీణించి రూ. 1,144 వద్ద క్లోజయ్యింది.

బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో కొనుగోళ్లు

- మూడు రోజుల తర్వాత లాభాలు
- అధిక వెయిటేజీ షేర్ల అండ
- సెన్సెక్స్ లాభం 351 పాయింట్లు
- మళ్లీ 19,750 పైకి నిఫ్టీ

ముంబై: బ్యాంకింగ్, ఇంధన, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు బలమైన కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు మూడు రోజుల నష్టాల నుంచి గట్టెక్కాయి. ఇండెక్సుల్లోని అధిక వెయిటేజీ రిలయన్స్, ఎల్‌అండ్‌టీ, ఐటీసీ, ఇన్ఫోసిస్ షేర్లు రాణించడం కలిసొచ్చింది. ఉదయం సెన్సెక్స్ 79 పాయింట్ల లాభంతో 66,435 వద్ద, నిఫ్టీ 52 పాయింట్లు పెరిగి 19,733 వద్ద మొదలయ్యాయి. ఆటో మినహా అన్ని రంగాల షేర్లకు డిమాండ్ నెలకొనడంతో సూచీలు స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 541 పాయింట్లు దూసుకెళ్లి 66,897 వద్ద, నిఫ్టీ 145 పాయింట్లు ర్యాలీ చేసి 19,826 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేసాయి. ట్రేడింగ్ చివర్లో కొంత



అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో సూచీల లాభాలు కొంతమేర తగ్గాయి. చివరికి సెన్సెక్స్ 351 పాయింట్లు పెరిగి 66,707 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు ఎగసి 19,778 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.923 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.470 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరికి ముందు ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా ట్రేడయ్యాయి. అమెరికా స్టాక్ ఫ్యూచర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ 13 పైసలు పతనమై 82.01 స్థాయి వద్ద స్థిరపడింది. క్రూడాయిల్ ధరలు పెరగడం, నెలాఖరు నేపథ్యంలో దిగుమతిదారులను డాలర్‌కు డిమాండ్ నెలకొనడం దేశీయ కరెన్సీ బలహీనతకు కారణమయ్యాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ప్రోత్సాహకరమైన ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు 3.5% లాభపడి రూ.2646 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతానికి పైగా ఎగసి రూ.2,674 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- టాటా మోటార్స్ షేరు ట్రేడింగ్‌లో 4% ర్యాలీ చేసి రూ.665 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 0.18% లాభంతో రూ.641 వద్ద స్థిరపడింది.
- తొలి త్రైమాసికంలో లాభం 4 రెట్లు వృద్ధి చెందడంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) 4% పెరిగి రూ.63 వద్ద ముగిసింది. ట్రేడింగ్ లో 5% పెరిగి రూ.64 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

అభిరుచితో.. అవకాశాలు!

ఆఫ్‌బీట్ కెరీర్స్

ఉజ్వల కెరీర్ సొంతం చేసుకోవాలంటే.. డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు కావడం మినహా మరో మార్గం లేదని భావించే రోజులు పోయాయి. మెడిసిన్, ఇంజనీరింగ్ రంగాలకు దీటుగా ఆఫ్‌బీట్ కెరీర్స్ అందుబాటులో కొచ్చాయి. ఈవెంట్ ప్లానర్, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్, వీడియో గేమ్ డిజైనర్, పర్సనల్ ఫిట్‌నెస్ ట్రైనర్, టీ టేస్టర్ వంటి వినూత్న కెరీర్‌లు యువతకు ఆహ్వానం పలుకుతున్నాయి. హాబీతోనే అద్భుత అవకాశాన్ని అందిస్తున్న పలు ఆఫ్‌బీట్ కెరీర్స్ గురించి తెలుసుకుందాం...

ఈవెంట్ ప్లానర్

సృజనాత్మకత, నిర్వహణ నైపుణ్యాలున్నవారు ఈవెంట్ ప్లానర్ కెరీర్‌ను ఎంచుకోవచ్చు. వీరు క్లయింట్ బడ్జెట్, ప్రాధాన్యత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వివాహాలు, పుట్టినరోజు పార్టీలు, కార్పొరేట్ ఈవెంట్‌లను నిర్వహిస్తారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలో ఫుల్‌టైమ్ ప్లానర్‌గా లేదా క్లయింట్‌ల కోసం ఫ్రీలాన్స్ ఈవెంట్ ప్లానర్‌గా పని చేయవచ్చు.

- **విద్యార్హతలు:** ఈవెంట్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, పబ్లిక్ రిలేషన్స్ లేదా సంబంధిత రంగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉండాలి.
- **కావాల్సిన నైపుణ్యాలు:** ఆర్గనైజింగ్, నెట్‌వర్కింగ్, సహనం, సమస్య పరిష్కారం, కమ్యూనికేషన్, సృజనాత్మకత తదితర స్కిల్స్ తప్పనిసరి.

టీ టేస్టర్

చాలామంది టీ తాగుతారు. కానీ టీ రుచి చూడటాన్ని కూడా కెరీర్‌గా మలచుకోవచ్చని చాలా తక్కువ మందికే తెలుసు. పేరులో ఉన్నట్లుగానే టీ టేస్టర్‌లు వివిధ రకాల టీలను రుచి చూడటం, నాణ్యతను అంచనా వేయడం, నమూనాలు తీసుకుని టీలను వేరు చేయడంలో నైపుణ్యం కలిగి ఉంటారు. తయారీ కంపెనీలు,ఫైవ్ స్టార్ ప్రాపర్టీలు, టీ బోర్డ్ ఆఫ్ ఇండియాల్లో వీరికి మంచి అవకాశాలుంటాయి.టీ మిశ్రమాలను రూపొందించడంలో, కొత్త రకాలను ఉత్పత్తి చేయడంలో అనుభవం ద్వారా టీ టేస్టింగ్ కన్సల్టెన్సీ సేవలు సైతం అందించొచ్చు.

- **విద్యార్హతలు:** ఫుడ్ సైన్స్, అగ్రికల్చర్, హార్టికల్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ. లేదా టీ రుచి,నాణ్యత, రకాలు, మార్కెటింగ్‌లో డిప్లొమా కోర్సు ఉండాలి.
- **కావాల్సిన నైపుణ్యాలు:** కచ్చితంగా అంచనా వేయగల సామర్థ్యం, విశేషమైన రుచిని పసిగట్టే నైపుణ్యాలు, అద్భుతమైన కమ్యూనికేషన్ స్కిల్స్, టీ పరిశ్రమపై పరిజ్ఞానం ఉండాలి.

పర్సనల్ ఫిట్‌నెస్ ట్రైనర్

ఫిట్‌నెస్, ఆరోగ్యం పట్ల మక్కువ ఉన్నవారికి ఈ కెరీర్ నిస్సందేహంగా సరైనదే. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించాలనుకునే వ్యక్తులకు పర్సనల్ ఫిట్‌నెస్ ట్రైనర్‌లు.. వ్యాయామం, ఆహార ప్రణాళికలను రూపొందిస్తారు. ఇవి వారి ఫిట్‌నెస్ లక్ష్యాలను సాధించేందుకు తోడ్పడతాయి. జిమ్‌లు, ఆరోగ్య కేంద్రాలు, కార్పొరేట్ సెటప్‌లు, ప్రైవేట్ గృహాల్లో ఫిట్‌నెస్ ట్రైనర్‌లకు విస్తృత అవకాశాలున్నాయి. ఆన్‌లైన్ వ్యాయామ పాఠాలు, పోషకాహార సూచనలు అందిస్తూ.. ఇంటి నుంచే నచ్చిన వేళల్లో పనిచేయొచ్చు.

- **విద్యార్హతలు:** న్యూట్రిషన్, ఫిట్‌నెస్‌లో డిప్లొమా లేదా సంబంధిత విభాగంలో సర్టిఫికేషన్ కోర్సు ఉండాలి.
- **నైపుణ్యాలు:** కమ్యూనికేషన్, ఆరోగ్యకరమైన జీవనశైలి, ఫిట్‌నెస్, న్యూట్రిషన్‌పై పరిజ్ఞానం, మోటివేషన్ తదితర నైపుణ్యాలు తప్పనిసరి.

వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్

ట్రావెలింగ్, ఫొటోగ్రఫీలపై ఆసక్తి ఉన్నవారు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా కెరీర్ ఎంచుకోవచ్చు. ఈ ఫొటోగ్రఫీలో భాగంగా వివిధ దేశాల్లో మొక్కలు, జంతువులు, ప్రకృతి దృశ్యాలను కెమెరాతో చిత్రీకరించడానికి అనేక ప్రదేశాలకు ప్రయాణించాల్సి ఉంటుంది. కెమెరా లెన్స్ ద్వారా తీసిన చిత్రాలతో వీక్షకుల్లో అనేక రకాల భావోద్వేగాలను రేకెత్తించగలుగుతారు. చాలామంది వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌లు ఫ్రీలాన్సర్‌లుగా పని చేస్తారు. వన్యప్రాణుల కంటెంట్‌ను ప్రచురించే/ప్రసారం చేసే మీడియాలో ఫుల్‌టైమ్ ఉద్యోగిగా కూడా అవకాశాలు అందుకోవచ్చు.

- **విద్యార్హతలు:** ఫొటోగ్రఫీ, మెరైన్, నేచురల్ ఫొటోగ్రఫీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీలో సర్టిఫికేషన్ కోర్సు ఉండాలి.
- **నైపుణ్యాలు:** వైల్డ్‌లైఫ్, ప్రకృతి పట్ల మక్కువ, ఫొటోగ్రఫీలో బలమైన సాంకేతిక నైపుణ్యాలు, అత్యంత సహనం ఉండాలి.

వీడియో గేమింగ్

ఎక్కువగా వీడియో గేమ్‌లు ఆడేవారు, వీడియోగేముల్లోని సృజనాత్మకతకు ముగ్ధులై, వాటిపట్ల ఆసక్తి పెంచుకునేవారు వీడియోగేమర్‌గా తమ కెరీర్‌ను మలచుకోవచ్చు. అధునాతన గేమింగ్ టెక్నాలజీలతో కథ చెప్పే కళను మిళితం చేయగలిగితే గేమింగ్ ప్రపంచంలో దూసుకెళ్లొచ్చు. నిరంతరం నైపుణ్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా గేమింగ్ పోటీ ప్రపంచంలో అవకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

- **విద్యార్హతలు:** కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ లేదా గేమ్ డిజైనింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ లేదా డిప్లొమా ఉండాలి.
- **నైపుణ్యాలు:** సృజనాత్మకత, సమస్య–పరిష్కార నైపుణ్యాలు, సహకరణ సామర్థ్యం, సమయ నిర్వహణ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు.

మేనేజ్‌మెంట్ పీజీకి మార్గం.. మ్యాట్!

మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్.. సంక్షిప్తంగా మ్యాట్! మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశానికి చక్కటి మార్గంగా నిలుస్తోంది.. మ్యాట్!! ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) నిర్వహించే ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా.. జాతీయ స్థాయిలోని ప్రముఖ బిజినెస్ స్కూల్స్‌లో.. మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు! ఏఐఎంఏ-మ్యాట్‌ను ఏటా నాలుగుసార్లు.. ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహిస్తుంది. 2023, సెప్టెంబర్ సెషన్‌కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. మ్యాట్‌తో ప్రయోజనాలు, రాత పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, విజయానికి ప్రిపరేషన్ టిప్స్...



ఎంబీఏ స్పెషల్

» మ్యాట్ స్కోర్‌తో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు
» ఏఐఎంఏ ఆధ్వర్యంలో మ్యాట్ పరీక్ష నిర్వహణ
» సెప్టెంబర్ 2023 సెషన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» అందుబాటులో వందకు పైగా బి-స్కూల్స్

ఎంబీఏ లేదా మేనేజ్‌మెంట్ పీజీ అనగానే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఐసెట్, జాతీయ స్థాయిలో క్యాట్‌పైనే దృష్టి పెడతారు. కాని మేనేజ్‌మెంట్ కోర్సుల అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో చక్కటి అవకాశం.. మ్యాట్. ఐసెట్, క్యాట్ ప్రిపరేషన్‌లతోనే మ్యాట్‌కు కూడా హాజరయ్యే అవకాశం ఉంది.తద్వారా జాతీయ స్థాయిలో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలకు మార్గం సుగమం చేసుకోవచ్చు.

ఏఐఎంఏ

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ).. మేనేజ్‌మెంట్ విభాగానికి సంబంధించి నైపుణ్య శిక్షణ కార్యకలాపాలను నిర్వహించే సంస్థ. భవిష్యత్తు మేనేజ్‌మెంట్ లీడర్లను తీర్చిదిద్దాలనే సంకల్పంతో 1998లో మేనేజ్‌మెంట్ అప్టిట్యూడ్ టెస్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఈ పరీక్ష విధానంలో పాటిస్తున్న ప్రమాణాలను పరిగణనలోకి తీసుకున్న పలు బిజినెస్ స్కూల్స్.. మ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పించేందుకు సిద్ధమయ్యాయి. తాజా ప్రకటనలో 94 ఇన్‌స్టిట్యూట్స్‌నే పేర్కొన్నప్పటికీ.. ఈ స్కోర్‌తో మరెన్నో విద్యాసంస్థలు ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

అర్హత

- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు విధానాల్లో పరీక్ష

- మ్యాట్ సెప్టెంబర్ సెషన్‌ను మూడు విధానాల్లో నిర్వహించనున్నారు. అవి..
- **పేపర్ బేస్డ్ టెస్ట్:** అభ్యర్థులు నిర్దేశిత తేదీలో పరీక్ష కేంద్రంలో ఓఎంఆర్ షీట్ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుంది.
- **ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్:** నిర్దేశిత తేదీల్లో.. పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ టెస్ట్‌కు హాజరవ్వాల్సి ఉంటుంది.
- **ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్:** ఈ విధానంలో అభ్యర్థులు నిర్దేశిత తేదీల్లో ఇంటర్నెట్ ఆధారంగా.. తమకు అనుకూలమైన చోటు నుంచే పరీక్షకు హాజరుకావచ్చు.
- ఈ మూడు విధానాల్లో ఏ విధానంలో పరీక్షకు హాజరవ్వాలనుకుంటున్నారో అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్‌లకు నిర్దిష్టంగా ఏఐఎంఏ తేదీలను ప్రకటిస్తుంది. వాటిని పరిశీలించి తమకు అనుకూలమైన తేదీ, స్లాట్‌ను కూడా దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది. సెప్టెంబర్ సెషన్‌కు సంబంధించి ఆయా తేదీలను కూడా ప్రకటించారు.

అయిదు విభాగాలు.. 200 మార్కులు

మ్యాట్ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, మ్యాథమెటికల్ స్కిల్స్ 40 ప్రశ్నలు–40 మార్కులు, డేటాఅనాలిసిస్ అండ్ సఫిషియన్సీ 40 ప్రశ్నలు–40 మార్కులు, ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ 40 ప్రశ్నలు–40 మార్కులు.. ఇలా మొత్తం 200 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 150 నిమిషాలు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి తప్పు సమాధానానికి నాలుగో వంతు మార్కును తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **పేపర్ బేస్డ్ టెస్ట్ దరఖాస్తు చివరి తేదీ:** 29.08.2023
- **పేపర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** 03.09.2023
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ దరఖాస్తు చివరి తేదీ:** 12.09.2023
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీలు:** 17.09.2023
- **ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్ దరఖాస్తు చివరి తేదీ:** 17.08.2023
- **ఇంటర్నెట్ బేస్డ్ టెస్ట్ పరీక్ష తేదీ:** 20.08.2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://mat.aima.in

మెరుగైన స్కోర్ ఇలా

మ్యాట్‌లో మెరుగైన స్కోర్‌కు అభ్యర్థులు విభాగాల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు ఇంగ్లిష్ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి. స్పీడ్ రీడింగ్‌తో పాటు ఒక అంశాన్ని చదువుతున్నప్పుడే.. అందులోని కీలక అంశాలను గుర్తించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. పంక్చుయేషన్స్ నుంచి ప్యాసేజ్ మెయిన్ కాన్సెప్ట్ వరకూ.. అన్నింటిపై అవగాహన ఏర్పరచుకోవాలి.

అర్థాలు, సమానార్థాలు, ఫ్రేజెస్, వర్డ్ యూసేజ్, సెంటెన్స్ ఫార్మేషన్‌లపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. వీటితోపాటు వొకాబ్యులరీపైనా పట్టు సాధించాలి. ఫలితంగా ఆయా ప్యాసేజ్‌ల్లోని పదజాలాన్ని వేగంగా అర్థం చేసుకుని నిర్దేశిత సమయంలో సమాధానాలిచ్చే నైపుణ్యం లభిస్తుంది. దీంతోపాటు ఒక అంశాన్ని విశ్లేషణాత్మకంగా చదవడం అలవర్చుకోవాలి. చదివేటప్పుడు అందులోని ముఖ్య సమాచారం, ప్రశ్నార్థమైన అంశాలు, కీలక పదాలు గుర్తించే నేర్పు సొంతం చేసుకోవాలి. అందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదవాలి.

ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్

ఈ విభాగంలో ప్రశ్నలు స్వీయ విశ్లేషణ, సూక్ష్మ పరిశీలన ఆధారంగా సమాధానం రాబట్టేవిగా ఉంటాయి. కాబట్టి సమాచారాన్ని సునిశితంగా పరిశీలించడం, పోలికలు, భేదాలు వంటి వాటిని గుర్తించే నైపుణ్యం ఉండాలి.

మ్యాథమెటికల్ స్కిల్స్

దీనికి సంబంధించి అభ్యర్థులు పదో తరగతి స్థాయి మ్యాథమెటిక్స్ టాపిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ప్రాబబిలిటీ, పెర్ముటేషన్స్/కాంబినేషన్స్, నెంబర్స్, అల్‌జీబ్రా, జామెట్రీ విభాగాలపై దృష్టి పెట్టాలి. ఫార్ములా బేస్డ్ ప్రశ్నల సాధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత సమయంలో సబ్జెక్ట్ ప్రిపరేషన్‌తోపాటు ఆయా సెక్షన్లలో ప్రీవియస్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.

డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ

ఈ విభాగంలోని ప్రశ్నలు.. గ్రాఫ్‌లు, ప్యాసేజ్‌లను పేర్కొని అందులో సమాచారం, గణాంకాల ఆధారంగా విశ్లేషించాల్సినవిగా ఉంటాయి. కాబట్టి ఆయా కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. పర్సంటేజెస్, యావరేజెస్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం ఏదైనా ప్రామాణిక మెటీరియల్ లేదా ఆన్‌లైన్ టెస్ట్‌లోని ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇక్కడ కేవలం ఒకే తరహా ప్రశ్నలు కాకుండా.. విభిన్న క్లిష్టతతో కూడిన సమస్యలను సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.

ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్

ఈ విభాగంలో మంచి స్కోర్ కోసం సమకాలీన అంశాలపై దృష్టి సారించాలి. అదే విధంగా స్టాక్ జీకేపైనా పట్టు సాధించాలి. సమకాలీనంగా ప్రాధాన్యం సంతరించుకున్న జాతీయ, అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించిన తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

అమెరికా వీధుల్లో తిరుగుతూ.. ఆకలితో అలమటిస్తూ..

తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై రోడ్లపై గడుపుతున్న హైదరాబాద్ విద్యార్థిని

- రెండేళ్ల కింద ఎంఎస్ చదివేందుకు డెట్రాయిట్ వెళ్లిన లులూ జైదీ
- మానసిక స్థితి దెబ్బతినడంతో ఇటీవల ఆస్పత్రిలో చేర్పించిన తోటివారు
- అక్కడి నుంచి వెళ్లిపోయి షికాగో వీధుల్లో దీన స్థితిలో యువతి
- జైదీని వెనక్కి తీసుకురావాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌కు ఆమె తల్లి లేఖ
- వెంటనే స్పందించిన జైశంకర్.. జైదీని వెనక్కి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన యువతి. రెండేళ్లుగా బాగానే ఉన్నా ఇటీవల తీవ్రంగా మానసిక ఒత్తిడికి లోనైంది. ఆస్పత్రిలో చేర్పినా భయాందోళనతో బయటికి వెళ్లిపోయింది. తన పేరేమిటో కూడా సరిగా చెప్పలేని స్థితికి చేరుకుంది. చివరికి ఆకలితో అలమటిస్తూ అక్కడి వీధుల్లో తిరుగుతోంది. హైదరాబాద్‌లోని మౌలాలి ప్రాంతానికి చెందిన సయ్యదా లులూ మిన్హాజ్ జైదీ దీన గాథ. ఆమెను గమనించిన ఓ హైదరాబాదీ వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఆమె ఎవరన్నది తెలిసింది. ఆమెను హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

ఆకలితో అలమటిస్తూ..

లులూ జైదీ 2021 ఆగస్టులో ఎంఎస్ ఇంజనీరింగ్ చేసేందుకు అమెరికాలోని డెట్రాయిట్‌కు వెళ్లింది. అక్కడి ట్రినీ యూనివర్సిటీలో చదువుతోంది. తరచూ తల్లితో ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేది. కానీ కొన్ని నెలల కింద మానసిక ఒత్తిడికి లోనైంది. నాలుగు నెలల నుంచి తల్లికి ఫోన్ చేయడం కూడా మానేసింది. ఆమె ప్రవర్తనలో విపరీత మార్పును చూసిన తోటి విద్యార్థులు తల్లికి సమాచారం ఇచ్చారు. ఆమె ఆరోగ్యం బాగా దెబ్బతినడంతో స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. లులూ జైదీ తీవ్ర మానసిక ఒత్తిడిలో కూరుకుపోయినట్టు గుర్తించిన వైద్యులు చికిత్స ప్రారంభించారు. కానీ ఆమె ఆస్పత్రిలోంచి వెళ్లిపోయింది. వీధుల్లో తిరుగుతూ, ఎవరేమైనా పెడితే తింటూ గడుపుతోంది. ఈ క్రమంలో షికాగో నగరానికి చేరుకుంది. అక్కడ ఓ వీధిలో ఆకలితో అలమటిస్తున్న లులూ జైదీని అక్కడే ఉంటున్న హైదరాబాదీ గమనించి మాట్లాడారు. ఆమె పేరు కూడా చెప్పలేని పరిస్థితి, ఆకలితో అలమటిస్తున్న తీరును వీడియో తీసి సోషల్ మీడియాలో హైదరాబాద్ గ్రూప్‌లలో షేర్ చేశారు. అమెరికాలోని హైదరాబాదీలు, తోటి విద్యార్థులు ఇది చూసి.. లులూ జైదీని షికాగోలోని సురక్షిత ప్రాంతానికి తరలించి, వైద్యం అందిస్తున్నారు.

హైదరాబాద్‌కు తిరిగి తీసుకొచ్చే ప్రయత్నాలు

లులూ జైదీ దుస్థితి గురించి తెలిసిన ఆమె తల్లి.. తన కుమార్తెను కాపాడి, తిరిగి హైదరాబాద్‌కు తీసుకురావాలంటూ విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాశారు. మరోవైపు సోషల్ మీడియాలోనూ ఈ వీడియో వైరల్‌గా మారింది. ఆమెను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలంటూ విజ్ఞప్తులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన జైశంకర్.. ఆమెను తిరిగి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో షికాగోలోని భారత కాన్సులేట్ జనరల్.. లులూ జైదీ ఎవరి వద్ద ఉందో తమతో టచ్‌లోకి రావాలని విజ్ఞప్తి చేశారు.

మార్పు మన నుంచే ప్రారంభం కావాలి

24వ కార్గిల్ దివస్‌లో గవర్నర్ తమిళిసై



కార్గిల్ యుద్ధంలో మరణించిన జవాన్ల కుటుంబసభ్యులను ఓదార్చుతున్న గవర్నర్ తమిళిసై

హిమాయత్‌నగర్: మార్పు మనఇంట్లో నుంచి..అంటే వ్యక్తి నుంచే ప్రారంభమైతే దేశం ప్రగతిపథంలో ముందుకెళుతుందని గవర్నర్ తమిళిసై అన్నారు. నేటితరం పిల్లలు ఏసీ లేకపోయినా, చెమట పట్టినా భరించలేని పరిస్థితుల్లో పెరుగుతున్నారన్నారు. దేశ రక్షణ, భావితరాల భవిష్యత్‌కు సరిహద్దుల్లో మన సైనికులు రక్తం కారుస్తూ, చెమటోడుస్తూ, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ప్రాణాలను అడ్డేస్తున్నారని చెప్పారు. 24వ కార్గిల్ దివస్ కార్యక్రమం బుధవారం హైదరాబాద్‌లోని కేఎంఐటీలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ దేశంకోసం త్యాగం చేస్తున్న సైనికులను ప్రతిరోజూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేటితరం వారు సినిమా హీరోలు, క్రీడాకారులను మాత్రమే గుర్తించగలుగుతున్నారని, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికులు, వారిత్యాగాల గురించి ఎంతమందికి తెలుసని ప్రశ్నించారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందినవారి కుటుంబీకులకు గవర్నర్ ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. రాజ్యసభ సభ్యుడు వి.విజయేంద్రప్రసాద్, మేజర్ జనరల్ వీకే పురోహిత్, జమ్మూకశ్మీర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సందీప్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'ఎస్‌సీఈఆర్‌టీ' మ్యాగజైన్‌లో సిరిసిల్ల స్కూల్



సిరిసిల్ల, ఎడ్యుకేషన్: 'ఎస్‌సీఈఆర్‌టీ' ఏటా ముద్రించే స్కూల్ లీడర్‌షిప్ అకాడమీ మ్యాగజైన్‌లో సిరిసిల్లలోని గీతానగర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించిన కథనం ప్రచురితమైంది. పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో నిర్వహిస్తున్న రేడియోప్రోగ్రాంకు సంబంధించిన కథనం ప్రచురితమైందని పాఠశాల హెచ్‌ఎం భాగ్యరేఖ చెప్పారు. ప్రతిరోజూ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పిల్లలు రాసిన కథలు, పొడుపు కథలను, ముఖ్యమైన ప్రకటనలను పంచుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమం www.edex ive.com (Educa tional-NewrIndia) వెబ్‌సైట్‌లోనూ ప్రచురితమైందని తెలిపారు.

మల్కాపూర్–విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే

నిర్మించాలని కేంద్రమంత్రి గడ్కరీకి ఎంపీలు కోమటిరెడ్డి, ఉత్తమ్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్–విజయవాడ నేషనల్ హైవే 65కి సమాంతరంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను నిర్మించాలని కాంగ్రెస్ ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖమంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు బుధవారం కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కాగా, ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు కేవలం 44 కి.మీ. మేర మాత్రమే ఆరు లేన్ల పనులు పూర్తయినట్లు చెప్పారు. దీంతో మల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ప్రస్తుత హైవేకు సమాంతరంగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని కోరారు. అంతేగాక హైదరాబాద్–విజయవాడ మధ్య ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలన్నారు. ఈ రహదారిపై గుర్తించిన 17 బ్లాక్‌స్పాట్‌లను వెంటనే మరమ్మతు చేయాలని కోరారు.

కేటీఆర్‌కు ఇండియన్ బిజినెస్ స్కూల్ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: 'అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ' ఎనిమిదో బ్యాచ్ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా మంత్రి కేటీ రామారావును ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఆహ్వానించింది. పంజాబ్‌లోని మొహాలీలో అక్టోబర్ 11న జరిగే కార్యక్రమంలో తమ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించాలని, తెలంగాణ ఏర్పాటు మొదలుకుని ఐఎస్‌బీకి సహాయ సహకారాలు అందిస్తున్న కేటీఆర్ తన అనుభవాలను పంచుకోవాలని సంస్థ డీన్ మదన్ పిల్లుట్ల కోరారు.

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి



కార్మిక కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ జేఏసీ నేతలు, కార్మికులు

సాక్షి, హైదరాబాద్(చిక్కడపల్లి): ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్‌తో టీఎస్ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని రాష్ట్ర కార్మిక కమిషనర్ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రాజిరెడ్డి మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ 24న మూడునెలల్లోగా ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, మూడు నెలలు దాటినా ఎన్నికలు నిర్వహించలేదని ఆరోపించారు. ఎన్నికలు నిర్వహించకపోతే కార్మికశాఖపై కోర్టుధిక్కరణ కేసుకు వెనుకాడేదని లేదని హెచ్చరించారు. ఏడువేల మంది కార్మికులతో కార్మిక కమిషనరేట్‌లో వంటావార్పు నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం కార్మిక కమిషనర్ అహ్మద్ నదీమ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ధర్నాలో కన్వీనర్ వీఎస్.రావు కోకన్వీనర్ కె.యాదయ్య పాల్గొన్నారు.


'గృహ ప్రవేశం' ఎన్నికల తర్వాతే

హైదరాబాద్ స్థిరాస్తి రంగం మందగమనం

- గృహ కొనుగోళ్లకు మధ్యతరగతి ప్రజల వెనకడుగు
- రూ.50 లక్షల లోపు ఇళ్ల విక్రయాలు తగ్గుముఖం
- ఇళ్లు, అపార్ట్‌మెంట్లే కాదు ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూములు, ఆఫీసు స్పేస్ లావాదేవీల్లోనూ తగ్గుదల

ఎడతెరిపిలేని వర్షాలు, ఎన్నికల వాతావరణం, వడ్డీ రేట్ల ప్రభావం, ఐటీ ఉద్యోగుల లే–ఆఫ్‌లు, డిమాండ్–సరఫరా మధ్య వ్యత్యాసం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు కారణాలేవైనా హైదరాబాద్ స్థిరాస్తి రంగం మందగమనంలోకి జారిపోయింది. అపార్ట్‌మెంట్లే కాదు ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూములు, ఆఫీసు స్పేస్ అన్ని లావాదేవీల్లోనూ ప్రతికూల వాతావరణమే కనిపిస్తోంది. ఈ ఏడాది జనవరి– మార్చి మధ్యకాలం (క్యూ1)తో పోలిస్తే ఏప్రిల్–జూన్ (క్యూ2) నాటికి అన్ని విభాగాల విక్రయాల్లోనూ తగ్గుదల నమోదయింది.

–సాక్షి, హైదరాబాద్



కరోనా తర్వాత రెండేళ్లూ ఓకే..

కరోనా తర్వాత రెండేళ్ల పాటు స్థిరాస్తి రంగం బాగానే ఉంది. కానీ ఆ తర్వాత మార్కెట్ క్రమంగా తగ్గుతూ వస్తోంది. సాధారణంగా ప్రతి సార్వత్రిక ఎన్నికలకు 6–8 నెలల ముందు నుంచే స్థిరాస్తి వ్యాపారంలో కొంచెం ఒడిదుడుకులు ఎదుర్కోవడం సహజం. ఏ ప్రభుత్వం వస్తుందో? కొత్త ప్రభుత్వం వస్తే గత ప్రభుత్వ అభివృద్ధి పనులను కొనసాగిస్తుందో లేదో, పాత ప్రభుత్వమే వస్తే మళ్లీ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న సందేహాలు వెంటాడుతుంటాయి. ఇటీవల డెవలపర్లు అనూహ్యంగా అపార్ట్‌మెంట్ల ధరలను పెంచేశారు. ఫలితంగా సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. రూ.50 లక్షల లోపు ధర ఉండే మధ్యతరగతి గృహాలు విక్రయాలు లేక చాలావరకు ఖాళీగా ఉన్నాయి.

గృహ విక్రయాలలో తగ్గుదల..

హైదరాబాద్‌లో అపార్ట్‌మెంట్ల సరఫరా, విక్రయాలు రెండింట్లోనూ తగ్గుదల కనిపిస్తోంది. ఈ ఏడాది క్యూ2లో హైదరాబాద్‌లో 10,470 గృహాలు ప్రారంభమయ్యాయి. అదే క్యూ1లో చూస్తే 14,620 యూనిట్లు ప్రారంభమయ్యాయి. అంటే 3 నెలల వ్యవధిలో గృహ సరఫరాలో 28 శాతం తగ్గుదల నమోదయ్యిందన్న మాట. ఇక విక్రయాలు చూస్తే.. క్యూ1లో 14,280 ఇళ్లు అమ్ముడుపోగా.. క్యూ2లో 13,570 యూనిట్లకు పడిపోయాయి. అంటే 5 శాతం తగ్గాయని అనరాక్ నివేదిక వెల్లడించింది.

ఆఫీసు స్పేస్‌లోనూ క్షీణతే..

నివాస సముదాయాల్లోనే కాదు ఆఫీసు స్పేస్ లావాదేవీల్లోనూ తగ్గుదల నమోదయింది. ఈ ఏడాది క్యూ1లో హైదరాబాద్‌లో 24 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాల లీజు లావాదేవీలు జరగగా.. క్యూ2 నాటికి 23 లక్షల చ.అ.కు పడిపోయాయి. అంటే 3 నెలల్లో 4 శాతం క్షీణత చోటు చేసుకుందన్న మాట. దేశీయ, బహుళ జాతి కంపెనీల విస్తరణ నిర్ణయాల్లో జాప్యం, ప్రపంచ అనిశ్చిత పరిస్థితులు క్షీణతకు ప్రధాన కారణమని రియల్టీ కన్సల్టెన్సీ వెస్టియన్ సీఈఓ శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాలను పరిశీలిస్తే.. ఈ ఏడాది ఏప్రిల్–జూన్‌లో 1.39 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరిగాయి.

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లూ అంతే..



ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 1.47 లక్షల వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల దరఖాస్తులు వచ్చాయని ధరణి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో పార్టిషన్, సక్సెషన్, నాలా కింద వచ్చిన దరఖాస్తులే 40 వేల వరకుంటాయి. అంటే లక్ష డాక్యుమెంట్లు మాత్రమే క్రయవిక్రయాలకు సంబంధించి జరిగాయి. అదే గతేడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు పార్టిషన్, సక్సెషన్, నాలా మినహాయిస్తే.. 1.51 లక్షల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. అంటే గతేడాదితో పోలిస్తే 50 వేల రిజిస్ట్రేషన్లు తగ్గాయన్న మాట.

ఎన్నికల తర్వాతే మార్కెట్‌కు ఊపు



"హైదరాబాద్‌లో మధ్యతరగతి గృహాల మార్కెట్ ఎక్కువగా ఉంటుంది. అయితే ఎన్నికల వాతావరణంలో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇళ్ల కొనుగోలు నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకుంటారు. కాబట్టి 3–6 నెలలు మార్కెట్ ప్రతికూలంగానే ఉంటుంది. ఎన్నికల తర్వాతే స్థిరాస్తి మార్కెట్ జోరందుకుంటుంది." – టీవీ నర్సింహారెడ్డి, స్పేస్‌విజన్ గ్రూప్



రికార్డులను చుట్టబెట్టేశాడు..

మధ్యప్రదేశ్‌కు చెందిన ఆదిత్య పాచోలీ.. కేవలం 14.12 సెకన్లలో రాజ్‌పుత్ రాజస్తానీ పగిడీ(తలపాగా) చుట్టేసి గిన్నిస్ రికార్డును సాధించాడు. చాలామందికి తలపాగా చుట్టుకోవడానికి కొన్ని నిమిషాల సమయం పడుతుంది. అయితే, ఆదిత్య 14 అడుగుల పొడవు, 3 అడుగుల 3 అంగుళాల వెడల్పున్న వస్త్రాన్ని ఇలా సెకన్లలోనే చుట్టేశాడు. 15 ఏళ్లుగా వివిధ రకాల తలపాగాలను చుట్టడాన్ని ప్రాక్టీస్ చేస్తున్న ఆదిత్య.. దీన్ని రికార్డులను సృష్టించడానికి ఉపయోగించాలని అనుకున్నాడు. 2022 ఆగస్టులో 3,716 అడుగుల వస్త్రాన్ని ఉపయోగించి.. తలపాగాను చుట్టడం ద్వారా ప్రపంచంలోనే అతి పెద్ద తలపాగాను చుట్టిన రికార్డును బద్దలుకొట్టాడు. తాజాగా ఈ అతి తక్కువ సమయం రికార్డునూ చుట్టబెట్టేశాడు.



90లో 'నవ' యువకుడు



తక్కువ బరువుతో నెలన్నర ముందే పుట్టాడు.. ఇతన్ని బతికించుకోవడానికి తల్లిదండ్రులు నానాకష్టాలు పడ్డారు.. ఆరోగ్యం అంతంతమాత్రమే.. ఎప్పుడూ జబ్బు పడుతుండేవాడు.. మరి ఇప్పుడు చూడండి.. ముత్తాత అయిపోయాడు.. బాడీ చూడండి.. కుర్రాళ్లు సైతం నోరెళ్లబెట్టాల్సిందే. ఇతని పేరు జిమ్ అరింగ్టన్(అమెరికా).. వయసు జస్ట్ 90 ఏళ్లు!! 83 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే అత్యంత వృద్ధుడైన బాడీ బిల్డర్‌గా గిన్నిస్ రికార్డుకెక్కాడు. మరి ఇప్పుడు ఎందుకు చెప్పుకోవడమా అంటే.. ఏళ్లు గడుస్తున్నా.. తాతగారు తగ్గేదేలే అంటున్నారు. తాజాగా నెవడాలో జరిగిన ప్రొఫెషనల్ బాడీ బిల్డింగ్ పోటీల్లో 80+ విభాగంలో మొదటి బహుమతిని.. 70+ విభాగంలో మూడో బహుమతిని గెలుచుకున్నారట.

– సాక్షి సెంట్రల్ డెస్క్

నెలకు రూ 976.42 కోట్ల 'ఆసరా'

లబ్ధిదారులు 43.81 లక్షలు ● సమాచార పౌర సంబంధాల శాఖ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సమాజంలోని అత్యంత బలహీనవర్గాలకు, ఆపన్నులకు రాష్ట్రప్రభుత్వం అందిస్తూ వస్తున్న ఆసరా ఇప్పుడు దేశంలోనే మేటి పథకంగా నిలుస్తోంది. 2014 నవంబర్‌లో ఆసరా పెన్షన్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. మొదట్లో వృద్ధులు, దివ్యాంగులు, హెచ్ఐవీ–ఎయిడ్స్ బాధితులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులకు ఆసరా పెన్షన్లను అందజేసింది. ఆ తర్వాత బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు, ఫైలేరియా ప్రభావిత వ్యక్తులకు, డయాలసిస్ బాధితులకు ఈ పథకం వర్తింప జేసింది. దివ్యాంగులకు నెలకు ఇచ్చే పెన్షన్‌ను రూ.3,016 నుంచి తాజాగా రూ.4,016కు ప్రభుత్వం పెంచింది. ఇప్పుడు దివ్యాంగులకు పెంచిన మొత్తంతో వార్షికంగా ఆసరా కింద ఇచ్చే పెన్షన్ 11,712 కోట్లకు చేరుతోంది. గత తొమ్మిదేళ్లకాలంలో ఆసరా పథకం ద్వారా సాధించిన పురోగతిని గణాంకాలతో సహా సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

రూ.67.47 కోట్ల నుంచి రూ.976కోట్లకు

ఆసరా పెన్షన్ ల కింద వివిధ కేటగిరీల కింద తెలంగాణ ప్రభుత్వం నెలకు రూ.976 కోట్ల ఆర్థిక భరోసాగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు పెన్షన్లు పొందుతున్న లబ్ధిదారుల సంఖ్య 28,47,855 కాగా 2023 జూన్ నాటికి ఆ సంఖ్య 43,81,338 లకు చేరింది. ఇక వివిధ వర్గాలకు ఇచ్చే పెన్షన్ మొత్తాన్ని కూడా దశల వారీగా గణనీయంగా పెంచింది. 2014లో పెన్షన్ల కింద నెలకు మొత్తం రూ.67.47 కోట్లు ఖర్చు చేయగా.. నేడు ఆ మొత్తం రూ 976.42 కోట్లకు చేరిందని వెల్లడించారు.



మంత్రి ఆమ్లెట్లు.. వారెవ్వా అనేట్టు


తొర్రూరు: నిత్యం అధికారిక కార్యక్రమాల్లో బిజీగా ఉండే గిరిజన సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్ చిరుజల్లులు కురుస్తున్న సమయంలో ఆమ్లెట్లు వేసి ఆకట్టుకున్నారు. బుధవారం హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో తొర్రూరులో రోడ్డు పక్కన హోటల్‌లో మంత్రి కాసేపు ఆగారు. హోటల్ నిర్వాహకులు ఆమ్లెట్లు వేస్తున్న క్రమంలో వారిని ఆపి ఉల్లిపాయ ఆమ్లెట్లు వేసి సిబ్బందికి అందించారు. సమయం దొరికినప్పుడల్లా తానే స్వయంగా ఇంట్లో వంట చేస్తానని మంత్రి చెప్పారు.

ఐటీ రిటర్న్స్.. తెలంగాణ అదుర్స్

రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న పన్ను చెల్లింపుదారులు

- 2022–23 ఆర్థిక సంవత్సరంలో 26.5 లక్షలు దాటిన ట్యాక్స్ పేయర్స్
- గత నాలుగేళ్లలో దేశంలోనే అధికంగా 25 శాతం వృద్ధి
- పన్ను చెల్లింపుదారుల్లో 11వ స్థానంలో తెలంగాణ
- మొదటి స్థానంలో మహారాష్ట్ర.. మిజోరంలో అతితక్కువ రిటర్నీలు





(నోట్: ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారందరూ పన్ను చెల్లింపుదారులు కాదు. ఇక చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే పన్ను చెల్లించని వారు కూడా రిటర్నులు దాఖలు చేస్తారు. మరోవైపు దాదాపుగా అదే సంఖ్యలో పన్ను చెల్లిస్తున్నా కొందరు రిటర్నులు దాఖలు చేయలేరు. ఈ నేపథ్యంలో ఆదాయపు పన్ను శాఖ ఇచ్చే రిటర్నీల వివరాలనే పన్ను చెల్లింపుదారుల వివరాలుగా పరిగణించవచ్చని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు)

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఐటీ రిటర్నులు అదరగొడుతున్నాయి. ఆదాయపు పన్ను శాఖ వర్గాలు ఇటీవల వెల్లడించిన వివరాల ప్రకారం.. గత నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా పన్ను చెల్లింపుదారుల సంఖ్య (ఐటీ రిటర్నులు దాఖలు చేసేవారు)లో 25 శాతం వృద్ధి నమోదు అయ్యింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం నుంచి ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారు 21,58,703 మంది కాగా, 2022–23లో ఈ సంఖ్య 26,92,185కు చేరింది. అంటే నాలుగేళ్లలో 5.34 లక్షల మంది ఐటీ రిటర్నీలు పెరిగారన్న మాట. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంజాబ్, హరియాణాలో 20 శాతానికి కొంచెం అటూ ఇటుగా పన్ను చెల్లింపుదారులు పెరిగారు. దేశంలోని అన్ని రాష్ట్రాల సగటు కలిపినా 15 శాతమే. కానీ మన రాష్ట్రంలో మాత్రం గత నాలుగేళ్లలో 25 శాతం పెరుగుదల చోటు చేసుకోవడం గమనార్హం. అయితే తెలంగాణ కంటే ఎక్కువమంది పన్ను చెల్లింపుదారులున్న రాష్ట్రాలు కూడా పదికి పైగానే ఉన్నాయి. ఇందులో దక్షిణాదికి చెందిన కర్ణాటక, తమిళనాడు ఉన్నా.. జనాభాతో పోలిస్తే అవి తెలంగాణ కంటే పెద్ద రాష్ట్రాలు. ఇక రెండు తెలుగు రాష్ట్రాలను కలిపితే ఐటీ రిటర్నీల సంఖ్య దక్షిణాదిలోనే ఎక్కువగా 48.5 లక్షలు దాటడం గమనార్హం. కాగా దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువగా మహారాష్ట్రలో 1.13 కోట్ల మంది రిటర్నీలు ఉన్నారు. పన్ను చెల్లింపుదారులు కోటి దాటిన ఏకైక రాష్ట్రం కూడా ఇదే. ఆ తర్వాత గుజరాత్, యూపీ, రాజస్తాన్ రాష్ట్రాలున్నాయి.

దేశవ్యాప్తంగా 7,40,09,046 మంది రిటర్నీలు

దేశంలోనే రిటర్నీలు అతి తక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరం. ఇక్కడ కేవలం 7,371 మంది మాత్రమే ఏటా ఐటీ రిటర్నులు దాఖలు చేస్తున్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఇక్కడ 3,808 మంది మాత్రమే పన్నులు చెల్లిస్తుండగా, నాలుగేళ్లలో 3,500 మంది పెరిగారు. కేంద్ర పాలిత రాష్ట్రమైన లక్షద్వీప్‌లో గత నాలుగేళ్లతో పోల్చుకుంటే రిటర్నీల సంఖ్య స్వల్పంగా తగ్గింది. 2019–20లో 4,760 మంది రిటర్నులు దాఖలు చేయగా, 2022–23లో 4,454 మంది మాత్రమే తమ ఆదాయ వివరాలను సమర్పించారు. కనీసం లక్ష మంది కూడా రిటర్నులు దాఖలు చేయని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో త్రిపుర, సిక్కిం, నాగాలాండ్, మేఘాలయ, మణిపూర్, డామన్ డయ్యూ, దాద్రా నాగర్‌హవేలి, అరుణాచల్‌ప్రదేశ్, అండమాన్ దీవులు ఉన్నాయి. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కలిపి ఐటీ రిటర్నులు దాఖలు చేసిన వారి సంఖ్య 2022–23లో 7,40,09,046గా నమోదయింది.

స్పెషల్ రైళ్ల పొడిగింపు



సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో వారానికోసారి నడిచే కొన్ని స్పెషల్ రైళ్లను మరికొంత కాలం పొడిగించారు. ప్రతి గురువారం నడిచే హైదరాబాద్–తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను ఆగస్టు 31 వరకు, శుక్రవారం నడిచే అదే రైలు తిరుగు ప్రయాణ సర్వీసును సెప్టెంబర్ 1 వరకు, శనివారం నడిచే గోరఖ్‌పూర్–మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబరు 2 వరకు, సోమవారాలు నడిచే అదే రైలు రిటర్న్ సర్వీసును సెప్టెంబర్ 4 వరకు, బుధవారం నడిచే విశాఖపట్నం–సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 27 వరకు, గురువారాల్లో నడిచే అదే రైలు తిరుగుప్రయాణ సర్వీసును సెప్టెంబర్ 28 వరకు, మంగళవారాల్లో నడిచే విశాఖపట్నం–మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 26 వరకు, బుధవారాల్లో నడిచే అదే రైలు రిటర్న్ సర్వీసును సెప్టెంబర్ 27 వరకు పొడిగించారు. కాగా, కర్ణాటకలోని హుబ్లీ డివిజన్ పరిధిలో కొండ చరియలు విరిగి పడటంతో కొన్ని రైళ్లను పూర్తిగా, మరికొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. తిరుపతి–వాస్కోడగామా ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్–వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌లను 27, తిరుగుప్రయాణంలో అవే రైళ్లు 28న రద్దయ్యాయి. 28న వాస్కోడిగామా–జసిడ్ ఎక్స్‌ప్రెస్ వాస్కోడిగామా–లోండా మధ్య, వాస్కోడిగామా–కాచిగూడ ఎక్స్‌ప్రెస్, వాస్కోడిగామా–షాలిమార్ ఎక్స్‌ప్రెస్ వాస్కోడిగామా–హుబ్లీ మధ్య పాక్షికంగా రద్దయ్యాయి. వాడీ సమీపంలోని దర్గాలో ఉర్సు ఉత్సవాల కోసం ఆగస్టు 1, 3 తేదీల్లో హైదరాబాద్–వాడీ మధ్య అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ఇవి బేగంపేట, సనత్‌నగర్, హఫీజ్‌పేట, లింగంపల్లి, నాగులపల్లి, గొల్లగూడ, శంకర్‌పల్లి, చిట్టిగడ్డ, వికారాబాద్, ధారూర్, రుక్మాపూర్, తాండూరు, మన్‌తట్టి, నవాంధ్గీ, కుర్గుంట, సేరమ్, మల్‌ఖైడ్ రోడ్ స్టేషన్‌లలో ఆగుతాయని దక్షిణమధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.